SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

సూర్యనారాయణరావు, తల్లాప్రగడ

దుర్జయదురోదరము అను
ద్రౌపదీవస్త్రాపహారణము

కాకినాడ, 1906

Record no. 520

Sūryanārāyaṇarāvu, Tallāpragaḍa

Durṇayadurōdaramu anu Draupadīvastrāpaharaṇamu

Kākināḍa, 1906

Record no. 520

Bibliographic Record Target

సూర్యనారాయణరావు, తల్లాప్రగడ.

దుర్ణయదురోదరము అను ద్రౌపదీవస్త్రాపహరణము / తల్లాప్రగడ సూర్యనారాయణరావుచే రచియింపఁబడినది.- 1. కూర్పు.- కాకినాడ : శ్రీసావిత్రీ ముద్రాక్షరశాల, 1906.

88, 5 p. ; 21 cm.

Record no. 520

Sūryanārāyaṇarāvu, Tallāpragaḍa.

Durṇayadurōdaramu anu Draupadīvastrāpaharaṇamu / Tallāpragaḍa Sūryanārāyaṇarāvucē raciyimpam̐baḍinadi.- 1. kūrpu.- Kākināḍa : Śrīsāvitrī Mudrākṣaraśāla, 1906.

88, 5 p. ; 21 cm.

Record no. 520

సారస్వత నికేతనము, వేటపాలెం.

గ్రంథసంఖ్య 4286 894.8121

ఈగ్రంథమును యిందు క్రింద కడపటిదిగా యుండు తేదీలోపల వాపసు యివ్వవలెను

6.4.43		
26.12.46		
18.2.47		
25.10.47		
30.6.50		
23.4.54		
4.9.56		
25.4.76		

దుర్ణయదురోదరము

అను

ద్రౌపదీవస్త్రాపహరణము

ఇది

తణుకు డిస్ట్రిక్టు మునసబుకోర్టు ప్లీడరు.

తల్లాప్రగడ సూర్యనారాయణరావుచే

రచియింపఁబడిన

ఆఱంకముల నాటకము.

మొదటికూర్పు 500.

కాకినాడ

శ్రీ సావిత్రీ ముద్రాక్షరశాలయందు

ముద్రించి ప్రకటింపఁబడియె.

1906.

దనివెల 0-8-0] [అంచెకూలి కాక

ఉపోద్ఘాతము.

భారతకథయనిన జనులకుఁ బరమానందము. అయ్యది దృశ్యరూపముగనుండినచో మఱింతయానందకరముగానుండుననుట యొకవింతలోనిదికాదు. కృష్ణనిరాయబారము మొదలు యుద్ధావసానమువఱకునుగల కథ వేణీసంహారమనుపేర సంస్కృతమందొక నాటకముగా విరచింపఁబడియున్నది. అయ్యది యిటీవల మహారాజశ్రీ వడ్డాదిసుబ్బారాయఁడుగారిచే నాంధ్రీకరింపఁబడినది. తదనురూపముగా నజ్ఞాతవాసకథయును ద్రౌపదీస్వయంవరకథయును నామిత్రులు కొందఱు తెనుఁగున స్వతంత్రనాటకములుగ వ్రాసిరి కాని భారతకథకంతకును మూలకారణమైయున్న యీద్రౌపదీవస్త్రాపహరణ గాథమాత్రము నాటకరూపమున వెలువడదయ్యెను. ఆకొఱంతఁబాపఁదలంచి నేనీనాటకము 1893 సంవత్సరమున వ్రాయఁబూనుకొని కొలఁదికాలములోనే దీనినిబరిసమాప్తినొందించితిని; కాని కొన్ని కొన్ని యంతరాయములచే నింతవఱకును నియ్యది ముద్రాయంత్రముఖమునఁబడదయ్యె. భారతమున నీకథకొన్ని పద్యములయందుమాత్రమే యిమిడియున్నది. నేనాకథనుగ్రహించి స్వతంత్రముగఁ గొన్ని కల్పనలను జేసి ద్యూతదుర్ణయము జనులకు వెల్లడియగునటుల కథాస్వరూపము నేర్పఱచి యందందుసమయానుకూలమగు మార్పులనుగావించి, ఆఱంకముల నాటకము వ్రాసితిని. అయ్యది దీనినామకరణముచేతనే తెలియఁగలదు. "ఇదుకు మూలంబుశకుని." ఆతనిదుస్తంత్రములె భారతయుద్ధమునకంతకును గారణము. ఈనాటకమందు ప్రాసంగికభాగమాతనియందుఁ గొంచెముగ నేయుండినను ఆతనియుపదేశబలము ప్రధానముగానుండునని నాయాశయము. గ్రంథములువ్రాయుటకు నాకిదియె ప్రథమప్రయత్నమగుటచే నాయుద్యమమెంతవఱకు ఫలియించెనో, దానిని నిర్ణయింపఁజదువరులేసమర్థులు. భాషాప్రావీణ్యము విశేషముగా సంపాదించుటకు సమయముచాలని వ్యాపారాశ్రయుఁడనగుటచే నిందే వేనిదోసములుకొన్ని దొరలియుండవచ్చును. రసజ్ఞులువానిని దయాపూర్వకముగఁ జూపినచో మఱియొకకూర్పునందవి సవరించుకొనఁ బ్రయత్నించెదను. ఈనాటక కథాస్వరూపము నేర్పఱచుటలో నాకు సహాయకారిగానుండిన మామిత్రులు మ॥ అయ్యగారి నారాయణమూర్తి బి. యె. గారికిని, దీని వ్రాతప్రతులనన్నిటిని జక్కఁగఁ బరిశీలించివ్రాసి ముద్రాయంత్రమునకిచ్చుటలో నాకుచేదోడువాదోడుగానున్న మ॥ బాలాంత్రపు వేంకటరావుగారికిని, నేనెంతయుఁ గృతజ్ఞుఁడనగుచున్నాఁడను.

ది 1[illegible]-4-1906 సం॥రం
[illegible], కృష్ణ జిల్లా.

ఇట్లు
తల్లాప్రగడ సూర్యనారాయణరావు.

ఇందువచ్చుపాత్రములు.

పురుషులు.

1. దుర్యోధనుఁడు. అం. 1-2-3-6 లలో } దుష్టచతుష్టయము.
2. కర్ణుఁడు. అం. 1-2-3-6 లలో
3. శకుని. అం. 1-2-3-6 లలో
4. దుశ్శాసనుడు. అం. 5-6 లలో
5. ధృతరాష్ట్రుఁడు. అం. 2-6 లలో.
6. ధర్మరాజు. అం. 3-6 లలో } పంచపాండవులు.
7. భీముఁడు. అం. 6 లో
8. అర్జునుఁడు. అం. 6 లో
9. నకులుఁడు. అం. 3-6 లలో
10. సహదేవుఁడు. అం. 6 లో
11. ప్రాతికామి. అం. 4-5 లలో—దుర్యోధనునిపరిచారకుఁడు.
12. విదురుఁడు. అం. 6 లో.
13. భీష్ముఁడు. అం. 6 లో.
14. ద్రోణాచార్యులు. అం. 6 లో.
15. అశ్వత్థామ. అం. 6 లో.
16. వికర్ణుఁడు. అం. 6 లో—దుర్యోధనునితమ్ముఁడు.

స్త్రీలు.

1. ద్రౌపది. అం. 4-5-6 లలో.
2. చారుమతి. అం. 4-5 లలో—దుశ్శాసనునిభార్య.
3. లవంగిక. అం. 4-5 లలో—ద్రౌపదిచేటి.
4. గాంధారి. అం. 6 లో.

ఇంకను సందర్భానుసారముగఁ గంచుకిభటులుమొదలైనవారు వచ్చుచుందురు.

శ్రీరస్తు.

దుర్ణయ దురోదరము.

ప్రథమాంకము.

నాంది.

ఒకఫల మాసచేయ మతి యొందు లభించుట కేదిహేతువో?
సుకృతము దుష్కృతంబు సమమాత్రముసం దిరుగాడు జేసనో?
ప్రకృతి ననాదియై సకలప్రాణుల బంధము సేయునెద్దియో?
ప్రకటిత కర్మబంధ మది పాలన సేయుత మిమ్ము నెప్పుడున్.

మ. తనులోఁ గొల్చెడు భక్తసంతతుల చిత్తంబుల్ పరీక్షింప, దు
ర్జనులంగూర్చి, తదీయ కల్పిత విపజ్జాలంబులంద్రోసి, పె
న్వనటుం గుందుతఱిన్ వెలార్చుచు జగద్వ్యాప్తంబుగా వారిపా
వననామంబు వెలుంగఁజేసెడి పరబ్రహ్మంబు మిమ్మేలుతన్

సూత్ర—(నాంద్యంతమునఁ బుష్పాంజలిం జల్లి.)

(తనలో) ఏమి! నాయదృష్టము! ఈదినమున సకల కళాకుశలులగు మహాజనులెందఱందఱో, మా యాటపాటలచే నానందమునొంద నీసభారంగమునకు విచ్చేసి నేత్రోత్సవంబు సేయుచున్నవారు. నేనిపుడెద్దియేని యొకనాటకముం బ్రయోగించి వీరి మనంబుల నాకర్షింపఁ బ్రయత్నించెదను. (ఆకసమువంకఁ జెవియొగ్గి) ఆఁ. సభ్యులేమనుచున్నారు?

గీ. "సుప్రసిద్ధేతి వృత్త సుశోభితంబు,
ధర్మజాత మనోహారి నిర్మలంబు,
జగదధీశ్వర మాహాత్మ్య సంభృతంబు,
నైన యభినవనాటకం బాడవలయు॥"

అనికదా! యనుచున్నవారు. అటులనే కానిండు. (ఇంచుక యోచించి ప్రకాశముగ) ఈవిషయమున మాసామాజికుల ప్రజ్ఞావిశేషములు బాగుగ నెఱింగిన నాటకచరిత్రోడ ముచ్చటించెద. (తెరవంకఁ దిరిగి)

పంచచామరములు.

జంఝూటిరాగము. చాపుతాళము.

చెలీ! మనోహరా! బిరానఁజేరి ముచ్చటింపఁగా
నలంకృతాంగివైన పత్నిమందు నిందు రాఁగదే!

నటి—(ప్రవేశించి)
విలంబనంబులేదునాథ! వేగిరంబెవచ్చి నా
నలంఘనీయమైన యుష్మదాజ్ఞయేమొ తెల్పుఁడీ.

సూత్ర—అదే! సభాస్థలంబువంక నంబుజాక్షి! చూడుమా!
ముదంబు నొందఁగూడిరింక మోదమెట్లు గూర్చెదో?

నటి—సుధీంద్రు లిందు నెంద ఱేని చూడవచ్చియుండఁగా
ముదంబుఁగూర్ప నౌనె మమ్ము బోంట్లకట్టివారికిన్.

సూత్ర—గుణాగుణజ్ఞులెందు మేలు కొంచెమేని గల్గినన్
ధృణంబు మేరువంచు నెంచి తృప్తి నొందకుందురే.

నటి—గణింతురా! మరందమెంత గల్గునంత పుష్పలి
ఢ్గణంబు పూవునుండి కోరిలి కాదె మోదమందెడిన్॥

సూత్ర—ఆర్యా! యీసభాస్తారులందఱు నిట్లనుజ్ఞ నొసంగుచున్నవారు.

"గీ. సుప్రసిద్ధేతివృత్తమ" నుపూర్వోక్త పద్యమును
మరలఁ జదువుచున్నాఁడు.

నటి—ప్రాచీన కవికృత నాటక రసార్ణవంబున నోలలాడు నీసభాస్తారుల మనంబుఁ నూతన నాటకంబుల నేల యభిలషించుచున్నవో?

సూత్ర—చెలీ! అట్లు కాదు. చూడు!

గీ. మధుర ఫల రసముల మాఱుమసలు జిహ్వ
పుల్లకాయలపైఁ గూడఁబోవుచుండు
ననుదినంబును నొకరుచియందె తగుల
నన్యరుచు లానఁ బోమనసగును గాదె.

నటి—అటులైన మీరిప్పుడే నాటకముం బ్రయోగింప నెంచితిరి?

సూత్ర—ఇంతకుమున్న మనసామాజికులు ప్రయోగింప వేగిరపడుచున్న "దుర్ణయ దురోదరంబు" నే ప్రయోగింతము.

నటి—నాథా! అదియెవ్వరో బొత్తిగ నప్రగల్భుండు వ్రాసినట్టులున్నదియే. అగ్రం

థమును రచియించినవారెవ్వరు? మఱచితిని!

సూత్ర—ఉ. ఆయత తల్లప్రగ్గడ మహాన్వయ సంజనితుండు లక్ష్మనా
రాయణ మంత్రి దత్తసుతుఁడై తగు వేంకటరామ మంత్రికిన్
శ్రీయుత లచ్చమాంబకు జనించిన యగ్రసుతుండు సూర్యనా
రాయణ మంత్రిచేసె విబుధావళి నెమ్మనముల్ దలిర్పఁగన్.

నటి—సరి! ఇదియా! వారు కోరిన కోరికకును మనమాడెడి యాటకును సరిపోయి నది!

సూత్ర—ఏమది? అంతయీసడించితివి?

నటి—చూడు! నాథా!

ఉ. ఆడెడువార మజ్ఞులము, యాడఁదలంచిన గ్రంథమన్నఁబే
రాడని వానిచే రచిత మందఱు నేఁడిటఁజుండి తేంద్రులే
కూడిరి, మీకెటుల్ మనసు కొల్పెనో యిట్టినవీన నాటకం
బాడను నీడ? నింకఁ బరిహాసముగాక మఱేమి యయ్యెడిన్.

సూత్ర—ప్రేయసీ! అది యట్లు కాదుసుమీ!

గీ. ఆడువారము మనమెట్టులాడుచున్న
గ్రంథవిరచన మది యెట్లుకానఁబడినఁ
బ్రవిమలంబగు వస్తువర్ణనముఁ గనిన
నాదరింపక మానరీ యార్యులబల.

చూడు.

ఉ. భారతమీ ప్రపంచమునఁ బండిత పామర సేవ్యమందువి
స్తారయశోవిలాసియగు ధర్మతనూజుని మాన్య వర్తనల్
భూరిత మౌనిరాసములు, పుణ్యాజనవ్రజపూజనీయముల్
వారిజనంబు లట్లుగుట స్తోత్రము సేయుదురెల్ల వేళలన్.

అందీ ద్రౌపదీ వస్త్రాపహరణ పర్యవసితంబగు దుర్ణయదురోదర వృత్తాంతంబు కర్ణాకర్ణికగా వినుటయెకాని కన్నులకఅవుదీఱఁ బ్రయోగింపఁగని యెఱుంగము. అయిన నవీననాటకాలోకనాభిలాషులగు నీసభ్యులంగూర్చి ముందుగ నొక విజ్ఞాపనము జేసికొనియెద.

చ. పరిమళయుక్తమై తనరు భాసుర పుష్పముఁ జేరి కంటకో
త్కరమును గాననయ్యెడి విధంబున నొప్పులతోడఁ దప్పులున్

సరస మెలంగుచుంట సహజం బగుఁగాన సుధీంద్రులార! యిం
దరయఁగఁ దోఁచులోపముల నన్నిటి సైరణ సేయవేఁడెదన్.

నటి—అట్లయిన నన్నిపుడేమి సేయుమని యనుజ్ఞ?

సూత్ర—ప్రస్తుత కార్యానురూపముగ భగవద్రూప భాసంతంబగు నీవసంతమును గానముసేసి సభవారి కుతూహలముం గొనసాగింప నుపక్రమింపుము.

ఉత్సాహవృత్తము.

కాంభోజిరాగము. రూపక తాళము.

నటి—ఈవసంతకాలమెంత యింపునింపుచుండెనే
పూవిలుదొర బలఁగములకు పొలుపు నెఱపుచుండెనే
మావిమోక లెపుడులేని మంజులత వహించెనే
కోవెల కలకంఠమలరఁ గూజిత మొనరించెనే.

సీ. ఏమూలనుండెనో యెవ్వరు నెఱుగని కోయిలల్ హాయిగాఁ గూయసాగె
నేకాలమునఁ బూలనెఱుఁగని మల్లికల్ విరులతో వెలలేని విందుసేసె
గడగడ లాడించి ముడిఁగించు చలిగాలి కడుఁగోర్కెలిడు చల్లగాలియయ్యె
కాతాపలను దాల్చి కడు హేయముగ నుండు తరువులు మృదులచ్ఛదములఁ దాల్చె.

గీ. రుచు లెఱుంగని జలముల రుచులుగల్గెఁ
బరిమళ ద్రవ్యములు నేఁడు బయలఁబడుట
సరసులానంద పారవశ్యమును జెంది
రలవియేమెన్న నీవసంతావసరము.

సూత్ర—ప్రేయసీ! ఏమిది? స్వవచన వ్యాఘాతముఁ గావించుకొంటివి? నవీనం బెద్దియైన సంతోషదాయకంబు కాదని వాదించు నీరసన, దానినే కేవలసుఖప్రదాయకంబుగ నభివర్ణించె. అదియటుండ నీవర్ణనమునఁ గుసుమాకర సమయంబు కేవల గుణభూయిష్ఠంబయ్యె. యోచించి చూడ నదియును గళంక విరహితంబుగాదు సుమా! ఎట్లనిన:—

గీ. సకలహృదయాను మోది వసంతమయ్యు
కాముక జనౌఘ సంతాపకారి, చూడ;
అల్లధర్మజు రాజసూయాధ్వరంబు
కరము దుర్యోధన విచారకరము గాదె.

(ఇది ప్రస్తావన.)

శ్రీరస్తు.

దుర్ణయదురోదరము.

ప్రథమాంకము.

రంగము:—హస్తినాపురములోని దుర్యోధన భవనము.

(విషాదముతో దుర్యోధనుఁడు ప్రవేశించుచున్నాఁడు)

దుర్యో—(తనలో) ఆహా!

ఉ. చల్లని పూలపాన్పుపయి సారసలోచన లగ్రములొత్తఁగా
నల్లనఁ జామరంబులను హాయిగ వీవఁగ బాలికామణుల్;
సల్లలిత ప్రశంసనము సల్పుచుఁ బల్వురు చెల్మికాండ్రతోఁ
బెల్లుగ నింద్రభోగములఁ బెక్కుదినంబులు సౌఖ్యమందితిన్.

అట్టినాకు నేనాఁడు నెఱుంగని యీమనోవైకల్యం బసంభావితంబుగ సంభవంబయ్యె. దీనికెల్ల నయ్యధ్వరంబె కదా కారణంబు? అధ్వరంబేటి కారణంబు? అది యట్టిదని యెఱుంగక నేనచ్చటి కేగుటయె కారణంబు. పోతిఁబో! పోయినవాఁడఁ బోయినట్టు రాక యనవసరంబుగ నచ్చటి వైత్రసము నేల పైపైచికొంటిని? అదియును బోనిమ్ము. అందఱితోడ మరలిరాక తత్సభాసందర్శన కుతూహలంబేల తెచ్చిపెట్టుకొంటి. వినోదంబని యరిగి యచ్చట విహరింపుచు నాయాఁడుదాని పరిభవమునకు నే నేలపాలుగావలె. ఇదియంతయు నాయవివేకంబె కాక మఱి యన్యంబేమున్నది? ఔరా! ఈవిచారపిశాచము నన్నెంతగా బాధించుచున్నది!

చ. ప్రియసఖు లెవ్వరేమయిన భృత్యజనంబెటు సంచరించినన్
నయగుణ పూర్ణతన్ సలుపు నాదు ప్రజాపరిపాల నాదుల
న్నియు నొరు లాక్రమించినను నిస్తులసంపద సౌఖ్యరాసులే
మయినను వెఱ్ఱివానివలె నారయుచుంటఁ దటస్థమయ్యెఁగా!

వేయేల? రాజ్యవిషయంబులన్నియుఁ బూజ్యంబులైనవి. అనుదినంబును [illegible]

చేయుచుండు జననీజనక సందర్శనంబునకైనను నేడునాకు నిచ్చపోడమకున్న యది. పాండుపుత్రుల యశంబిప్పుడా సేతు శీతాచల మహీతల విశ్రాంతంబైయున్నది.

ఉ. ఎన్నఁడజాతశత్రు సిరులెల్ల హరించి సుఖింతునో? మనం
బెన్నఁడు చల్లనౌనో? పతులే పురిమండట యాజ్ఞసేనినే
నెన్నఁడు మానభంగ మొనరింతునో? గాని సమస్తముండినక
గన్నుల నిద్దరాదు, చవిగా విసుమంతయు నన్నపానముల్.

కావున వారల యశంబునకు మాలిన్యంబుఁ గల్పించు తెఱంగారయవలయు. నాప్రాణసఖుండగు కర్ణునితోడ నీవిషయంబున ముచ్చటించి తగు ప్రతికారంబారయ వలయు: (అనియోచించుచుఁ గూర్చున్నాఁడు.)

(అప్పుడు కర్ణుఁడు ప్రవేశించుచున్నాఁడు)

కర్ణ— గీ. శమననందను రాజసూయమున కేగి
మరలివచ్చిన దాదిగ మానృపాలుఁ
డమితచింతాని మగ్న హృదబ్జుఁడగుచు
హితులకైనను గన్పడఁడేమి కతమొ?

అట్లగుట నేనిప్పుడు తత్కారణం బారయవలయును. (అని రెండడుగులు నడిచి ముందు వైపునకుఁ జూచి) అదిగో! అతని మాతులుండగు సౌబలుండీలాగుననే వచ్చుచున్నవాఁడు. అతనిం గనుంగొనియెద. (సమీపించి) ఓయీ! మిత్రమా!

(అంత శకుని ప్రవేశించుచున్నాఁడు.)

శకు—(ముందునకుఁజూచి) ఓహో! మిత్రుఁడు కర్ణుఁడా! అలస గమనంబులనంచయానల మించి, యడుగుల లెక్కిడుకొనుచు నెచ్చటికిట్లు బయలుదేఱితివి?

కర్ణ—అలసగమనంబులును, హంసయానంబులును, అంతఃపురముఁ జేరియుండువారికిఁ గాని మాకెట్లు లభ్యంబగును? మిత్రుఁడా! నిన్నుఁ జూడవలయుననియే బయలుదేఱితిని.

శకు—ఏమిది? మాయందింత యవ్యాజ కరుణాకటాక్షము? ఈదినమున నెద్దియో యొక విపరీతమున్నది.

కర్ణ—ఏమోయి! ఎన్నఁడును మాయిల్లు ద్రొక్కనట్లు నన్నిట్లు కోడిగము సేయుచుంటివి?

శకు—ఇందుకోడిగ మేమున్నది? పెలవైనచో సిద్ధముగనుండు వానింగూర్చి వృథా శ్రమంబేల చెందితిరని యట్టులంటిని. ఇప్పుడంతటి తొందరపని యేమికలిగినది?

కర్ణ—పనికేమున్నది? మన మహారాజు రాజసూయముఁ జూచివచ్చి నన్నిదివఱకును బిలువఁబంపఁడాయె. ఎన్నఁడు నింతతడవు సంగడికాండ్రతో సమావేశంబు లేకుండువాఁడుకాఁడు. ఆవిషయమున నీకేమైనఁ దెలియునేమోయని యడుగ బయలు వెడలితిని.

శకు—అట్లయిన మనమిద్దఱ మేక కార్యార్థులమే.

కర్ణ—నీవుగూడ నావెంట వచ్చెదవా? పోయివత్తము.

(అని యిరువురును బరిక్రమించి మఱలఁ బ్రవేశించుచున్నారు.)

శకు—అదిగో! మన మహారాజిచ్చట నెద్దియో యోచించుచుఁ గూరుచున్నవాఁడు చూడు.

చ. కనులరమోడ్చి, మిక్కిలిగఁ గాంతిఁ దొఱంగిన మోము కుంచితం
బొనరిచి, మీదిపంట నధరోష్ఠముఁ బీడనఁ జేసికొంచు దృ
ష్టినవనినుండి పైకిడక చేష్టలకెల్లను స్వస్తిచెప్పి, నె
మ్మనము విషణ్ణతంబొరయ మాన్పడియుండె నితండిదేమొకో!

ఈతఁడేదో దీర్ఘవిచారములో మునిఁగి యెట్టయెదుటి వారింగూడఁ గననేరకున్నవాఁడు!

(దుర్యోధను నుద్దేశించి) అబ్బాయీ!

చ. కుసుమము లెండచేఁ గమలి కోమలతంబెడబాయు వైఖరిన్
మిసమిస లాడు నీదు కడుమెత్తని మేను వివర్ణమయ్యె, నీ
పసదన మెల్లఁబోయి కనుపట్టెఁ గనుంగవనుంటఁ బ్రాణముల్
కసరక నీమదిం గలుగు గాఢవిచారమ దేమొ తెల్పుమా!

(కర్ణునింగని) ఏమి నామాట లీతని వీనులంజొరకున్నవి!

కర్ణ—(దుర్యోధను నుద్దేశించి) సమస్త సామంత మహీకాంత మస్తక ప్రశస్త మణి గభస్తినీరాజిత చరణసరోజ! దుర్యోధనమహారాజ! ఇట్లు చింతాక్రాంతుండవై యుండ నేఁడేమి కలిగె?

చ. ధరణిపులెల్ల నీయడుగుదమ్ములు భక్తినిఁ గొల్చుచుండిలో
నరమరలేమిలేక భవదాజ్ఞ చెవింబడి నంతమాత్రనే
శిరసునఁదాల్చి సే యొనరఁజేయ సదా పడిగాపులుండఁగాఁ
గరము వికాసముందొఱఁగి గాసిలనేమి కతంబొ? మిత్రమా!

దుర్యో—(నిట్టూర్పు నిగిడించి) ప్రియసఖుఁడు కర్ణుఁడా! (శకునివంకఁ దిరిగి) మామా!

మీకింతసేపైనది యిచ్చటకు విచ్చేసి? ఆదరించుటకును నేరకుంటిని. మీరిప్పుడే మేమియో యనుచుంటిరిగాని విషణ్ణ హృదయుండనగు నాకవి యెవ్వియును వీనులకెక్కకున్నవి. రండు! కూర్చుండుఁడు (అని పీఠములం జూపుచున్నాఁడు.)

(శకుని కర్ణులట్లు చేయుచున్నారు.)

కర్ణ—వయస్యా!

సీ. నిటలాక్షునైనను దృటిలోన సాధించు ప్రబలయోధులు నిన్ను బలసికొలువ
నల బృహస్పతినైన నవఘళింపఁగఁజాలు సచివోత్తములుచేరి సంప్రతింప
నిఖిలలోకములొక్క నిముసంబున జయించు ననుజులే వేళ నిన్ననుసరింప
కాలునైనను నవలీల సల్లాడించు రాజలోకము నిన్నుఁ బ్రస్తుతింప.

గీ. ధనకనక వస్తువాహా సాధనచయంబు
నిత్యకళ్యాణ గరిమంబు నెఱపుచుండ
సకల సామ్రాజ్య వైభవాస్పదుఁడవయ్యు
వనట నొందంగ నీకేల? జనవరేణ్యా!

దుర్యో—మిత్రుఁడా! చెప్పుటకేమున్నది? మరకత మాణిక్య రత్న ప్రభాభాసితంబులగు హర్మ్యస్థలంబులెన్ని యున్నను, సంతతాభీష్టఫల ప్రదాయకంబగు సామ్రాజ్య వైభవంబెంత కలిగినను, మనస్సంతుష్టి లేకున్నఁ దదర్థసంచయంబులన్నియు నిరర్థకంబులుకదా!

గీ. సంతసం బెల్లవేళల నంతరంగ
ముల సముద్భవ మొందంగవలయుఁగాని
నవ్యతర వస్తుజాలమానందజలధి
నోలలాడించఁగలదె యీయుర్వియందు.

ధనవైభవంబెంతయున్నను, బుద్ధివైభవంబున కీడగు వైభవంబీ భువనంబుననె కాదు చతుర్దశ భువనంబులం గానరాదు. ఎట్టిరోగంబులకైన మందుకలదుకాని మనోవ్యాధికి మందులేదుకదా!

శకు—కుమారా! ఎట్టియసాధ్యములనైన సాధింపఁజాలు మనరాధేయుఁడుండ లోకంబున మనకసాధ్యంబెయ్యది! నీమనంబులోని విచారంబునకుఁ గారణంబేదియో వక్కాణింపుము.

దుర్యో—మామా! ఆప్తవర్గంబు మానవులకు బహిఃప్రాణంబకదా! మీకంటెను నాకాప్తులెవ్వరు? నాకుంగల విచారకారణంబుఁ దెలియంబలికెద నాలకింపుఁడు.

ఉ. వాఁడల ధర్మనందనుఁడొనర్చిన జన్నముఁ జూచువేడుకన్
గూడిరశేషబంధువులు, కోర్కులుదీరఁ దదధ్వరంబునం;
జూడనె చూచినారచటి శోభనసంపదఁ జెప్ప నేటికే
నాఁడునునట్టిసంపద వినంబడదంచును బల్కిరెల్లరున్.

ఆయాగము నిర్విఘ్నంబుగఁ బరిసమాప్తి నొందుటచే ధర్మనందనుండిప్పుడు పురందరాది బృందారక జేగీయమానుండై, యసమానంబగు తనతేజంబెల్లెడల నల్లుకొనఁ బెల్లుగ రంజిల్లుచున్నవాఁడు. సమస్తభూమీశులునుదయాస్తమయంబు లాతనికడనె పడిగాపులుండి కప్పములం గట్టుచున్నవారలు. పరాక్రమవంతుండగు ధరాకాంతునకు సమస్తదేశాధీశులు సామంతులై మెలంగినంగదా పరమానందంబు. అట్టిచో సకల శాత్రవలతాలవిత్రంబగు క్షత్రియకులంబునన్ జనియించి కుక్షింభరినై సంచరించుచుండ నానందంబుదయించుటెట్లు? క్షత్రియకుల సంభూతుండగు నాయట్టి యసమర్థుండు ధర్మాసనంబధిష్ఠించుట ధర్మబాహ్యంబని రాచకార్యములం బరిత్యజించితిని. శత్రురాజుల నిర్జింపంజాలని భీరునకీరాజ్యంబేల? నిరంతర చింతాకరములగు నీయైశ్వర్యంబులేల?

కర్ణ—(శకునివంకఁ దిరిగి) సౌబలా!

మ. కలరేయింతటి వెఱ్ఱులెందయిన? నిక్కార్యానకా చింత,? యిం
దులకుం జాలమహత్తరంబయినదే? హేతువొండుండఁగా
వలెనంచున్ మదినెంచుచుంటిమిదియా వైరాగ్య పుంగారణం
బెలుకల్ కల్గెనటంచు, నింటికనలం బేరైన నంటింతురే.

ఇమ్మహాత్కార్యమునకు లేనిపోనివ్యాకుల పాటొకటి గల్పించుకొని మనంబునింతయాయాసపెట్టుకొందురా? పాండవప్రతాప భంజనంబు సేయఁగడంగితేని వారలనాజిరంగంబునంజయింప, రథికానురథికులగు మహాయోధులనేకులున్నవారలు.

దుర్యో—మిత్రుఁడా! నీమాట కడ్డమువచ్చితిని. నీవు వక్కాణించినదియంతయు నిక్కవంబెయగును. వారి, వీరినుడువనేల? త్రిజగద్విజయ పరాక్రమ ధౌరేయుండవగు నీవు సంకల్పించిన,

మ. ఇలనీపాండవులేమి లెక్క చెపుమా? యీరేడులోకంబులన్
నిలువంజాలునె యెవ్వఁడైన ననిలోనీవల్గి విల్లూనినన్
విలునమ్ముల్ వడిఁబారవైచియనికిన్ వెన్నిచ్చుచుంబోక : ది
క్కులనెల్లన్ భవదీయశౌర్యలత లక్షుద్రప్రభన్ సాగఁగన్.

శకు—అవునుగాని, కుమారా!

గీ. ఇంతకాలంబు మనము నాకుంతిసుతులు
సఖ్యసంబంధముల నొప్పెసంగుచుండి
కారణములేక వారిపైఁ గదలనికిఁ
గలుగునపవాదము భరింపఁగలమె మనము.

దుర్యో—కాని నామనంబున కొక్కయుపాయంబు పొడకట్టుచున్నది. మామా! అట్టి సుధామధురవాక్కుల నావీనుల కొక్కసారి విందుసేయుము.

శకు—ఉ. ఆటలలోన నేరుపరియందురు ధర్మసుతుండు, వానినా
పాటవమొప్పజూదమున భంగమొనర్చి సమస్తవైభవం
బోటువడంగఁజేసి జగదుజ్జ్వలసంపద నీకొసంగెదన్
"గోటనుద్రుంచివేయునది గొడ్డటఁ గొట్టఁగనేల?" భూవరా!

దుర్యో—మామా! నీనోట నిట్టిమాట లాకర్ణించుటవలనఁ జింతాప్రవాహవేగంబున నొరసి కూలనైయున్న నాహృదయకూలం బపాయవిమోచనం బొందుచున్నట్టులున్నది. గాలివానపట్టి యల్లకల్లోలంబుగనుండు సముద్రమధ్యంబున దారితెన్నుఁ గననేరని నావికునింబోలిన నాకీక్షణంబున నీయుపదేశంబు దిక్ప్రదర్శక యంత్రంబయ్యె.

శకు—అబ్బాయీ! అయ్యది మానవధర్మంబుసుమా!

గీ. స్వప్రయోజనములయందు సమయమునకుఁ
దగినయోచన దోఁచదెంతటివిశేష
సుమతికైనను జిత్తంబు విమతమైన
నుచితయోచన లెందైన నొదవఁగలవె.

కర్ణ—ప్రాణమిత్రులగు మీరిరువురు నేకాభిప్రాయులైయున్నపుడు ప్రతికూలంబుగ నుడువుట నాకుయుక్తంబుకాదు, కాని, యేతన్మూలమున కార్యసాఫల్య మెంతసులభసాధ్యమని మీరుతలంచినను నేనీవిషయంబున మాత్రము మీతోడ నేకీభవింపఁజాలను.

శకు—సంప్రదాయవిరుద్ధంబనియా? ధర్మవిరుద్ధంబనియా?

కర్ణ—వాదప్రతివాదములమాట యెట్లుండినను మనబోటి వీరపురుషులకది కార్యసాధనోపాయంబుగాఁ గూడదని నాయభిప్రాయము.

శకు—(తలపంకించి) ఏమీ!

శా. లేరే ధారుణిలోనభూపతులు? మున్ లీలావినోదార్థులై
ధీరత్వంబుననాటలాడరె? ధరిత్రీనాథఁ వారందఱున్
గారేనీవలెధర్మవేత్త? లిటువల్కన్ నవ్విపోరేజనుల్?
హేరాళంబగు త్రోవఁబోవరని మున్నేరైన వాక్రుచ్చిరే?

కర్ణ—మిత్రుఁడా! అపథ్యంబులని తమ మనోవిశ్వాసంబుల మఱుఁగుపఱుపక మిత్రులగువారు వానిని దెలియఁజేయవలయునేకాని యయ్యవి యెదుటివారి చిత్తంబునకు నొప్పిఁగలిగించునని చెప్పశంకింపరాదు. మీకీవిషయంబున నేఁబ్రతికూలుఁడనైతినని శంకింపఁబనిలేదు. నేనైన నంత హేతుబద్ధములుకాని మాటలాడువాఁడనుగాను.

దుర్యో—వయస్యా! నీవన్యథా భావింపఁబనిలేదు. ఎద్దియైన నొక్కకార్యంబుఁ జేయఁబూనునప్పుడు పలువురకుఁ బలువిధములగు తలంపులు పుట్టుచుండును. వానినెల్లఁ జర్చించుకొని యందుమేలేర్చి తన్మార్గానుసారు లయ్యెదరుగాని యొకరు చెప్పిరన్నంతనే చేయరుగదా!

కర్ణ—సుయోధనా!

ఉ. వేటయు, జూదమాడుటయు, వేడుక కత్తెలతోడి కూటముల్
నోటికొలందిఁ బ్రేలుట, మనోధృతిఁదూలఁగఁ గల్లుఁద్రావుటల్
గాటపుశిక్షణంబు, వృథగాఁగధనంబు వ్యయంబుసేయుటల్
వాటముగావటంచు నుడువంబడు దుర్వ్యసనంబు లాటచేన్.

మఱియును,

ఉ. వేదవిదూషకుల్, కృపణవృత్తులు, దుర్వ్యసనుల్, కృతఘ్నులున్
జూదరులున్, నిరీశ్వరులుఁ జోరులుఁ గల్మషచిత్తులున్ మృషా
వాదులు, నీతిబాహ్యులుఁ గృపారహితాత్ములు, దుష్ప్రవర్తకుల్
మేదిని సర్వవైభవ సమృద్ధిఁ దలంగుదురండ్రు కోవిదుల్.

శకు—నీవక్కాణించినది నిక్కవంబకావచ్చును. కాని మనధర్మశాస్త్రంబులు ఋషిప్రోక్తంబులు. – అందేది యాచారసిద్ధమో, యేది వ్యవహారసమ్మతంబో, యేది బహుజన సమాదరణీయంబో దానిని గ్రహింపవలయు.

క. "ద్యూతకళాకుశలుండగు నాతఁడు లోకజ్ఞుఁడును మహామతియును వి
ఖ్యాతుఁడును రాజనీతివి నీతుఁడునగుఁదగునె దానినిందింపంగన్"

"గానధర్మద్యూతంబున జయించుట ధర్మయుద్ధంబునందు జయించు నంతియ

పుణ్యంబు" అను దేవలవచనంబునకుం గతియేమి ?

కర్ణు—ఎద్దియేని ధర్మాధర్మసందిగ్ధంబు సంభవించునెడ సందేహింపక పలువురకు నిరపాయకరంబుగను, ఉత్తమోత్తమంబుగను గనిపించునో యయ్యది యనుష్ఠితంబు గావలయును.

శకు—అట్లయిన నిప్పట్టున నిమ్మహావిద్య యనుశ్రుతాచరణంబయ్యును, అనుసరణయోగ్యంబు గాదనవలసివచ్చునే.

కర్ణు—మిత్రుఁడా! అనుశ్రుతాచరణీయంబు లన్నియును, ననుసరణ సమ్మతములనవచ్చునా? అదియునుంగాక దురోదరంబుకరం బపాయకరంబు.

ఉ. ఏరును గార్యభారము వహింపఁగడంగెడుచోట, దానఁజే
కూఱుశుభాశుభంబులన కుంఠిత బుద్ధిఁదలంచిచూచి, యం
దేర, శుభంబుకంటెను శుభేతర మెచ్చుగఁ గానిపించినం
జేరఁగనీయరయ్య శుభచింతనలం దమచెంత ధీయుతుల్.

శకు—చ. నలువురుఁ జేయుచుందురు దినంబును గష్టములేని కార్యముల్
కలుఁగునెదానఁబొందుము, కష్టపుకార్యములం గడంకతో
సలుపుచు సత్ఫలంబుఁ గనఁజాలుటగాదెయశంబు; తేనెటీఁ
గలకుఁగలంగి తేనెఁగొనఁగన్ మధుకోశము రేపకుందురే.

అశ్వారోహణంబును, వ్యాయామంబును నపాయకరంబులని పరిత్యజించిన మనకు దేహదార్ఢ్యంబు కలుగనేర్చునా? అక్షవిద్యయునటులనే మనోదార్ఢ్యంబు నొసంగి బుద్ధిని వృద్ధినొందించును.

కర్ణు—పాములతోఁ జెలిమిఁజేసి బాధలఁబడుటకంటె వానిదరిఁజేరకుంటయే శ్రేయస్కరంబుకదా!

గీ. ప్రాప్తమైనవెనుక బాగుఁజేయఁ బ్రయత్న
పడుటకంటె దానిబారిఁబడక
తప్పుకొనుట శ్రేష్ఠతరమని పెద్దల
వలనఁ బలుకఁబడెడి పలుకువినమె.

దుర్యో—ఆత్మబుద్ధి విలసనంబట్టి విషయంబులఁ బ్రమాణంబుగఁ గైకొనరాదు. బుద్ధివిశేషంబొకరి సొమ్ముకాదు. ప్రస్తుతవిషయంబున పూర్వాచరిత ధర్మంబ యనుసరణీయంబని నాయభిప్రాయము.

కర్ణు—సుయోధనా! అయ్యది ధర్మబాహ్యంబనరాదుగాని సద్ధర్మంబనిమాత్ర మన

లేము.

దుర్యో—మనకు ధర్మబాహ్యంబు కాకుండినంజాలు. ప్రపంచంబున నెందును లౌకికవిషయంబుల ధర్మంబు నిష్కళంకంబగుట పొసంగనేరదు.

శకు—అబ్బాయీ! ఈవిషయంబునఁ గృతయుగాది చర్యలందు దృష్టాంతంబులు పెక్కులు కానవచ్చుచున్నవి.

చ. మనుకులపక్షికంధరుఁడు భూసుతఁబట్టిన రాముఁడామైకై
యిన సుతుతోడ సఖ్యమునకింద్రతనూజునిఁ గూల్చెనెట్టు? లా
తనినొక వృక్షమూలమున దాగియెగావధియించె! వానిపే
రున కణుమాత్రమైనను విరుద్ధనచోరచనల్ జనించెనే.

అందునన్నే, కార్యము మంచిదైనయెడలఁ గారణమెట్టిదైనను సమర్థనీయంబయందురు.

దురు. కారణములేనిదే కార్యముండదుగదా ?

చ. ధరణినహింసయే పరమధర్మమటంచు శ్రుతుల్ వచించినన్
జరుగదె జీవహింస మనజన్మములందును గార్యసిద్ధికై?
పరమ పదంబొసంగఁగల భవ్యతమంబగు కార్యమెన్నఁడోఁ
గరణమదెట్టులుండినను గాని బుధావళికింపుఁ జెంపదే

ఇప్పుడప్పాండవులు ధనమదాంధులై గర్వోద్రేకంబున మన్నుమిన్నుఁ గానకున్నవారు.

దుర్యో—క్షత్రియకులసంజాతునకు దిగ్విజయ వ్యాపారంబు సముచితకార్యంబుకదా! తద్విషయంబెద్దాన ననాయాసంబుగ సమకూరునదియెల్ల నాచరణీయంబని తలంచెద.

కర్ణు—సుబలనందనా! ఈవిషయంబున నాకుంగలిగిన సందియంబు నివారించుకొనఁ బ్రయత్నించితినేకాని నీయుపదేశ ఖండనమునకుఁ గడంగినవాఁడనుగాను. ఇంక నీవిషయంబున నీవెట్లునడపిన మేమందఱమట్లు నడచెదము.

దుర్యో—అంగరాజా! మనసౌబలుని బుద్ధికౌశలంబు- కుశాగ్రసూక్ష్మంబు. అయ్యది సహజసంప్రాప్తంబు సుమా. పరోపదేశ సహస్రంబువలనఁ గలుగు బుద్ధివిలసనమునకంటె సహజజ్ఞానంబె సమధిక ఫలంబు నొందుచుండు చూడు.

చ. గహనమునందు నెవ్వరును గన్గొని పెంచని పూవుఁదీవియల్
సహజముగాఁ దమంతటనె చక్కని పూలనొసంగు నెన్నియో;
గృహమున నెన్ని పాట్లుబడి యెంతటి దోహదమం బొనర్చినన్
బహుళ సుమాళి నీయవొక పట్టుననైన ముదావహంబుగన్.

శకు—కాని మనమీవిషయంబున మీతండ్రిగారి యనుజ్ఞం జేకొనుట గర్తవ్యంబు. పెద్దల యవలంబనంబుగల కార్యమెట్టిదియైనను లోకంబునకు స్తుతిపాత్రంబుగ నుండునుగదా!

దుర్యో—మనమింతఱ మేకాభిప్రాయులమైయుండ నాయనమాత్రమేల ప్రతికూలురగుదురు?

శకు—ఇదియటుండ నాయన మనయాలోచనలం గొనసాగించుటకు రహస్యకారణంబు లనేకంబులుకలవు. పాండవ పక్షపాతియగు విదురుండే యాతని యాలోచనలు కొనసాగించినచో నీపాటికి సమస్తకార్యములును నెరవేరియుండును.

దుర్యో—అయ్యా! మనకు వృథాగా నీసందియంబేల? మీరందఱు నెదుటనుండంగనే మాజనకుని నాయుద్యమంబున కొడంబఱచెదరండు, మనమందఱ మాయనకడకేగుదము.

(అని అందఱు నిష్క్రమించుచున్నారు.)

(ఇది ప్రథమాంకము.)

శ్రీరస్తు.

దుర్ణయ దురోదరము

ద్వితీయాంకము.

రంగము. ధృతరాష్ట్రభవనము.

(ధృతరాష్ట్రుఁడు ప్రవేశించుచున్నాఁడు)

ధృత—ఏమిచెప్పుమా! కారణమేమైయుండునో?

శా. ప్రత్యూషంబున నిద్రమేల్కని ముఖప్రక్షాళ నాద్యాహ్న స
త్కృత్యంబుల్ నెరవేర్చివచ్చి జనకున్ గీర్తించి శ్రద్ధాళుఁడై
నిత్యంబున్ దనరాజకార్యముల సందేహంబులం దీర్చి కొం
చత్యానందము నొందుచుండు తనయుండక్లోలం గావింపఁడో.

ఇదివఱకెన్నఁడును బ్రయాణాగతుండైన యనంతర మింతతడవు మత్సందర్శనంబుఁ జేయకుండువాఁడుకాఁడు. (అలుకుడువిని) ఎవరక్కడ?

(అప్పుడొక కంచుకి ప్రవేశించుచున్నాఁడు.)

కంచు—దేవా! అబ్బాయిగారు కర్ణశకునులతో దర్శనమునకు వచ్చుచున్నవారు.

ధృత—(ఆత్రముతో) ఏడీ! అబ్బాయియే వచ్చినాఁడా? ఆతఁడెక్కడ? ఆతఁడెక్కడ?

(అప్పుడు దుర్యోధన కర్ణశకునులు ప్రవేశించుచున్నారు.)

దుర్యో—తండ్రీ! నమస్కారములు (అని మ్రొక్కుచున్నాఁడు.)

కర్ణ—దేవా! కర్ణుఁడిదే వందనముచేయుచున్నాఁడు. (అని నమస్కరింపుచున్నాఁడు.)

శకు—బావా! సౌబలుఁడు ప్రణమిల్లుచున్నాఁడు. (అని యట్లు చేయుచున్నాఁడు.)

ధృత—ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధిరస్తు. నాయనా! యిటురమ్ము. ఒక్కసా

రి నన్నాలింగనమ్ముఁ జేసికొననిమ్ము. సుబలనందనా! అంగరాజా నాపీఠమునఁ గూర్చుండఁజేసి నీవటు కూర్చుండుము.

(వారట్లు చేయుచున్నారు.)

ధృత— నాయనా! సుయోధనా! నిన్నటి యుదయమునుండియు నాకొక్కసారియైన నీదు మృదులాంగస్పర్శ సుఖమునీయకుంటివి (తనువుఁ దడవిచూచి) అబ్బాయీ! నీశరీరంబేమియో క్రొత్తగ నున్నదియే?

దుర్యో—(తలవాంచి యూరకొనుచున్నాఁడు.)

ధృత—తండ్రీ! మాటాడవేమి? నాకుఁగల సమస్తైశ్వర్యంబులును నిరవశేషంబుగ నీకే యభిషేకంబొనర్చి నీసహోదరులందఱిలోన నీయంద యెక్కుడు మక్కువగనున్నాఁడ.

శకు—బావా! మనసుయోధనుం డత్యంత వ్యాకులాయత్తచిత్తంబున, లావణ్యసదనంబగు వదనంబు, నిజనైగ నైగ్యంబువిడనాడఁ గృశీభూతాంగుఁడై నుడువ నశక్యంబగు నస్వస్థతకుఁ బాల్పడియున్నవాఁడు.

ధృత—కుమారా! ఎన్నఁడును విచారమన నెట్టిదియో యెఱుంగనివానిని, ప్రపంచమున నెవ్వరు లేనట్టులు వెదకి వెదకి యిప్పెను భూతంబు నిన్నే యనుసరించెనా?

ఉ॥ చక్కఁదనంబునన్ మరుని, జవ్వనమందున నవ్వసంతునిన్
జొక్కులరాయనింగళల, నూరునిఁ దేజమునన్, జయించి, పెం
పెక్కినవాఁడవీవు, వగ పేటికి? నేటికి నీదుతాల్మియే
దిక్కునకేగె రాతనయ! తెల్పవదేమిట డాపనేమిటన్.

దుర్యో—(నిట్టూర్పువుచ్చి) కులధర్మక్షయంకరుండగు నీతనయుండు చింతాకరుండగాక సంతోషాకరుండెట్లగును?

ధృత—అదేమినాయనా! అదియేమి? నీవెప్పుడును, నంతరంగంబునఁ దరంగితంబగ నానందాంబుధి నోలలాడుచుండెడివాఁడవే? నిరర్థక సంభూతంబులగు నిట్టి వనోవైకల్యంబులకుఁ దానకంబవైతివేల?

దుర్యో—తండ్రీ!

మ. పరరాజన్య వరేణ్యులందునిమిసర్వప్రాభవోపేతులై
ధరణీపాలనదక్షులై, నియత సద్ధర్మావనాధ్యక్షులై
పరమానందము నొందమందు నుదయింపన్ రాజ్యతంత్రంబులం

బరి రక్షించుటకాదె రాజులకు ధర్మం బిమ్మహీమండలిన్.

ధృత—అయ్యవి నీయందనర్థాభిఖ్యం జెందియున్నవికదా! లోపమేమున్నది? కుమారా!

దుర్యో—లోపములుండుట లోకమునందందఱకును సహజమే. కాని నావలెఁ బరిహాసపాత్రులగువారుమాత్ర మెందునుండరు.

ధృత—నాయనా! అట్లనుచుంటివేమి? పాండవులు ధనమదాంధత నిన్నేమైన ననిరాయేమి?

దుర్యో—అనుటకేమిలే! మయసమర్పిత సభాభవన విభవంపు పెంపును, రాజసూయనిర్వాహగర్వంపు ముంపును, దత్సభాసందర్శన విలోకనంబునకుం గడంగిన నాయవివేకంపు నింపును, ననవలయుంగాని, వారలననఁ బనియేమున్నది?

ధృత—కుమారా! ఆసమాచారంబేమియో యాద్యంతంబు నొక్కసారి యొరదీసి నాతల్లడపాటుం గోసివేయుము.

దుర్యో—అయ్యది యొక్కమాటతోడం దీరునదికాదు. తొందరపాటులేక నాలకింతురేని దానిపూర్వోత్తరంబుల నెఱింగింతు.

ధృత—నీవీదినమున నేమియో నీహృదయ మెఱుంగనివానికడ మాటాడుచున్నట్లనుచుంటివి.

దుర్యో—వివిధవిచిత్ర శిల్పకల్ప నానల్ప చాతుర్యమయుండగు మయుండు ఖాండవవనదహనానంతరము తనకృతజ్ఞతా సూచకంబుగ నత్యద్భుతంబైనలోకైకసుందరంబగు నొక్క సభామందిరంబు ధర్మనందనునకును, దొల్లి భౌమాదిత్య రాజర్షి కృపాసంపాదితంబగు గద నొక్కండు వృకోదరునకును, దారుణంబైన దివ్యఘోషంబుఁగల దేవదత్తంబను శంఖంబర్జునునకును, సమర్పించెను. ఆసభావిభవంబు నందంబుఁ గన్నులం గన్నప్పుడొదవిన మతిభ్రమణంబు నాకెవ్వరితో నేమిముచ్చటించుటకును దెరపినీయకున్నది.

ధృత—అయ్యది యంత విభ్రాంతికరముగ నున్నదేమి?

దుర్యో—అసలే దానవవిశ్వకర్మ. అందును నిది శ్రీకృష్ణనియుక్తంబు. ఇంక గుణవంతంబైనదన నేమివింత!

సీ. మగరాల జిగినిగన్నిగల పూతల సుధాధవళకాంతుల కుడ్యతతులు మెఱయఁ
బద్మరాగోపల ప్రకరరక్త ప్రభాపటలి జాజుల పూతపగిదిఁ దనర
నవరత్న ఖచితాభినవ మనోహరియై ప్రబలువింగపుగద్దె భాసిలంగ,

బలు తెఱంగుల రంగులరఁ జిల్కెడు చిత్రఫలకంబు లక్షీసాఫల్యమెసఁగ.

గీ. లలిత సామ్రాజ్య భోగవిలాస ధుర్య
మహిత సౌందర్య రూపరమావధూటి
తాండవంబాడు నిరత మాపాండువిభుని
సత్సభారంగమునఁ జాలసంతసమున.

ఉ. నీలమణిద్యుతుల్ విమలనీరముగాఁగ, వినూత్న మౌక్తికా
జాలము బుద్బుదంబులుగఁ, జారుసువర్ణ వితర్దులంబుధిం
దేలు మనోజ్ఞ మీనసుకతిన్నెలుగాఁగఁ జెలంగెడుం బ్రభో
ద్వేలతఁదత్సభావిభవ విభ్రమమంబు ధివిభ్రమంబనన్.

సేనట్టి సమస్త ప్రశస్త వస్తుసంపూర్ణంబగు సభాసదనంబుం జూచువేడుకనందు విహరింపఁబోయితి.

ధృత— పోయిన,

దుర్యో— పోయి యచ్చట విచ్చలవిడిగ సంచరింపఁజొచ్చిన నందలి మాణిక్య ప్రభాజాలంబులం జూడఁజూడఁ బైత్యోద్రేకంబునఁ గన్నులు పచ్చవారునట్లు నాకన్నులు మిఱుమిట్లుగొనినవి. సంవృతద్వారంబు వివృతంబనియును, వివృతద్వారంబు సంవృతంబనియును, దలంచి చొరనొల్లకయుఁ జొరంబోయియుఁ దత్కవాట స్ఫటిక శిలాఘటితతలాటుండనై బన్నంబునకుఁ బాలైతి. నీలాశ్మస్థగితంబైన విమలమణిస్థలంబు జలాశయంబనుకొని పరిధానంబెగఁద్రోచికొని యరిగియరిగి తుదకొక్కచోట స్ఫటికదీప్తి జాలపరివృతంబైన జలాశయంబు స్థలప్రదేశంబనుకొని కట్టిన పుట్టంబు తడియంజొచ్చితి.

ధృత—అంతయద్భుతంబుగ నున్నదియేమి?

దుర్యో—చ. ఇటులఁబరాభవింపఁబడియే నపుడెంతయు లజ్జఁజెంది, య
చ్చోటు సెడఁబాసి పోవుతఱిఁ జోద్యముగాఁగని నన్ను, చేటికా
పటల సమావృతాఢ్యయగు పాండవభామిని నవ్వెపక్కునన్;
ఇటుతగునాయటంచు వచియింపరు పాండవులైన నయ్యెడన్.

ధృత—ద్రౌపది మీకువదినెయగుట నవ్వుటాలకట్లు చేసియుండును.

దుర్యో—నవ్వులేమి?

గీ. విదురునకు మీకునటులె కాన్పించువార
లేదిచేసిన నదియెల్ల నెప్పటికిని

మంచిదిదియని మదివిశ్వసించుపిదప
లోటుకనిపింప, దటనెన్ని లోటులున్న.

ఇంతకును జిత్తంబె ప్రధానంబుకదా! అయాచితంబుగ సంప్రాప్తంబైన యాసామ్రాజ్య వైభవంబి ప్పుడప్పాండవులకు భూమియు నాకసంబును గనఁబడనీయక "ఈయాకసంబునఁ జుక్కల నెవ్వఁడు వొడిచెరా" యను కడకుఁ దెచ్చినది.

ధృత— ఈరాజసూయ విజయంబు వారివర్తనంబుల నేమైన తారుమారొనరించెనా యేమి?

దుర్యో—అయ్యది వారల నెంతకైనం దెచ్చినది. తండ్రీ!

చ. అచటి యుపాయనంబులను నందుకొనంగ నియోజితుండనై
యచలమతిన్ గ్రహించితిని; నయ్యవి లెక్కయిడంగ నీజగ
న్నిచయమునం గలండెవఁడు; నేఁటికి నింకను దీరలేదునా
కచట జనించినట్టి శ్రమమంతయు నెంతగ విశ్రమించినన్.

ఆతని యన్నదానమహిమంబన్న నొ యొక లక్షవిప్రులు సాపడినంగాని మ్రోయని శంఖంబెల్లవేళల నొక్కరీతిన మ్రోయఁదొడంగెను. వేయేల? ఆతని యజ్ఞంబు తోడఁ దొల్లి భూమ్యంతరిక్ష మధ్యభాగంబునఁ దనకీర్తి ప్రభాజాలంబుల నెడతెఱిపి లేకుండఁజేసిన హరిశ్చంద్ర రాజసూయంబు, కాసుకీసంబునకైన సరిరాదనిరి. భూతవర్తమాన రాజన్యసంపదలీ పాండవలక్ష్మికిఁ బరిచర్యసేయనైనఁ బనికిరావనిరి. జన్మయనినవారిదే జన్మ.

ఉ. ఉండినసర్వవైభవ సమున్నతి నుండుటయొండె మేలు, కా
కుండిన నూళ్లవెంట నరుణోదయమందున నేగి భైక్ష్యమం
దుండుట యొండెమేలటుల నుండుటకిచ్చ జనింపకుండినన్
దండధరాంతికంబునకుఁ దాఁబయనంబగు టొండెమేలగున్.

అంతియకాని యీగర్భశత్రువులగు పాండవులకడనుండిన యాకలిమి నెల్ల హరింపక ప్రాణంబులలో నుండుటెట్లు?

ధృత—కుమారా! ఆసభామందిరంబువంటి మందిరంబొండు నీకును గట్టించి యిచ్చెదను. నీవింతమాత్రమునకు వగలఁబొగల నేల? నీచేతను ధర్మనందనుని జన్నంబువంటి జన్నంబొకఁడు సేయించెద. సామంతరాజులందఱును వారికింబలె నీకును గప్పంబుఁ గట్టుదురు. పాండవులును నీకు సమస్తపరిచర్యలు సేయుదురు.

శకు— గీ. జన్నమను పేరి గాలంబువన్ని ధర్మ

తనయుఁడీలోకమునఁగల ద్రవ్యమీన
సంచయములెల్ల వేఁటాడి సంగ్రహింప
వట్టిపోయెఁ జగత్సరోవరము దేవ!

దుర్యో—తండ్రీ! పాండవవిభవంబు హరించుటకన్న నాకు యాగంబనఁ నెట్టిది? ఇతరభూపతులకడ నెంతధనముండిన నుండనిండు. అన్యులకడనుండి వారిప్పుడాకర్షించిన యాగౌరవంబు వారింజయించినంగాని లభించునే? వారిచేష్టలం దలంచికొనిన నాదేహంబు జలదరించుచున్నది.

ఉ. పంకజనాభుఁడల్లఁ శిశుపాలుని సభ్యులసేవలుండఁగా
శంకయొకింతలేక కడుసాహసియై శిరముత్తరింప, రా
జాంకముఁగన్న భూరమణులారసి మానినువైరిగాని, యే
ణాంకకులావతంస! యిది న్యాయముగాదని చెప్పఁగల్గిరే.

ధృత—శిశుపాలుండింతకుమున్న కృష్ణునకనేకాపకృతులొనరించె. కృష్ణుండును దనమేనత్తయగు సాత్వతికొసంగిన వాగ్దానంబు కారణంబున నపరాధశతంబు సహించె. సమస్త భూమీశ పరివేష్టిత సభామంటప మధ్యంబున ద్విజగదవన దక్షుండును నిగ్రహానుగ్రహ సమర్థుండును, సాక్షాద్భగవల్లీలావతారుండును, విశేషించి తనకుఁ బరమోపకారియునగు కృష్ణుని నిందాపాత్రుంజేయ నాతండు క్రోధోద్దీపితమానసుండై యట్లొనరించెనని సందేహింపనున్నది? ఆతనిమృత్యువీతనిచేతనున్నదనుట యొక్క యశరీరభూతంబుచే నిదివఱకే నిర్దిష్టంబయ్యె.

శకు— గీ. చైద్యమరణంబునకునీయజాతవైరి
కారణుఁడుగాక హరియెట్లు కాగనోపు
నైనవాఁడైన యాచేది యవనివిభుని
మృతినిమనకేడ్పు వెతలిన్నిగతులఁ గల్గె.

ధృత—అందు ధర్మజుసంబంధ మేమియున్నది?

శకు—ఆతండు సభాతాంబూలంబుఁ గృష్ణునకీయఁ బ్రయత్నింపకుండిన, శిశుపాలునకును, నాతనికిని కలహమునకుఁ గారణమే లేకుండు. ఎవ్వఁడేని ధర్మముఁదప్పి నడచుచుండిన సభాధ్యక్షుండదిచూచి సైరించుట తగవగునా? కృష్ణునకాతండిష్టుఁడైన నాతనికిఁ దనమందిరంబున విందుసేయవలయు. ఆతనియింటఁ దాను విందారగింపవలయు. అంతియకాని స్నేహితుండన్నంతమాత్రమున, సభాపూజ్యులెందఱెందఱో యుండఁ గొఱగానివాని నెక్కునిందెచ్చి యభ్యర్చితుంజేయుట

న్యాయంబె?

ధృత—అయ్యది భీష్మని యోగంబుకదా! భీష్ముండె సమస్త ధర్మవిచక్షణుండు. అగతానాగతవేది. మనలకందఱకును వందనీయుండు. కృష్ణునవతారపురుషునిగా నెంచక సామాన్యమానవునిఁగా సంభావించుట యజ్ఞానంబు. భగవంతుని సారూప్య సంభావనంబుకన్న నన్యంబగు పుణ్యంబెద్దికలదు?

దుర్యో—కృష్ణుండు భగవంతుండేమి?

గీ. పసులకాపరి యితఁడె దైవంబయైనఁ
గానివాఁడెవ్వఁడుండు లోకమున నెరుఁడు
స్త్రీలహింసించి గోహత్యఁజేసినట్టి
యీమహామహు దైవత్వ మెఱుఁగఁడెవఁడు?

భగవంతుఁడైనవాని చెయ్దింబులన్నియును మనకనుసరణీయంబులు కావలయుంగదా! ఏతన్మార్గంబులె మననునుగమించిన నింకఁజేయరాని దెద్దియుండును? "తాఁ జెడ్డకోఁతి వనమెల్లఁజెఱచు" నన్నట్లీ తండాపాండవులంగూడఁ జెడుదారిం ద్రొక్కించుచున్నాఁడు. ధర్మజుండు ధర్మమార్గానువర్తి, ధర్మమార్గానువర్తి యందురే? అతనిధర్మమేమూలమాటు పడఁగెనో?

శకు—ఆతనికది పుట్టునామముగాని పెట్టునామముగాదు సుమీ!

ధృత—అబ్బాయీ! పాండవులును మీరును నింతవఱకు సోదరభావంబునఁ బ్రవర్తించుచున్నవారు. అట్టిచో మీలో నొకరియందొకరు, నిందల నారోపణఁజేసికొనుట న్యాయముకాదు.

దుర్యో—(రోషముతో) పాండవులపై నిప్పుడు నిందారోపణంబు సేసితినేమి? పాపము! నిర్వక్రపరాక్రమ ధారేయుండగు దుర్యోధన ధారుణీశ్వరుండు పరిచారికా సహస్ర పరివృతయగు పాంచాలిచే బరాభవంబుపాలగుట మీకుఁ జాలమార్జితంబుగ నున్నయది. ఊర్జితమగు క్షత్రియ వంశసంభూతుండనే నైనచో దానికనురూపంబగు ప్రతీకారంబుఁ జేయనే చేయుదును. (నిర్వేదముతో) అన్నా! నాకాపరాభవంబు మనశ్శల్యమై వేధించుచున్నదే?

ఉ. స్వాపజయంబు శత్రువిజయంబును గోరునరాధిపాధముం
డీపృధివీస్థలింగలుఁగునే? మృతినొందునుగాక దీనుఁడై;
యేపున సర్వలోకముల నేర్పడ క్షాత్రవులంజయించి, యే
లోపముఁ గల్గకుండ భువిలోపల రాజ్యము సేయఁగావలెన్.

ధృత—అబ్బాయీ! పాండవులతోడఁ గారణములేకయే కలహమేల కల్పించెదవు? అయ్యది యెట్లుసమర్థనీయంబగును?

దుర్యో—జ్ఞాతి విభూతి లాతి వారికప్పుడును సమ్మతంబు కాదుగదా!

క. అనలము రోగము ఋణమును
ఘనతర శాత్రవకులంబుఁ గడతేర్పక వా
నిని నణుమాత్రంబైనను
మననిచ్చుట తగదఁటంద్రు మనుజున కెందున్.

మనకు పాండవులు పితృవ్యపుత్రులగుటంజేసి శాత్రవ వర్గంబులోనివారలే కదా!

మ. అనుజాండ్రగ్రజుఁడాత్మజుండనుచు రాజ్యార్థంబు లార్జించుచోఁ
జను నేయోజన నేయభూపతులకున్ క్షాత్రంపు తేజంబుచే
ననిలో శత్రుల రూపుమాపుచుఁ దదీయైశ్వర్య మాద్యంతమున్
గొనుటేగాని, విమర్శ సేయఁదగునే క్షుద్రంపు బాంధవ్యముల్.

ధృత— పాండవులతోడ వైరంబెట్టి వారలకైనను, నిద్రించు సింగముకోరలు పెఱుకుటవంటిది. అందొక్కఁడొక్కఁడే ముజ్జగంబులు నిర్జింపఁజాలు. చూడుము!

ఉ. త్రుంచెను ముక్కు బకాసురుని; ద్రుళ్లడగించె హిడింబదైత్యుజీ
వించె విషాన్నముల్ మెసవివేసటఁజెందక; లక్కయింట బం
ధించి హుతాశనార్పణము దీర్చఁగఁజేసిన మర్మమెల్ల భే
దించె; వృకోదరుండ సమధీరుఁడు వాని వధింపశక్యమే?

దుర్యో—(కోపముతో) మీరా కౌంతేయమధ్యముండగు భీముని పరాక్రమమునకా బెగడుచుంటిరి! మధ్యందిన మార్తాండ ప్రభాసన్నిభంబగు మత్ప్రతాపానలం బాజి రంగంబునం బ్రజ్వలింప దండధరుగదాదండంబుంబోని మద్గదాదండంబు మదీయ హస్తంబు నలంకరింప వాని బాహుబలంబెల్ల భస్మీభూతంబైననాఁడు మత్పరాక్రమంబు విదితంబుకాఁగలదు. ఆత్మప్రశంసనం బనర్హంబుగదా!

ధృత—కుమారా! నీపరాక్రమంబట్టి దయగుంగాని యప్పాండవులందఱును బరాక్రమ సంపన్నులే.

ఉ. శాత్రవలోకభీకరుఁడు, సాహసలక్ష్మికిఁబట్టుకొమ్మ, లో
కత్రితయైకధన్వి, త్రిజగన్నుతబాహుబలుండు, పద్మినీ
మిత్రసమానతేజుఁడు, సమిద్ధపరాక్రమశాలి, ద్రోణసు
చ్ఛాత్రుఁడు, ఫల్గునుండతనిపాటి యొకండని నిల్చిపోరఁగన్.

ఆతనినామంబు స్వప్నమందు విన్నను సింగంపునామంబు స్వప్నంబునంగనిన మదపుటేనుంగు గుంపుల చందంబున విరోధియూథంబులుసురులకు బాసెదరు. నాఁడు ద్రౌపదీస్వయంవర సమయంబున బలపరాక్రమసంపన్నులమని విఱ్ఱవీగెడు వారలందఱును నైదు పదిసేసి తమతమ వదనంబుల దైన్యంబు లావేశింప సిగ్గుపడియుండ నీయర్జునుండొక్కరుండ కాఁడే ద్రుపదుండువన్నిన మత్స్యయంత్రంబు నూఁటిగ నొక్కవ్రేటునఁ గూటువడనేసె.

కర్ణ—(కోపముతో) ఎద్దియోయొక కన్యాస్వయంవరంబున తన బాణతూణీరంబులకుఁ బనికల్పించెనని భీరుండగు నయ్యింద్రకుమారుని ప్రశంసించుచుంటిరి? సమరతలంబున నాకర్ణాకృష్టధనుర్గుణ నిర్ముక్త ఘోరశరాసారంబుల పరలతాలవిత్రుఁడగు సూర్యపుత్రుండాతనిం బరాజితుం జేయునప్పుడు భవద్వాక్యంబులసత్యంబులగు ననుసంశయంబున మత్ప్రతాపంబు వక్కాణింప వెనుదీయుచున్నాఁడ. దేవర యాజ్ఞయైనచో నప్పాండవాధముఁ డేపాటివాఁడు?

ధృత—అంగరాజా! వాక్పారుష్యంబెప్పుడును దూష్యంబని పెద్దలు వక్కాణింపుచుందురు. మనమగంటిమి సమరతలంబున శత్రుబలంబులతోఁ బిరుతివియక తలపడి పోరునెడం జూపదగుఁగాని మాటలం జూపుట న్యాయంబుకాదు.

దుర్యో—తండ్రీ! ఈతండిప్పుడు యథార్థంబు వచియించెనేకాని తద్వ్యతిరేకంబు జెప్పలేదు. ఆయర్జును నీతండె యెదిరింపలేకయున్న నింక మనబలంబున నోపువారెవ్వరు?

కర్ణ—నామాటలయందేమైన లోపంబుండిన నన్ను మన్నింపవలయు. పిన్నలయందుండు లోపంబులు సైరింపఁ బెద్దలకు విధాయకధర్మంబుకదా! నాకు నాయర్జుననకుంగల బలాబల స్పర్ధనన్నంతతీవ్రంబుగఁ బలుకఁ బ్రేరేఁచినది.

శకు—అయ్యా! మీమీబలాబలంబులును దద్వివాదంబులును గలుగు నవసరంబునకిది యవసరంబు గాదు. దానికిం దగుసమయంబు గలిగినప్పుడ దానిం జూపవచ్చును. ఇట్టియల్పవిషయంబుల మీబలాబలంబుల విని యోగంబుతోడ నంత ప్రసక్తి లేదని తలంచెద.

దుర్యో—బలాబలంబులతోడంగాక మఱి పాండవవైభవంబు సుకరంబుగఁ జేకుఱుదేనితోడఁ బ్రసక్తి.

శకు—మీరాత్రము లేకుండ సావధానంబుగ నాలకింతురేని వారల ననాయాసంబుగఁ బరాజితులంజేయు సాధనంబు విశదీకరించెద. …నాయనగారి సెలవైనంజాలును.

ధృత—ఇంతవఱకుఁ జెప్పినవన్నియును నాయనుజ్ఞఁ గైకొనియే చెప్పితివికాఁబోలును ఇఁకముందువానికి మాత్రము నాయనుజ్ఞయేల? అదియట్టిదియో శీఘ్రముగఁ దెలి బయలుదేఱఁదీయుము. ఒక్కసారి దానియందమును జూతము.

దుర్యో—మామా!

గీ. ఈసరాగములకు నింక నేమిగాని
దాని నుడిచికొనంగ సాధనముగలుగు
నెడల శీఘ్రముగా నెలవిచ్చిమమ్ము
ధన్యులను జేయఁగదవయ్య! దయవలిర్ప.

లోఁతుపాఁతులందెలిసి మఱివక్కాణింతువుగాని పాకున కందినదెల్ల వాక్రుచ్చువాఁడవుగావు.

శకు—కౌరవేశ్వరా! చెప్పచెప్పమనుటయేగాని చెప్పినదానిని లక్ష్యముతోడఁ జేయువారంతగాఁ గానిపింపరు. అడిగితిరిగానఁ దెలిపెద నాలకింపుఁడు.

ఉ. ఆటలలోన నేరుపరియందురు ధర్మసుతుండు వానినా
పాటవమొప్పజూదమున భంగమొనర్చి సమస్త వైభవం
బోటువడంగఁజేసి జగదుజ్జ్వలసంపద మీకొసంగెదన్
"గోటనుద్రుంచివేయునది గొడ్డటఁ గొట్టఁగనేల?" భూవరా!

(అను పూర్వోక్తపద్యమును మఱలఁ జదువుచున్నాఁడు.)

ధృత—సుబలనందనా! దురోదరంబునంగలుగు జయాపజయంబులు మనమనుకొను నట్లు మెలఁగవు. అందొకవేళ మనకేయపజయంబు కలిగిన "ముల్లుపుచ్చి కొఱ్ఱడఁచికొనిన చందముగ" నుండును. అదియునుంగాక ద్యూతంబు మేదురవిరోధ కారణంబు. ఆటయెచ్చైనకొలఁది పట్టుదల వృద్ధియగుచుండును. అయ్యది వృద్ధియగునప్పుడే యుపదేశంబును వీనుల కెక్కనీయదు. లాభనష్టంబులఁ బరిగణింపనీయదు.

శకు—నాకు ద్యూతంబున నపజయంబు కలుగుననియా మీసంశయంబు? దురోదర రంగంబునఁ నేఁజేతఁ బాచికలంబట్టి కూరుచుండిన నాకలిద్వాపరులిద్దఱు నేకీభవించి నాకుద్దిగవచ్చినను నాయెదుట నిల్వనోపరని ఘంటాపథంబుగ శపథంబుఁజేసి వక్కాణించెద. మీరావిషయంబున లేశంబును సంశయింప నవసరంబులేదు.

దుర్యో—మామా! నీయుపదేశంబు చక్కఁగనున్నయది. నీవీయక్షవిద్యయందసమాన శేముషీమంతుండవని జగంబంతకును విదితంబ. (తండ్రివంకఁదిరిగి) తండ్రీ!

ఉ. మొట్టమొదటఁ గొంచెముగ మూలమునందెయడంగియుండి, పెన్
బుట్టలఁబెట్టికొంచుఁ జెదపుర్వులు చెట్టును నాల్గుతట్టులం
జుట్టిసమూలముం జెఱచుచొప్పునఁ బాండవవైభవంబుమిన్
ముట్టెను; గీడగున్ మనకు, మూఁగతనంబువహింపఁ బాడియే?

ధృత—అయ్యా! మీయుద్యమంబున నాకించుక సంకోచంబు బాధించుచున్నది. ఇవ్విషయంబించుక యోచనీయంబకదా! ఇయ్యది మనవిదురునకుందెల్పి వానియనుమతి వడయుదము. భీష్ముని బాహుబలంబునను, విదురుని నీతికౌశలంబుననెకదా మనమింతవఱకునే కీడుం బొరయకున్నవారము.

దుర్యో—(రోషముతో) ఏమిది! మేమింతవఱకుఁ జెప్పినదంతయును "బూడిదంబోసిన పన్నీరుం" జేసి యింకవిదురునితోడనా యోచన? విదురుండు పాండవపక్షపాతియనుట మీరు, నేనెకాదు ప్రపంచమునంగల చరాచర భూతజాలంబులన్నియు నెఱుంగును.

గీ. ఇట్టికార్యంబులను బ్రవర్తించునతఁడు
తనకుఁదోఁచిన తెన్నునఁ జనుట లెస్స
యొరులబుద్ధియు మనబుద్ధి యొకటియనుచు
నిశ్చయింపఁగఁబోలునే నేర్పరులకు?

మీరును మీవిదురుండును మీపాండవులును సుఖంబుగ నుండుఁడు. నేనిప్పుడ పోయి నాపోలినతెఱంగున నుండెద. (అనిచివాలునలేచి పోవుచున్నాఁడు.)

ధృత—(తనలో) ఈతండు ద్రౌపదీ పరిహాసంబు నత్యంతపరాభవంబుగనెంచి దానికిందగు ప్రతీకారంబునకై యాతురపడుచున్నవాఁడు—నేనేమిచెప్పినను మనంబున కెక్కకున్నది. వీనినిందుండి మఱలింప నుపాయంబు పొడకట్టకున్నయది—స్వేచ్ఛానువర్తి నగుదుననుచుంబోయె. ఇప్పుడేమి సేయనున్నవాఁడోకదా!—అయినపిమ్మట నేమనుకొన్న నేమిప్రయోజనము—(ప్రకాశముగా) ఆతురతతో అంగరాజా! సుబలనందనా! మీరిరువురుంబోయి యెటులైననచ్చఁజెప్పి వానింగొనిరండు: ఈలోనం దీనింగూర్చి బాగుగ యోచించియుంచెదను. మనమేకార్యమును దొందరపడి చేయరాదుకదా! ఈతని కిప్పటికిని దుందుడుకు పోయినది కాదు. నాయనా! శీఘ్రముగఁబోయి వానిందోడ్కొనిరావలయు.

కర్ణ, శకు—మహాప్రసాదము (అని యరుగుచున్నారు.)

ధృత—ఇప్పుడు నాకేమిచేయుటకును దోఁచకున్నయది. [illegible] విగ్రహంబగు

ననియు, బలవంతులతోడ యుద్ధంబునకు సన్నద్ధుఁడగుట శ్రేయస్కరంబుకాదని యు విదురుండు నిరంతరంబును జెవినిల్లు గట్టుకొని పోరుచుండు. ఎఱిఁగియెఱిఁగి యిప్పుడందులకేల యియ్యకొందును?

ఉ. పాతకుఁడైనఁ బుత్రుఁ డెడఁ బాయఁగ నేరని మోహవశ్యతన్
ఖ్యాతిఁదొరంగి పుత్రకుని గాచుచు ధర్మతనూజు వీడనా?
నీతిపథానువర్తనమె నిత్యమటంచుఁ దనూజు వీడనా?
వాతవిజృంభణంగదలు వార్ధివలెన్ మది సంచలించెడిన్.

సమస్తామోదంబుల జననీజనకులకు నందనునియందలి యానంద మెక్కుడుఁగదా! ఏది యెట్లు పోయినను పుత్రమోహమును బరిత్యజింపఁజాలను. విదురునితో నీసమాచారంబంతయు నర్మగర్భంబుగ, వానిఁబిచ్చి వీనిమనోరథంబు నెరవేర్పఁ బ్రయత్నించెద. అంతకువినాచేయుకార్యంబు గానరాకున్నది. ఎవరక్కడ?

(అప్పుడు కంచుకి ప్రవేశించుచున్నాఁడు.)

కంచు—స్వామీ! యనుజ్ఞ?

ధృత—నన్నిప్పు డంతఃపురంబునకుం గొనిపొమ్ము. విదురుందోడ్కొని రమ్మనుము.

(అని యిర్వురు నిష్క్రమించుచున్నారు.)

ఇది ద్వితీయాంకము.

శ్రీరస్తు.

దుర్ణయ దురోదరము.

తృతీయాంకము.

రంగము:—హస్తినాపురములోని దుర్యోధనభవనము.

(కంచుకి ప్రవేశించుచున్నాఁడు.)

కంచుకి—“ వినయంధర! నేఁటిదినంబున మన పురంబునకు విజయముచేసిన పాండవేయుల మన నూతనసభాభవనంబున బహూకరింపవలయును గాన నీవు పోయి యమూల్యాలంకార విశేషంబుల మన సభాభవనంబు నలంకరింపుము ” అని దుర్యోధన మహారాజు గారనుజ్ఞనిచ్చియున్నారు. నేనునుదదాజ్ఞానుసారంబుగా:

ఉ. సౌరభసమ్మిళితసలిల సారముచేఁ గలయంపిఁ జల్లి, క
ర్పూర పరాగపుంజముల ముంగిట ముత్తెపు ముగ్గులుంచితిం
జారుసువర్ణవేదికలఁ జక్కఁగ వైచితి రత్నకంబళుల్
హారిమణి ప్రయోగముల సద్దపుబొమ్మ లలంకరించితిన్.

ఈసమాచారంబంతయు నతిత్వరితముగఁబోయి మహారాజుగారితో నివేదింపవలయును. (అని పోవుచు ముందువంకఁజూచి) ఎవరో వచ్చుచున్నట్టులున్నది.

(ప్రతిహారి ప్రవేశించుచున్నాఁడు.)

ప్రతీ—ఓయీ! ఎక్కడకు వేగముగఁ బోవుచుంటివి?

కంచు—వయోవృద్ధుండనగుటచే గుఱుతుపట్టజాలకున్నాను. (అని రెండడుగులునడచి) ఓహో! మిత్రుఁడా! మహారాజుగారి సముఖమునకు.

ప్రతీ—ఏమంత వేగముగాఁ బోవుచుంటివి?

కంచు—మనకేదివచ్చినను నోటనున్న మాట నోటనుండ జరుగవలసినదేకదా!

ప్రతీ—అంతతొందరపని యేమికలిగినది?

కంచు—వారికది తొందరపనియైనను గాకున్నను మనకుమాత్రము ప్రాణముమీఁదికి వ

చ్చుచుండును. ఇంద్రప్రస్థమునుండి పాండవులు వచ్చిరఁట. సభాగృహ మలంకరింపవలయునఁట.

ప్రతీ—పాండవు లిచ్చటికిప్పుడేల యరుదెంచిరి?

కంచు—వారిచ్చటనుండిన నేమిలోపము? మనమా! ఆపూట పనిలోనికి రాకుండినఁ బొట్ట గడియదనుకొనుటకు? ఈసభాభవన నిర్మాణానంతరంబు పాండవులెప్పుడు నిచ్చటికి విచ్చేసియుండలేదు. తద్విలోకనార్థమయి విదురునంపి వీరినిటకు రావించిరి.

ప్రతీ—ఇయ్యది కేవల వినోదవ్యాపారంబా లేక దీని కాంతర్యోద్దేశ మేమైనఁగలదా?

కంచు—వారి యాంతర్యంబుల మనమెట్లు లెఱుంగఁగలము? నీకిట్టి సంశయ మేలకలుగవలెను?

ప్రతీ—పాండవులయెడ వీరికింగల యంతశ్శైత్యంబులును వారికి వీరొనర్చు నిరంతర ఘోరకృత్యంబులును నెఱింగినవాఁడనగుటచే నిట్లడిగితి.

కంచు—ఇట్టిమాటలు మనబోటివారాడుకొనరాదు.

ప్రతీ—కాదు. కాదు. మనకిరువురకును మేనులు వేఱైనను ప్రాణమొక్కటియే గనుక నీకేమయినఁ దెలియునేమోయని యట్లంటి.

కంచు—ఆంతర్యోద్దేశము లాస్థానంబుల కెక్కరాదు. మనతోడిమాటలు మనతోడ నుండునా? గోడలకుఁ జెవులున్నవి. పెదవిదాఁటిన పృథ్వి దాఁటును. ఈకాలమున నొకని నొకరు నమ్ముమనిలేదు.

ప్రతీ—ఓయీ! నీవు నీతోడనే మాటలాడుటకు సంశయపడుచున్నావు.

కంచు—సంశయమునకేమున్నది? కాని యీయుదయమున మన ప్రభువువారును కర్ణశకునులును గలసియేమేమియో రహస్యాలోచనలం జేయుచున్నారు. అదియేమియో యెవ్వరికిని దెలియకుండ నేర్పాటుచేయుచున్నారు.

ప్రతీ—పాండవులకేదయినఁ బునరపకృతిఁ దలపెట్టలేదుకదా?

కంచు—వారి కంతకంటె వేరుయోచన యేమున్నది? నేను సాంతముగ వినుటకు సావకాశము కలుగలేదుకాని వినినమాటల నన్నిఁటి నేకవాక్యముగా సమన్వయించుకొనిన ద్యూతవిషయమని తేలుచున్నది. నాయనా! ఇది యెచ్చటనైనను దెలియనిచ్చెదవుసుమా! నానోటికడ కూడుపడిపోవును. అబ్బాయీ! యింక వేమ దొందరగాఁ బోవలయును. వారిపాటికి కత్తులు నూరుచుందురు.

ప్రతీ—అట్లనేకానిమ్ము. నేనును బోవలయును. దీని చిత్రమేమో యామూలాగ్రముగఁ గనిపెట్టి సాయంకాలము మరల నాతోఁ జెప్పెదవా?

కంచు—ఆలాగుననే. పద.

(అని యిద్దరు నిష్క్రమించుచున్నారు.)

(ఇది విష్కంభము.)

రంగము.—దుర్యోధన సభామందిరము.

(దుర్యోధన ధర్మజ నకులులు ప్రవేశించుచున్నారు.)

దుర్యో— గీ. కరుణనిటమీరు విచ్చేయుకతనఁ గలుగు
శ్రమనపనయింపఁ జాలినసంతసంబు
నీయలేకున్న దీ సభాగృహమటంచుఁ
జాలలజ్జించుచున్నాఁడ శమనతనయ!

ధర్మ—సుయోధనా! తమవస్తువు లెంతమంచివైనను వానికిఁ జాలకఁదనంబు నారోపించుట వినయలక్షణంబుకదా!

నకు—(నలువంకలఁబరికించి) అన్నయ్యా! యీసభావిభవం బందంబున ననుపమానమై, తద్రచనాచమత్కారంబును, నారచనోద్దేశంబులును బరికించి చూడఁజూడ నామనంబున నానందంబు పొంగిపొరలుచున్నది. దీనియందంబిట్టిదని నుడువ నలవిగాకున్నది.

ధర్మ— గీ. చూచెడికొలందిఁ గ్రమ్మెడు సుందరంబు
ముమ్మరంబుగ ముద్వృష్టిఁ గ్రమ్మరింప
నెదయనుపొలంబు మున్గి పోనింకనెటులఁ
దలఁపుమొలకలు తలలెత్తఁ గలుగుఁజెపుమ.

దుర్యో—నామనంబునకు సంతుష్టిఁ గలుగఁజేయవలెనని మీరట్లనుచుంటిరేగాని మయవినిర్మితసభాసదన సౌందర్యంబు వర్ణించిన నోటనిది యుచ్చరింపనైనఁ బనికిరాదని నేఁదలంచెద.

ధర్మ—తమ్ముఁడా!

చ. సకలమనోనురంజనకుఁ జాలిన దంటయెగాని కల్గుదా
నికిని గొఱంతకొంత, యదినేర్పునఁ దాఁదొలఁగించి లోకపా
లకమను పేరికిందగిన లక్షణయుక్తముగా నొనర్చినా

నొకనినిమించు నాతఁడొకఁడుండునుగాతన బుద్ధిచాతురిన్.

నకు—అన్నయ్యా! చక్కఁగ వచియించితిరి. వీరపురుష మానసోత్సాహ జనకంబుగఁ జిత్రించిన యీయాలేఖ్యముంగనిన రాజసభయసు నామంబిందే యన్వర్థాభిఖ్యం జెందుచున్నది. చూడుడు!

ఉ. బంటుతనంబుమీఱఁ దన బాహుబలంబు బయల్పడంగఁ దా
వింటశరంబుఁగూర్చి ప్రతివీరుని హస్తమలంకరించు నా
వింటిని రూపుమాపఁ గడుఁ బ్రేల్మిడి లక్ష్యముసేయుచున్న యా
దంటను బాణమోక్షణ విదగ్ధతయున్ గనుఁగొంటె ధర్మజా.

ఈతఁడు వయసునఁ గడుపిన్నవాఁడయ్యును శౌర్యసాహసాది గుణంబుల మిగుల ప్రోడయై కనుపట్టుచున్నాఁడు. ఆముఖవికాసంబును, తన కోదండపాండిత్యముఁ దగినవానికడఁ గనుపఱుపఁ దరుణము దొరకెగదాయని మనంబునఁ బొంగి పొరలుచున్న యుత్సాహంబును ముద్దులు మూటగట్టువాని మొగంబున మొలచినయటులె యెట్లు చిత్రింపఁబడినవో చూడుఁడు. ఈశిల్పి శిల్పచాతుర్యంబు తలంచినను, ఆవీరపురుషుని మోహనాకారంబుఁ గాంచినను నాయొడలు పరవశమగుచున్నది. ఆయోధవరుని నామంబు గావించి పవిత్రతంగన్న పుణ్యాక్షరంబు లెవ్వియో సెలవొసంగఁ బ్రార్థించెద.

ధర్మ—అబ్బాయీ! ఈవీరపురుషస్వరూపంబు, కించిచ్చరిత్రజ్ఞానంబుఁ గలిగినవారందఱు నెఱుంగఁదగినదియేసుమా! ఆయతి సాహసికుండగు కడింది మగండు రఘురాముండు. ఆవిప్రవీరుండు పరశురాముండు. (పరికించిచూచి) ఈవీరపురుషుల పరాక్రమాతిశయంబులు సత్యంబుగఁ జిత్రించు నేర్పరులుండరాయని తలంచితిగాని నేఁటికి యీశిల్పిచాతుర్యంబుఁ గనిన నాసంశయంబు నివృత్తియయినది. చూడు! ఆవింటిపట్టును, ఆశర ప్రయోగలాఘవంబును, ఆదృష్టి చమత్కారంబును, ఎంతవిచిత్రంబుగను, స్వభావసిద్ధంబుగను లిఖింపఁబడినవో?

దుర్యో—(తనలో) మత్ప్రాగ్వినియమితకార్యంబున కింకను బరిపక్వదశ సంప్రాప్తంబు కాకుండుటంజేసి, వీరిసంభాషణం బత్యంత సంతోషదాయకంబయ్యు, నామనంబునకీ పణ్మాత్రంబు నెక్కకున్నయది. (ప్రకాశముగా) ఇయ్యది పోటరులగు యోధాగ్రేసరులు తమకార్య పర్యాలోచనంబున కప్పుడప్పుడు చేరుచుండెడి యంతర్భవనంబు. అన్నయ్యా! మనమీ ముందుగదిలోఁ బ్రవేశింతము రండు.

(అని మఱియొకగదిలోఁ బ్రవేశించుచున్నారు.)

దుర్యో—నకులా! ఈయంతర్భవనం బెందులకై నిర్దిషితంబయ్యెనో చెప్పఁగొనియెదవా?

నకు—ఇయ్యది కార్యాలోచన సీమయని చెప్పకయే చెప్పుచున్నదియే.

ధర్మ—అబ్బాయీ! నీయుత్తరంబు సదుత్తరంబకాని ఘుణాక్షరంబేమోయని సందియంబు పొడముచున్నది.

నకు—అన్నగార ట్లూహింపఁబనిలేదు. నాయభిప్రాయకారణంబు మనవిచేసెద నాలకింపుఁడు.

మ. తనయాకారవిలాసముల్ గనినయంతన్ మోహవిభ్రాంతులై
దనుజుల్ వేల్పులు జూచుచుండ నిజచిత్తంబన్యు లెవ్వారికిం
గనరాకుండ మనోగతార్థము పొసంగన్ గ్రాలునాలోకమో
హనరూపంబదిగాంచి యెంచితిని గార్యాలోచనా సీమగన్.

ధర్మ—నీప్రస్తుతయోచన నాజగన్మోహన రూపంబునందెట్లు సమర్థించెదవు?

నకు—మనమెద్దియైన నొక యసాధ్యకార్యంబు సాధించునెడ నాజగన్మోహన కైవడి మనయాంతర్యముల నొరులకెఱింగింపకుండ నొరులమనసు సొమ్మఁజేయక మనయభీష్టంబు నెఱవేర్చుకొనవలయును. అదియే కార్యవాదియగు నాతని లక్షణంబు.

దుర్యో—(తనలో) ఏమిది! ఈదుష్ట ప్రతిమ నాయుద్యమంబు వీరికెఱింగింప లేదుగద! వీరిదృష్టులన్యాక్రాంతంబులగునట్లు వేరొకచోటికిఁ గొనిపోయెద. (ప్రకాశముగ) అన్నయ్యా! అయ్యది యాస్థానమంటపము.

నకు—అటులనేకానిమ్ము. దానియందలి చోద్యంబులఁగూడ గనుఁగొందము.

(అని యందుఁ బ్రవేశించుచున్నారు.)

దుర్యో—అన్నయ్యా!

సీ. ఈపార్శ్వమునను మంత్రీశ్వరుల్ గొలువుండురీ చక్కి లేఖరులిరవుగాంతు
రిచట నాసీనులయ్యెదరు ధర్మజ్ఞాతలిట రాజబంధువు లెసఁగుచుందు
రీమూలగను న్యాయమీమాంసకులు నిల్తురీవంక సిద్ధాంతులిరవుగందు
రీప్రక్కఁగవిబృందమిష్టార్థముల నొందునిట గాయకనికాయపటిమ మెఱయు
గీ. నిందు నర్తకపాఠక బృందమందు
నిచటవంది మాగధ జనప్రచయముండు
నీస్థలంబున జనసంఘ మెలమినిలుచు
నదియె ధర్మాసనముగంటె యగ్రజన్మ.

(అంత తెఱలో)

ఉ. ఈనడుమం బరిశ్రమ మొకింతయుఁ గల్గమిఁ గ్రొత్తచేసి చే
యానకయుండెఁగాని మఱియాడినచో నిఁక నాలుగాటలా
పై నెఱుఁగంగవచ్చు మనప్రజ్ఞలలోఁగల తారతమ్య మా
హా! నెఱవాది విల్లలికినంతనె పంతువయౌనె యేయెడన్.

దుర్యో—(తనలో) మనవాండ్రు మేమిచ్చటికి వచ్చినసడి నెఱింగియేకాఁబోలు వా దప్రతివాదముల కియ్యకొనుచున్నారు. (ధర్మరాజువంకఁజూచి) మేలు! మేలు! ఈసంభాషణం బీతని మనంబు నాకర్షించినది.

ధర్మ—సుయోధనా! ఎవరది? అటులనుచున్నారు?

దుర్యో—ఆకంఠస్వరము కర్ణునిదివలెనున్నది. ఆతండెవ్వరితోడనో యీవిశ్రమణభవనంబునఁ బాచికలాడుచుండఁబోలు.

(మరల తెఱలో)

ఉ. అన్నవి నాల్గుపన్నిదము లాపయినింకను నాల్గు రెండునుం
జన్నవి, యన్నిఁగూడ నొక చక్కనయయ్యెడు; నింకఁబాచికల్
దిన్నఁగ లేవటంచు మఱిఁదెల్పఁగఁ జూచెదొ? యానులోకమం
దెన్నఁడె చేతగాని యతఁడేపనికిం బనిముట్లలోపముల్.

ధర్మ—(ఆలకించి) ఈపరిహాసోక్తి మామసౌబలు నిదాయేమి?

దుర్యో—అంతటి ప్రగల్భంబులఁగొట్టు బుద్ధిశాలురు మఱియెవ్వరుందురు?

ధర్మ—మన కర్ణుండాతనితోడ సమముగ జూదమాడఁగలఁడా? మన మెదుటికేగినవారికి స్వేచ్ఛాప్రతిబంధక మగునేమో? మనమీ గుమ్మముకడనుండి వీరి క్రీడాచమత్కారంబులఁ గనుఁగొనుచుందము.

(అని యిద్దరును ద్వారముమాటునఁ జేరుచున్నారు.)

దుర్యో—(తనలో) ఈతఁడు దవ్వులనుండియే చూడఁగోరుచున్నాఁడు. లోనికిఁ బోఁడాయేమి? పోకుండ నుండఁగూడదు—తద్విషయాసక్తుని జేయుటెట్లో?—ఆఁ యిదియేబాగున్నది. ఈతండిచ్చట నుండియే వారియాటలం గనుఁగొనుచుండిన, మామామ తన యాటనేర్పున నయస్కాంత మినుముంబోలె, తప్పక యీతని హృదయంబు సమాకర్షించు.

ధర్మ—(చేయివిదల్చి) అరరే! ఈపందెమునుదప్ప వేసినాఁడు. పాప మీతనికి పాచికపట్టుట తెలియదు.

శకు—(తనలో) వీరిరువురును ద్వారపార్శ్వమునందుండి యేమియోవింతఁగనుచున్నా

రు. నేనునుబోయి చూచెద.

(అని యరుగుచున్నాఁడు)

(మరల తెఱలో)

క. ఏనన్నానని వేరుగఁ
గానఁగ మఱిచెప్పలేనుగాని జగతినే
మానవుఁడు జూదమునన్
బోనడపఁగఁగలుగఁడనుచుఁ బోలును బలుకన్.

ధర్మ—ఏమి! కర్ణునిచేతఁగానివానింజేసి యీతండు జగతిని దానే యప్రతిహతుండనని బింకములుగొట్టుచున్నాఁడు. అన్నా! సుయోధనా! నేనిందుఁ బ్రవేశించి వీని గర్వమడఁగింతునా?

దుర్యో—(తనలో) ఈతఁడు దారిని బట్టుచున్నాఁడు. (ప్రకాశముగ) అన్నయ్యా! మీరనినట్లీతఁ డీవిషయమున వచ్చినవారినందఱి నధిక్షేపించుచునే యుండును. నీబోటివారెప్పుడు నీతనికెదురై గర్వ పరిహారంబుఁ గావించినవారులేరు.

ధర్మ—ఊఁ. అదెంతసేపు. చూచుచుండు. ఒక్కనిముషంబున నీతని బీరంబులు వారించెద.

(అని యిరువురు నందుఁ బ్రవేశించుచున్నారు.)

దుర్యో—మామా! మే మెవ్వరును లేకుండఁజూచి మాకర్ణు నేమేమియో యెత్తిపైచుచుంటివే?

శకు—హాఁహాఁహా. (అనినవ్వుచు) మీరుండినమాత్రమేమి?

ధర్మ—ఆతని కెవ్వరుండిన నేమిలెక్క? "జగతి నేమానవుఁడు జూదమునన్ బోనడపఁగఁ గలుగఁడ" ను నాత్మస్తవంబు వినియే యుంటిమిగదా!

శకు—సత్యంబుఁ బలికినచో నయ్యది యాత్మస్తవం బెట్లగును?

దుర్యో—మామా! మన మెంత చాతుర్యవంతులమైనను, ప్రపంచమున మనకంటె నధికులుండరని మాత్ర మెంచఁజనదు.

శకు—ఏమీ నేవచియించిన దాత్మస్తవంబా?

ఉ. మాటలనన్ను నెవ్వఁడసమర్థుఁడటంచు వచించుచుండెనా
పోటరి ముందువచ్చితన పోడిమి సర్వముఁ జూపఁగల్గినం
దేటపడున్ బలాబలము, నేఁపులేని వృథాప్రసంగమిం
కేటికి. గార్యకౌశలము నేర్పడఁ జూపఁగరాదొ చేతలన్.

దుర్యో—ద్యూతకళామనీషా విశేషుండగు నీధర్మజుండిట నీముందుండగనే వెనుక ముందు లారయక నోటికివచ్చినట్లు తెల్లమాటలాడుట పాటిగాదు.

శకు— క. ఈయంగ విభునిచేనెది
చేయంబడె నదియె యితనిచేఁ జేయఁబడున్
వేయేల యంతకెక్కుడు
చేయంగల చేయిదైనఁ జేయఁగరాదే.

అయ్యది యధ్వరనిర్వహణంబునను, అన్నదానసమయంబునను, జూపఁదగినది. కాని యిచ్చట నాయాటలు సాగిరావు.

నకు—(తనలో) అవురా! ఈతఁడు చేతగానివాఁడని మాయన్ననే యధిక్షేపించుచున్నాఁడే.

ధర్మ—ప్రగల్భులగువారలు తమ ప్రావీణ్యముఁ గ్రియలనేకాని మాటలఁ జూపరు సుమా!

శకు—బాగున్నది. ఉభయుల మొక్కటియే కోరుచున్నవారముగదా! చేతనైనచో వచ్చి భవద్విద్యావైచిత్ర్యంబుఁ జూపి నన్నోడించిపొమ్ము. నేనీమాటలచే బెదరువాఁడనుగాను.

ధర్మ—(కర్ణునివంకఁజూచి) అంగరాజా! నీచేతంగల పాచికల నొక్కసారి యిటు తెమ్ము. నేవీనిబింకమ్ముల పొంకమ్ములు కనుంగొనియెద.

కర్ణు—(చల్లఁగ నట్లు చేయుచున్నాఁడు.)

శకు—ఆఁ! యిట్టివార లనేకులైనారు. వారందఱు నీలాగు చెప్పినవారే.

ధర్మ—మామా! ఈపాటి నీమాటలకు విశ్రాంతినొసంగుము.

దుర్యో—అన్నా! యీయన మాటలముందర మేమెక్కడను నిలువలేకుండ నున్నవారము.

శకు—(దుర్యోధనునివంకఁ దిరిగి) మీకీయీర్ష్యయేల? చేతనైనచో మీరును, ఆతనికి సహాయులరగుఁడు. నేనొక్కఁడన నాప్రక్కనుండెద.

(అందఱుఁ గూర్చుండఁబోవుచున్నారు.)

నకులు—(తనలో) ఈసారి తప్పక యీతనికి మాయన్నచే గర్వపరిహారమగును.

దుర్యో—అయ్యా! మనమందఱముండి స్వేచ్ఛగా వినోదించుటకుఁ దగిన తావీ విశ్రమణ భవనం బొసంగనేరదు. ఏతన్నిర్మితంబగు వినోదభవనం బీప్రక్కనున్నయది. మనమందఱ మందుల కరుఁగుదము రండు. (అని పోవుచున్నారు)

నకు—(తనలో) ఏమిది! నాయెడమకన్నదరుచున్నది. దీనిఫలితం బేమైయుండునో? ఈదురోదర రంగంబున మాయన్నకేమైన నపజయంబు కలుగదుకదా! ఆఁ! అట్లేలయగు. మాయన్న కపజయంబన నెట్టిదియో యతనివిద్యయందు గోచరంబు కానేరదు. కానిమ్ము.

(అని నిష్క్రమించుచున్నాఁడు.)

ఇది తృతీయాంకము.

శ్రీరస్తు.

దుర్నయదురోదరము.

చతుర్థాంకము.

రంగము—ద్రౌపది విడిదియిల్లు.

(ద్రౌపదియుఁ జేటియుఁ బ్రవేశించుచున్నారు.)

ద్రౌప—సఖీ లవంగికా! నేనిల్లు బయలువెడలిన దాదిగ నేలొకో నిశ్చలంబుగనుండు చిత్తంబు తామరాకులోని నీటివలెఁ దల్లడిల్లుచున్నది.

చేటి—అమ్మా! స్వస్థానావాసంబుఁ గనువారికిఁ బరస్థల నివాసంబె యాయాసకారణంబు. అందునను మన మిప్పుడున్న యది శత్రుమధ్యంబు.

ద్రౌప—సఖీ! వింటివో లేదో కాని విదురుండు మొన్న మనలఁ బిలువవచ్చినప్పుడు మనపైఁ గౌరవులు రాజసూయంబు నాఁటనుండియును నీర్ష్యాళురై యుండిరని నుడివి పోయె.

చేటి—అమ్మా! మనపై వారి కసూయ లేనిదెపుడు?

ద్రౌప—అయ్యది యదార్థమె కాని నూతనముగ వారిప్పుడెందులకో కలవలపడుచున్నట్టును, తమ యాంతర్యముల నెవ్వరి కెరుక పడకుండ సంచరించుచున్నట్టును దెలియఁబలికి జాగరూకతతో నుండుండని మేలుకొలిపె.

చేటి—అయ్యది యీయనకెట్లు విదితంబయ్యెనో?

ద్రౌప—కాపట్యముం బుక్కిటం బట్టి సంచరించువారికిఁ దమ యాంతర్య స్నేహితులకడ నయ్యది యెంతసేపని లోలోన నడఁగియుండు? ఏదియో మాటలధోరణిని, అంత విస్పష్టంబుగఁ గాకపోయినను, అసంబద్ధంబుగఁ గొన్ని కొన్ని మాటలు బయలుపడుచుండును.

చేటి—అవునవును. విదురుండు గాంధారీసుతులకుఁ బరమ సౌహృదుండుఁగదా! అమ్మా! విదురుండు కౌరవ ద్రవ్యోప జీవితుఁడయ్యును మనయందింతటి కరుణారసపరిపూరితుండగుటకుఁ గారణంబేమి?

ద్రౌప—విదురుండు పూర్వజ్ఞాన సంపత్తిగల మాండవ్య శాపోపహతుండైన శమనావతారుండు. శమనతనూజుఁ డార్యపుత్రుఁడు.

చేటి—విదురోపదేశంబులఁ బరిగణింపక ధృతరాష్ట్రుండు వయోవృద్ధయ్యును ధర్మమార్గానుసారులమగు మనకిట్టి యపకృతులఁ జేయనేల యియ్యకొనుచుండు?

ద్రౌప—ఆయన మనంబు విదురనిర్ణీతంబు గానియెడ సహజనిర్మలినంబు గాదందురు. సదుపదేశంబు లెంతటివైనను బుత్రస్నేహంబు నతిక్రమింపఁ జాలవు.

చేటి—అవును. మీరనినది యదార్థమే. సహవాసదోష మెంతటికైనను దగినదే. భానుమతీ చారుమతులు స్వభావసిద్ధంబుగ సత్కులసంజనితలనియు, సకలజన సమాదరలనియు, వినుచుందుము. నిన్న మన యాగమనసమయంబున నొక్కసారి మొగమగుపఱచి యింతదనుక మనవంకఁ జూడనైనఁ జూడరైరి. వీరికింతటి బంధుజన నిరాదరంబెట్లలవడెనో?

ద్రౌప—స్త్రీల సహజవర్తనంబు లెట్టివైనను, అను నిమువంబును దమ మార్గంబులనే యుపదేశింపుచుండు తమ పురుషులం బట్టి యంటుగట్టిన మొక్కలకు మూలవృక్షగుణంబు లలవడి నైజగుణంబులు మారినట్లు, తమపతుల యాచరణంబులే వారనుసరింతురు.

చేటి—మన రాజసూయమునం దిట్టి మర్యాదలే జరిగినచో నది యెట్లుండునో?

ద్రౌప—తదర్హసన్మానము నేపొంది శత్రుసమాజమున కింతటి యసూయావేశ కారణంబు గాకయుండును.

చేటి—ఈర్ష్యాళురగుటవలనఁ దామిట్టివారని లోకంబునకు విదితంబగుటయే కాని యందువలన మనకుఁ గలుగు లోపమేమున్నది?

ద్రౌప—పారమార్థికముమాట యెట్లుండినను ఇట్టి యసూయావేశం బప్పుడప్పుడకారణంబుగ నిరపరాధులగువారికిఁ జెరుపు చేయుచుండును.

చేటి—వీనికన్నిఁటికిని వారుత్తరవాదులు కాకుండెదరా? (అలుకుడువిని వెనుకకుఁ దిరిగిచూచి) అమ్మా! మన చారుమతీదేవి తమ్ము సందర్శింప నిటు వచ్చుచుండెను.

(అంతట చారుమతి ప్రవేశించుచున్నది.)

చారు—(తనలో) మాయక్క భానుమతి కార్యాంతరముచే నిటు రావలను పడక ద్రౌపదీదేవిని వినోదకాలక్షేపము సేయించుమని నన్ను నియోగించెనుగదా! నేనా మెదర్శనముంజేసి మాపుష్పవన కేళికాభవనాదులం జూపి కృతార్థతం జెందెద

సు. అట్టి సాధ్వీమణుల పాదస్పర్శనంబునఁ గదా సర్వంబును పావనంబగును.

(అని సమీపమునకరిగి)

చారు—అక్కా! నమస్కారము. (అని నమస్కరింపుచున్నది.)

ద్రౌప—అమ్మా! యిందు గూర్చుండుము.

చారు—(అట్లుచేసి) మాయక్క భానుమతి నిన్నటిదినంబున దమ యాగమన సమయంబునఁ దమ్మెదుర్కొని పునర్దర్శనము సేయనేరమికి నాచే క్షమార్పణ మంపినది. ఆలోపంబు మన్నింప విన్నవించుచున్నాను.

ద్రౌప—మనలో మనకేమి? అత్యంతాప్తులయందుఁ గనుపఱచు నధికమర్యాద లెప్పుడును వ్యాజస్తుతి యనిపించుకొనునుసుమా!

చారు—అక్కా! దాయాదిపత్నులమని మీరు మమ్మన్యథా భావింపఁబనిలేదు. మీయందెప్పుడు నత్యంతానురాగంబుతో మీచరణ సేవఁజేసి మీయుపదేశంబులఁ గొన నుత్సహించుచుందుము.

ద్రౌప—లేదు. లేదు. లోకసామాన్యవర్తనంబు నీకెఱిఁగించితినే కాని నీవట్లనుకొనఁబనిలేదు.

చారు—అక్కయ్యా! ఏమోకాని నేఁడు మీమొగంబు చిన్నబోయి కనిపించుచున్నది. కారణంబేమియో యూహింపఁ జాలకున్నాను. ఇందులకు మాయపచారంబేమైనఁ గారణంబైన మన్నింప వందనపూర్వకముగ వేఁడుకొనుచున్నాను.

ద్రౌప—మంచి యభిప్రాయంబు మనసునందుండినం జాలు. దానిం బదింబదిగఁ బలుకఁబనిలేదు. అయినను బుద్ధిమంతురాలవగు నీవు నేఁ జెప్పవలసిన దేమున్నది? మీవల్ల నేమిలోపమున్నదని చెప్పుదును.

చారు—ఈమనోవైకల్యంబున కది కారణంబు గాకున్న, ననుదినంబును లీలావినోదంబులఁ దోడి చేడియలతోడఁ బ్రొద్దులుపుచ్చు నుద్యానవనాది విహారంబులు లేమి కారణంబుగావలయు.

ద్రౌప—కావలసినయెడ నట్టివినోదంబుల కిచ్చటమాత్రము లోపమేమున్నది?

చారు—అనుదినంబును మానససరోవర విహారంబున నానందించు మరాళంబునకు మలినవారిపూరితటాక సంచారంబున నుత్సాహంబెట్లు జనియించును?

చేటి—ఆమెకట్టి వినోదవిషయంబులందును, సుఖోపచారంబులయందును నంతగ నాసక్తిలేనటుల నొక పేదవిప్రుని వరియింప నొడంబడిన యామె స్వయంవర వృత్తాంతంబె తెల్పుచున్నది.

చారు—అక్కా! మీకట్టి వినోదాభిలాష యంత యతిశయంబుగ నున్నను లేకున్నను మాముద్దు చెల్లింపనైన నొక్కసారివచ్చి మా యారామాదికంబుఁ గాంచి మమ్మానందింపఁ జేయ వేఁడుచున్నాను.

ద్రౌప—అమ్మాయీ! నామనంబించుక యస్వస్థతగా నున్నటులనేఁ దెలుపకయే తెలిసికొంటివి. నే నీమాటకడ్డము చెప్పినచో నీమనస్సున కేమినొప్పికలుగునో యని భయపడుచున్నదానను. నీయిచ్ఛానుసారంబు ప్రవర్తించుటకు నాకించుకయు శంకలేదని నొక్కి వక్కాణించుచున్నాను.

చారు—మనః క్లేశసమయంబున నూతన వస్తుసందర్శనంబును, వినోద స్థలవిహారంబును గావించినఁ దచ్ఛాంతికలుగునని పెద్దలు చెప్పుదురు.

ద్రౌప—అటులైన నాకిందు విందును మందునుగూడఁ గలిసివచ్చి "ఏకక్రియాద్వ్యర్థకరీ" అను నార్యవచనము సార్థకమగుచున్నది.

చారు—ముందుగ మన మీభవనంబునంటియుండు పుష్పోద్యానమున కేఁగుదము.

(అని యందఱునుబోయి యుద్యానవనములోఁ బ్రవేశించుచున్నారు.)

చారు—అక్కా! అనునిముషంబును వింతవింత పరిమళంబుల వెదజల్లి నాసికాపుటంబులందనుపు పూలపందిళ్లును, కలకాలము చిగుళ్లనే కలిగియుండుట, నిర్ణీత ఋతుగానం బుజ్జగించునటుల, కోకిలలకు మూకత్వంబు వదలించు లతానికుంజంబులును, శారికాకీర శకుంత సంతానంబునకు నేకాలంబును మధురఫలాహారంబుల విందులు గొలుపు ఫలవృక్షంబులును, మఱియు నుడువనలవికాని పలువింతలఁ జెన్నలరు నింద్ర ప్రస్థారామంబును గాంచిన కన్నులకిది దివిటీముందర దీపమువలెఁ గానిపించును.

ద్రౌప—అమ్మాయీ! ప్రపంచమునం దేపదార్థమునకును బరిపూర్ణత లేదుకదా! ప్రతిదానికిని నేదియో యొకలోపముండియే యుండును. జగన్నేతయగు నావిధాతచే నిర్మితంబయిన ప్రపంచోద్యానవనంబును నీమనంబున సంభావించిన నీవిటులననేరవు.

చేటి—ఏమమ్మా! మనమీతోఁట జూచెదమని యెంతో ముచ్చటపడి రాగా, సమయముఁగనిపెట్టి, ఆగంతుకముగా శ్యామల నింద్రధనస్సు జనియించి వర్షము వచ్చుచున్నట్టున్నది. మనకన్నియు శుభసూచకములుగనే యున్నవి.

చారు—సఖీ! కేతకీ మల్లికాది సుగంధమున కాసించి యీతోఁటందిరుగు దుష్టపన్నగ భయహరార్థంబు పెంచిన మయూరంబు తనపింఛము విప్పినర్తనంబు సేయు

చుండ నీవదిగాంచి యింద్రధనస్సనుకొని వర్షము వచ్చుననుకొంటివి.

ద్రౌప—ఔనౌను. బంధుమర్యాదకై పురివిచ్చియాడు నామయూరముం గాంచి నేనును, మయూర బర్హాలంకరిష్ణుండగు గోపాలకృష్ణుండని భ్రమించితిని. చూచితివా దానివిశ్వాసము! శ్రోత్రవారిజాడ యగుపడంగనే తనకుం దగిన బంధుమర్యాద నిది యొనర్చుచున్నది.

చేటి—అమ్మా! మొగలిడొంక లీతోంట కేమూలనున్నవో కాని వాని పరిమళ మెంత దూరము వ్యాపించుచున్నదో చూచితిరా?

చారు—కేతకీవృక్షము లీతోంటకుం బశ్చిమ దిక్ప్రాంచనంబునం జాలదవ్వగనే యున్నను తమ సహజసౌరభ్యమును జాలదూరమున కనుపుచున్నవి.

ద్రౌప—సజ్జను లెంతదూరమున నున్ననేమి. వారివారి సుగుణములవలన నేకదా ప్రఖ్యాతిం గాంచుచుందురు.

చేటి—అమ్మా! మనోహరముగ వికసించి వనమున కంతకును వన్నెందెచ్చుచున్న యాపూలచెట్టు సకలఫల సంపంగియా?

చారు—అవును. సకల కుసుమంబులంజేరి యందలి యాసవంబునెల్లం గడుపారంగ్రోలి మత్తిల్లు మధుపులకుం జేరరాని సంపంగియేయిది.

ద్రౌప—దుష్టులు సజ్జనుల నెప్పుడును సమీపింప సమర్థులు కారుగదా!

చేటి—నీలవర్ణముగల యాకారమున మినుకుమినుకునం గానిపించు నక్షత్రసమితివలెం జాలం బరిమళములచే సంస్కరింపంబడిన సుందరాంగుల కేశబంధములపై నాడు మల్లెవిరులంగన్న యీపూలపందిరిం గాంచితిరా? కలంతవారిన మనంబున కుపశమనంబుం గలిగించునందురు.

చారు—ఫలరహితములైన కేవల ప్రసవంబులచేతనే సగంధంబులగుటవలనం బ్రయోజనంబేమని మల్లికా కాయమానంబులం దృణీకరింపుచు వానిమాటు సేయునో యనునటులం దమ ఫలప్రసూనదళంబులం జూపఱకుం గనుల పండువుసేసి నిజపత్రసంపదచే విఱ్ఱవీఁగుచు బహుకుటుంబకునివలెం గానిపించుదాని చేరువనున్న యాకదళీకాతరు సంతానముంగూడం గనుంగొనుడు.

ద్రౌప—ఔను. అది కాంచియేకాంబోలుం గడుపారం గనిన కన్నతల్లినే కడతేర్పం జూచు నీఫలంబులతోడం బ్రయోజనంబేమని తన ప్రసవంబుల నభిలషించిన యువసముదాయంబు ప్రమోదుపరచిన తనతల్లిలతకు ముద్దులు మూటగట్టు మోహనాకారమొసంగి తన్నాసించిన జనులకుం దన పరువమెల్ల ధారవోసి పరోపకార పారీణత్వము వెల్లడిసేయుచు నామల్లెపందిరి రదనంబులంబోలు తనమొగ్గచాలుచేం బరిహాసింపుచున్నది.

చారు—ఇంతటి పరోపకార పారీణతగల జన్మమీ మల్లెకేల లభ్యంబయ్యెనో?

ద్రౌప—మున్నీశ్వరుండు తపోనిష్ఠాగరిష్ఠుండై యున్నయెడం బార్వతీప్రియార్థంబు మదనుండాతని హృదయంబు నొప్పించెననుట నీవు వినియేయుందువు.

చారు—ఈశ్వరహృదయంబాతండు నొప్పించుటయు నందువలన నాతండనంగుండగుటయుంగూడ నెఱుంగుదును.

ద్రౌప—అనంతర మాతనిరాణియగు రతి భర్తృవియోగదుఃఖపరిపీడితయై భక్తాభీష్టఫలప్రదులగు పార్వతీపరమేశ్వరులంగూర్చి తపంబుసలిపి వారిం బ్రసన్నులంజేసికొననందు పుష్పోద్యానములయందతండు రూపరహితత్వంబున సజీవుండైయుండునట్లుల శంకరుండును, దనకుం బరమోపకారియై యీశ్వరునివశంవదుంజేసిన యుపకృతికై సకలసౌరభ్య సంవాసంబునం జూపఱ హృదయంబు రంజిల్లంజేసి సద్యశస్సాంగత్యము నిత్యంబును గలుగ పుష్పరాజంబగు మల్లికాకుసుమంబై యుద్భవించునటుల పార్వతియును వరంబులిచ్చిరట. పార్వతీవరప్రభావంబున నిదికాముని యపరావతారంబగుటంజేసి దీనికింత మహిమంబుగలిగె. సజ్జనులకుసల్పిన యుపకార మూరక పోదుగదా:

చారు—సజ్జనులకేమి దుర్జనులకేమి? ఉపకారపరునియందు కృతజ్ఞతగలుగుట ప్రకృతిధర్మంబుకదా: చూడుము: మధుపానలోలురయ్యును దేంటిబోటులీ యుపవనంబున మకరందమునెల్లం గ్రోలి తత్ఫలంబుం దమకుసమకూర్చిన దయామయుండగు నాపరమేశ్వరుని యనూనకరుణాకటాక్షంబునకు సంతసించుచుం గృతజ్ఞతానూచకంబుగ నిజఝుంకారంబులకు జలయంత్ర ధారాశబ్దంబుల శ్రుతింజేసికొని భగవద్భజనం జేయునట్లు శ్రావ్యనినాదంబు సేయుచున్నవి యాలకింపుము!

చేటి—ఈపొగడపువ్వులు యౌవనదశయందు జన్మస్థలంబున మివుల నామోదవంతంబులై స్థానభ్రష్టత్వము నొంది రాలిపోయినను దమ సహజవాసనల విడువక, యెండుపువ్వులుసైతము గుప్పుగుప్పునం గమ్మతావుల విరజిమ్ముచు మనకు వెలలేనివిందులు సేయుచున్నవి.

ద్రౌప—మంచివార లెట్టిదశయందున్నను తమమంచితనమును విడువనేరరుగదా!

చేటి—అమ్మా! వింతవింతరంగుల ముద్దినుసు ముక్కారాకులంగలిగి గుజ్జుమావిగున్నలవలెం గానిపించు లావణ్యవల్లుల సుందరాకారంబుం జూడుము?

ద్రౌప—హరితశ్యామారుణవర్ణ పత్రంబుల సర్వావస్థలయందు దర్శనీయంబులై చూపఱ యాలోకనంబుల నాకర్షింపుచుఁ బుష్పఫలశూన్యంబులని నిరసనంబునొందక కాలపురుషుండొక మూలనుండి పాండుచ్ఛదంబుల నూడ్చిన మఱియొక మూలనుండియాలోకంబును దన నూతనపత్రంబుల నివారించుకొనుచుఁ దమ గోప్యంబుల నెవ్వరెఱుంగకుండఁ జేసికొనుచుండె.

చేటి—అమ్మా! ఏమిది! పరాకుగా మాట్లాడుచున్నారు? మీనోటనెప్పుడును నిట్టియమంగళవాక్యంబులవిని యెఱుంగము.

ద్రౌప—ఏమన్నాను?

చేటి—పాండుచ్ఛదంబు లూడ్చుటయని యేమేమోయంటిరి. పాండుచ్ఛదంబులనఁ బండుటాకులని మీయభిప్రాయమై యుండును. అవునవును. నిజమే

ద్రౌప—ఏమో! ఈదినము తెల్లవాఱినది మొదలు నాకన్నియు నవశకునములే యగుచున్నవి——విచారించినఁ బ్రయోజనంబేమి? కానున్నది కాకమానదు

చేటి—అందునను దుదకు మేలేస్ఫురించినది. మాటలసందర్భమున ననేకవిధములైన శుభాశుభములు తలంపునకు వచ్చుచుండును. దుర్జనులు సజ్జనులకెట్టి దుష్కృతం బొనరింపఁ బూనినను వారికిఁ బురుషోత్తముండు తోడునీడైయుండి సర్వదా కాపాడుచునేయుండును,

చారు—ఏమిది! రాజసేవకుండెవండో వేళగానివేళ నంతఃపురజనంబు విహరించుచోటికి ననుజ్ఞయైనఁ గైకొనక యేతేరఁ గారణంబేమైయుండును?

(అప్పుడు ప్రాతిగామి ప్రవేశించుచున్నాఁడు)

ప్రాతి—అమ్మా! (అని గద్గదస్వరముతోఁ బిలిచి యూరకొని తనలో) అబ్బా! నానోట మాటరాకున్నది. ఇప్పుడీదుర్వార్త నీమెకెట్లు తెల్పుదును?—ఒక్కతెల్పుటతోడ సరియా! యీమెను సభాభవనమునకుఁ దోడ్కొనిపోవలయును ఈవార్త నేఁ దుదనెగ్గించుకొనఁ గలనా?——యీపతివ్రతాశిరోమణి కీపలుకులఁ దెల్పి పరిభవము పాలుసేయుటకన్నఁ దుచ్ఛమైన యీసేవకావృత్తి వదలుకొనుటయే యుత్తమమని తోఁచుచున్నది——కాని యీప్రవృత్తినింతటితోనివృత్తిచేసికొని మరలి పోయెద. (అని రెండడుగులునడచి) ఛీ! నావంటివెఱ్ఱివాఁడీలోకమున నెచ్చటనైన నున్నాఁడా! ఇది నాయొక్క మొగమున నే వ్రాసినదా? ఊఁ. యీసేవకావృత్తి యెంతటికైనందగును. ఇందునకుంబాల్పడిన వారికందఱికి నిదియేపాట్లు.

మ. ఇదిచేయందగుఁ జేయరాదిది ఘనంబీకార్య మల్పంబి ద
ల్లది చాలన్ సుకరంబు, దుష్కృతపుకార్యంబిద్ది యంచెప్పుడే
నెదనూహింపక కింతయున్ హితవుగానీ కాక పోనీక దుం
ముదమింపారఁగఁ జేయునట్లుదరముంబూరింపఁ జేయన్ వలెన్.

ఇట్టి దుర్వృత్తి నవలంబించినవారందఱును గుండెరాయిచేసికొని యంతరాత్మను హృదయసదనంబునుండి పోఁద్రోలి కటికవానివలెఁ బనిచేయవలయును. మున్ను హరిశ్చంద్రుండు కాటికాపరియైనపుడు భార్యయని చంద్రమతికడఁ గాటికట్నముం గైకొనకవిడిచెనా! యీమాత్రపుఁబనికి లేనిపోని శంకలుచేసికొని నోటికడనున్న యన్న మేల పోఁగొట్టుకొనవలయును? (అని సమీపించి) అమ్మా!

చారు—(కోపముతో) ఎవరునీవు? అంతఃపురజనంబులు విహరించుసమయంబున నిచ్చటికేల యరుదెంచితివి?

ప్రాతి—(తొట్రుపాటుతో) దుర్ఘట సందేశముచేతఁ దొట్రుపడుచున్న చిత్తంబుతో నేమరుపాటున ననుజ్ఞ గైకొనకవచ్చిన నాలోపంబు మన్నింపఁ బ్రార్థించెద.

(అని కేలుమోడ్చుచున్నాఁడు)

చేటి—నిన్నడిగిన ప్రశ్నమునకు సమాధానముచెప్పక యేమేమియో చెప్పెదవేమి?

ప్రాతి—(తనలో) దేవిగారియెదుట ననుదినంబును మెలంగుచున్న వాఁడనేనైనను నన్నామె యానవాలు పట్టలేదుకాఁబోలు. వారికేమి ప్రభువులు. నావంటిరాజభటు లెందఱున్నారుకారు. (ప్రకాశముగా) అమ్మా! నేను దేవరవారి భటుఁడను. నాబాహ్యవేషమే నాయుద్యోగమును విశదీకరించెనని యనుకొంటిని.

చేటి—నీసందేశమేమనియడుగుచున్నారు. ఉన్న వారిద్దఱిలో ముగ్గురుని మఱచువానికి నీకీయుద్యోగమేల లభ్యమైనది?

ప్రాతి—(కోపముతో) ఏమే! కూలికివచ్చి పాలికి మాటలాడినట్లు దేవిగారికి భయపడుచున్న నన్నుఁజూచి నీవేల పరియాచకమాడెదవు?

చారు—ఓరీ! యీయప్రస్తుత ప్రసంగమేల? నీవిప్పుడేలవచ్చితివి?

ప్రాతి—అమ్మా! నావార్త బహుదుర్భరమైనది.

చారు—ఇంత చేతగానివానికి నీకీపని చెప్పినవారలెవ్వరు?

ప్రాతి—అమ్మా! మన దుర్యోధన ప్రభువువారు ద్రౌపదీదేవిని సభాభవనంబునకుం గొనిరమ్మన్నారు.

చారు—ఏమిరా! తప్పత్రాగి కులముమఱచి యున్నట్టులు నీయొడలు నీకుఁదెలియక

మాటలాడుచున్నావు? ప్రభువారేమి ద్రౌపదీదేవినేమి రమ్మనుటేమి?

ద్రౌప—(తనలో) వీనిమాటలేమో నాకర్థముగాకున్నవి. నా డెందము గడు నారాటము నొందుచున్నది. ధర్మజుండనుటకు మారుగ దుర్యోధనుండనలేదు కద! ఆతండేయయిన నన్ను సభాభవనమునకేల కొనిరమ్మనును? దీనికెద్దియో యొక విపరీతకారణంబుండియుండును. కానిమ్ము, ఈతండేమియో చెప్పఁబోవుచున్నాఁడు కదా!

ప్రాతి—ఆగ్రహింపకున్న సావకాశముగ మనవిచేసెదను.

చారు—అధికప్రసంగము చేయక నీవచ్చినపని నెరవేర్చుకొని వచ్చినదారిం బొమ్ము.

ప్రాతి—సౌబల ధర్మనందనులు మన నూతనసభాగృహంబున జూదమాడుట దేవిగారికిఁ దెలిసియుండక పోదని పర్యవసానము మాత్రము మనవిచేసినాను.

ద్రౌప—(తనలో) అదుగో! ఏదో యీతం డార్యపుత్రుని పేరు నుడువుచున్నాఁడు జూదమాడుట యనుచున్నాఁడు. దుర్యోధనుండుండ నాతండు సౌబలునితోడ నేలయుద్విఘుఁడగు? మనసు కుదుటఁ బెట్టుకొని వీనిమాటలాలించెద.

చారు—సౌబలునితోడనా ధర్మజుండు జూదమాడినది? అట్లయిన నెద్దియో విపరీతమేయున్నది. అచ్చట మఱియెవ్వరెవ్వరున్నారు?

ప్రాతి—మనదుశ్శాసన ప్రభువారచ్చట లేరు. దుర్యోధన సఖులు మాత్రమున్నారు.

ద్రౌప—భీమార్జునులచ్చట లేనే లేరా?

ప్రాతి—వారచ్చట లేరు. అమ్మా! ఈజూదంబుఁ జూడఁ గపటజూదంబువలె నున్నదిగాని వినోదంబుగఁ గనిపించలేదు. (తనలో) అయ్యో! ప్రమాదము సంభవించినదే. మాదేవి చారుమతి యిచ్చటలేదనుకొని నామనంబుఁ దెలియఁబల్కితి. (ప్రకాశముగా) కాదు కాదు, పొరపడితిని, కపటద్యూతంబుకాదు వినోదక్రీడయే

చారు—ఓయీ! నీవు నాకు భయపడవలసిన పనిలేదు. నీమనంబున నున్నది యున్నట్టుల తెల్పుము.

ప్రాతి—అమ్మా! దేవిగారికి విశదముకానిదేమున్నది? ఈజూదంబు ధర్మనందనున కాకస్మికంబుగనే సంప్రాప్తంబయ్యె. కాని మనవారికిమాత్ర మట్టిదికాదని నానమ్మకము.

చారు—ఇయ్యది పూర్వసంకల్పితంబే యైనచో మీప్రభువారికిఁ దెలియకుండదుగదా!

ద్రౌప—(తనలో) ఈవృత్తాంతంబేమియో కడుఁజింతగనున్నది. దీనింబట్టిచూడ విదురుని సందేశంబున కర్థంబు పొడకట్టుచున్నది. ఆతండసత్యంబేలపల్కు? నాకంతకంత కారాట మెక్కువయగుచున్నది. నేఁడేమి మూడనైయున్నదో! నేనెంత ప్రయత్నించినను గుండె కుదుటఁబడుటలేదు.

ప్రాతి—అమ్మా! యీయుదంతంబు పూర్వోత్తరంబుల నెఱింగించెద నాలకింపుఁడు. లేకున్న నామాటలయందు దేవిగారికి నమ్మకము కలుగునో లేదోయని భయపడుచున్నవాఁడ. యీవిషయంబు దేవిగారికిని దేవరవారికిని గూడఁ దెలియలేదనుటచే సవిస్తరంబుగ నుడువవలసివచ్చె. దేవిగారి యనుజ్ఞయగుటచే మనవిసేయ సాహసించుచున్నాఁడను.

చారు—నీకేమియును భయములేదు. ఉన్నది యున్నట్టు తెల్పుము. నీప్రాణమునకు నాప్రాణ మడ్డము వైచెదను.

ప్రాతి—దుర్యోధన కర్ణశకునులు మువ్వురును దమలోఁ దామెద్దియో కూడఁబల్కుకొని కర్ణశకును లిద్దఱును నేకాంతమందిరంబునకుం జనిరి. దుర్యోధనుం డొక్కరుండె ధర్మనందనునికిఁ దన నూతనసభాగృహంబుఁ జూపుటకుం బలె బయలువెడలి క్రమంబున నందందుఁగల విశేషంబులఁ జూపుచువచ్చె.

చారు—అటుతరువాత?

ప్రాతి—వారాలోచనామందిరంబున సంచరించుచుండఁ గర్ణశకును లిరువురును, నేకాంతమందిరంబున జూదమాడుచుఁ బరస్పరవైషమ్యములఁ బెంచికొనుచు ధర్మజుని హృదయంబు నాకర్షించిరి.

చారు—తరువాత?

ప్రాతి—ధర్మజుండటుపిమ్మట నాయాక్షేపణలు సహింపఁజాలక తానును దద్వినోదాసక్తుండైయుంటఁ గర్ణుని యాటవంకఁ గొంచెముపలక్షించి యాతండు చేతగానివాఁడౌటచే సౌబలుండధిక్షేపించుచున్నాఁడనుకొనియెంగాని యదంతయును, గపటఖేలనంబని యెఱుంగనేరక కర్ణునిచేతఁ గలపాచికలంగొని తానె యాడఁదొడంగెను

ద్రౌప—(తనలో) అయ్యో! ఇంక మోసంబునకేమికొదువ? తనమోసకృత్యంబున నాతండు ఆర్యపుత్రునికడ విశేషద్రవ్యంబు లపహరించియుండు. ధర్మనందనా సౌబలుండు కడుమాయావియని యెల్లప్పుడును నుడువుచుండెడివాఁడవే? ఆమాటలేల మఱచితివి?

చారు—తరువాత? తరువాత?

ప్రాతి—వారిరువురు నాటకముపక్రమించిన పిమ్మట నదియేమివింతయో కాని మొట్టమొదటియొకటి రెండుపందెములందక్క——అతనిగెల్పులన్నియు నేమయ్యెనో? అన్ని పందెములయందును సౌబలునిదె పైచేయియాయెను.

చారు—ఈవిషయంబున సౌబలుని వైదుష్యంబట్టిదియేకదా!

ప్రాతి—ఆపందెంబుల, ధర్మనందనుండొడ్డిన పన్నిదధనంబు లిన్నియన్నియని యేమిం చెప్పుదును! ఏండ్లకొలంది యాడినను గొఱంతవడకయుండు ధనసంచయంబులన్నియు నొక్కొక్కపందెంబునకే యొడ్డి——అదియంతయు గ్రహచారవిశేషంబు. ఆయననన బనియేమున్నది? ఆయనమాత్రము తెలియనివాఁడా యేమి? అది యేమిపాపమోకాని యోటమి హెచ్చినకొలందిని బంటె పందెంబునకును బణద్రవ్యంబు హెచ్చఁదొడంగెను

ద్రౌప—(ఆత్రముతో) తరువాత నేమిజరిగినదో శీఘ్రముగఁదెల్పుము?

ప్రాతి—అమ్మా! ఏమనితెల్పుదును? ఇట్లాతండు లెక్కకెక్కువయగు రొక్కంబులొక్కొక్కపరియే యోడి పోవుటంజేసి యాతని సర్వస్వమ్మును నామమాత్రావశేషంబై, పిమ్మట రాజ్యంబశేషంబును, దమ్ములను, దన్ను,మిమ్ముంగూడఁ గ్రమంబుగా నొడ్డి యోటువడియె.

ద్రౌప—హా! (అని మూర్ఛిల్లుచున్నది)

చేటి—(తొట్రుపాటుతో) అమ్మా! అమ్మా!——అయ్యో! అయ్యో! నేనేమి సేయుదును. ఈమె నోటమాటరాకున్నది అమ్మా! చారుమతీ! నాకిప్పుడేమిదిక్కు?

చారు—(తనలో) ఏమిది! ఈవిషయంబావంతయు నార్యపుత్రునకుం దెలియకుండఁగనే జరిగెనాయేమి? ఇంకను నెవ్వియో యుత్పాతంబు లుత్పన్నముగానున్నవి. (తేఁటి ప్రకాశముగా) లవంగికా! విచారపడకు. విచారపడకు. పిడుగువలె హఠాత్తుగ నీదుర్వార్త చెవింబడుటచే మనసు చెదరినది. మనము తొందరపడి చేయునదిలేదు. ఒకింత సేపటి లోన సేదదేఱును. వేగ నీవా కేళికాసరోవరంబునకుం బోయి కొంచెముదకమిటు తెమ్ము. మొగంబుఁ దుడిచెదను. అధైర్యపడకుము (అని చెంగుచే విసరుచున్నది)

చేటి—(సరోవరంబునకేగి జలకలశంబుతో మరలఁ బ్రవేశించి చారుమతితోఁ గలసి యుపచారంబులు! సేయుచున్నది)

ద్రౌప—(తెప్పిఱిల్లి) అన్నా! దైవమా! కేవల ధర్మమార్గపరాయణులగు పాండవులకెంతటికష్టములం దెచ్చిపెట్టితివి? సుయోధనా! గృహప్రవేశమహోత్సవంబని మమ్ములనందఱ నిటకురావించి పరమానంద భరితులంజేయుటకు మాఱుగ నత్యంత సంతాపిత స్వాంతులంజేసితివి. ఇట్లు విపరీతంబులఁ జేయ నీకునాపతు లెప్పుడైనఁ బల్లెత్తుమాట నెదురాడి యెఱుంగుదురా? మాకెప్పుడెట్టి యపకృతులఁగావించినను వానినన్నిటిని దైవతంత్రంబులను పరమార్థభావంబున మీకించుకంతయైనఁ బ్రతీకారమొనరించి యెఱుంగరు. అను నిముషంబును మిమ్ముల సోదరభావంబునం జూచుకొనుచుండిరి. ఎప్పటి యపకృతుల నప్పుడు మఱచి "కాలుఁబట్టి పడఁద్రోయఁ జూరుఁబట్టి వ్రేలాడు" పోలిక నింతకంటె నత్యాసన్నులఁ లేరని మిమ్ములనే పట్టి పాకులాడువారి పరమసాత్త్విక ప్రవర్తనకనురూపంబైన పాఠముం గఱపితివి. నోఁప్రేలుంచినఁ గరువ నేరనివారికిని మీకును గోవ్యాఘ్రమైత్రి వాటిల్లినది. ధర్మనందనా! పరమకుత్సితుండగు నాసౌబలునితోడ జూదమాడుట యేటి వినోదంబని యెంచితివి? తెల్లనివన్నియుఁ బాలును నల్లనివన్నియు నీళ్లనుకొని మీమనస్సువలెనే యందఱిచిత్తంబులుండునని యెంచికొనుచుంగురు. మొదటినుండియు మిమ్ముల నదియే మోసముచేయుచున్నది——ఓహృదయమా! ఇట్టిదుర్వార్తలాలించియు నీవీదుఃఖభాజనంబగు శరీరంబువాయక నీరుగఁ గరఁగిన యినుము క్రమక్రమంబుగఁ దనద్రవరూపంబువిడిచి గట్టివాటీనట్లు నీవతికాఠిన్యముం జెందితివి.

చారు—(దగ్గరజేరి) అక్కయ్యా! ఊరడిల్లు మూరడిల్లుము. ఈతనిమాటలు నిజమో యబద్ధమో యెఱుంగకుండ సమస్తము నెఱింగిన మీరుఁగూడ నిట్లు చేలవడెదరేల?

చేటి—మున్ను విషాన్నమొసంగుటను లాక్షాగృహంబుదహించుటను దలంచినఁ బ్రాణాపహరణోపాయంబునకన్న దీననాధిక్యమేమున్నది?

ద్రౌప—మానధనులకు మానంబుపోవుటకన్నఁ బ్రాణంబుపోవుటయే సుఖతరంబు.

ప్రాతి—అమ్మా! నేవచ్చి చాలతడవైనది. ఆలసించిన నాపై నలుకవహింతురు. భృత్యధర్మంబులు మీ రెఱుంగనివి లేవు, నేవేగమే పోకున్న నాతినుతినుకూటికి నీటిబొట్టు వదలుకొనవలెను. వేగనన్ననుగ్రహింపుడు.

ద్రౌప—(నిటూర్పులం బుచ్చుచు) ఓయీ! తమ్ములను, తన్ను, నన్నుంగూడనోడి పోవునంతటి విపరీతంబేల తటస్థించెనో?

ప్రాతి—సర్వరాజ్యాపహరణానంతరంబు, సౌబలుండు, ధర్మజునికడ నింక ద్రవ్యం

బేమియు లేకుంటంగాంచి "ధర్మనందనా? మనమాటలకుపక్రమించి చాలఁదడవైనది. కడుడస్సితిమి. ఇంక నాటఁజాలింతము" ని చేతనున్న పాచికలఁ గ్రిందఁబడవైచి లేవఁబోవ, ధర్మనందనుండు, ఆయదృష్టఫలంబేమియోగాని సౌబలునిచేయి బట్టికొని "మామా! యింక నాలుగాటలాడి మఱిఁ జాలింతము" అని బలిమిని గూర్చుండఁజేసెను.

ద్రౌప—దైవంబు ప్రతికూలుండైనచో విపత్తులందామె కోరి తెచ్చికొనుచుందురు. "బుద్ధిః కర్మానుసారిణి" యనవినమె.

ప్రాతి—అంత సౌబలుండు ధర్మజునితోడ నీరీతింబలికె

చ. "శమనతనూజ నీకుఁగల సంపదలన్నియు రాజ్యలక్ష్మియుం
గ్రమమున నోడిపోయితివి, కర్మము బందె మొనర్చ దేని, దర్
వ్యము నిటముందుఁ జూపి మఱి పాచికలన్ స్పృశియింపఁ గావలెన్
మముఁ గఠినాత్ములంచును మనంబున నెంచకుమయ్య! యిత్తఱిన్."

ద్రౌప—అన్నా! అంతటి మహదైశ్వర్యకాముననుఁ బందెపుఁ బణంబున కొక్కకాసైనఁ జేతలేకుండఁ బోయెఁగా! లక్ష్మీ! నీ వెంతటి చంచలచిత్తురాలవే? యీపూట నొక్కనికడఁజేరి వానినవ్వింపుచు, మఱుచటి పూట మఱియొక్కనిఁ జెట్టఁబట్టి, అకలకలలాడు మొగంబును వెలవెలబోవఁ జేసెదవు. జగదేకరక్షకుఁడగు నంతటి మహామహుని కిల్లాలవగు నీకింతటి స్వచ్ఛందవృత్తి యెట్లలవడె? అనుకూలదాంపత్యమదృష్టప్రసూతము. కృష్ణా! నీనిష్కాత్మీకచిత్తంబు దీనంజేసి జగద్విదితంబయ్యె. దైవంబన నీవ దైవంబవు. నీవాపరమధర్మ నిరతులగు పాండవపక్షంబవలంబించి, స్వచ్ఛందసంచారిణియగు నీరాణిని దుర్ణయనిశ్చితచిత్తులగు నాకురుకుల పాంసనుల కడనుండఁ బంచితివా? లేకున్న నిట్టి విపరీతంబు లెట్టులుత్పన్నంబగును——మాపూర్వపుణ్యమున కామహామహుని నిందింప నేల?

ప్రాతి—అంత నాతండేమియుం దోఁచక యూరకుండ సౌబలుండు ధర్మజు సంబోధించి "నీకింకను, ఆడమనసగు నేని నీసోదరుల బాహుబలధనంబుఁ బణంబు సేయవచ్చు దానికుద్దిగ నే నీకడ గల్పిన సర్వైశ్వర్యంబులును బణంబు సేసెద" నని ప్రోత్సహింప, ధర్మజుండందులకియ్యకొని మరలనాడి యెప్పటియట్ల నపజయంబునొందె. నన్ను, [illegible]ముగొనిరమ్మని మామహారాజుగారనుప, నేనిటకేతెంచితిని.

ద్రౌప—ఇయ్యది మాశమననందనుండాకర్ణించెనా?——ఏమనంగలుగు! గతించిన దానికి వగవంబనియేమి? నాకీవిషయంబున నొక్కసందియంబు దోఁచుచున్నయది.

సభాస్తారులందఱిముందర నాసందియంబు ధర్మజునకు విన్నవించి ప్రత్యుత్తరంబు వడసిరమ్ము. అనంతర కర్తవ్యంబు యోచింతము. విధిచెయిదంబు లలంఘ్యంబులు

ప్రాతి—అయ్యది సెలవొసంగిన నట్లే పోయివచ్చెదను.

ద్రౌప—ధర్మజుండు మున్ను తన్నొట్టువడి నన్నొట్టువడియెనో, నన్నొట్టువడి తన్నొట్టువడియెనో యెఱింగిరమ్ము.

ప్రాతి—మహాప్రసాదము. (అని నిష్క్రమించుచున్నాఁడు)

చారు—అక్కయ్యా! "తానొకటిఁదలంచిన దైవమొకటిఁ దలంచె." ననునట్లు మనయుద్యానవన విహారమెంతో ముచ్చటగనున్నది. ఈప్రాతిగామి వాక్యములు నాకు స్వప్నవృత్తాంతములుగనున్నవి. ఇంతదనుక నీద్యూత సమాచారంబించుకయు నాచెవింబడదయ్యె. ఈసమాచారంబు విన్నప్పటినుండియును నామనంబు మనంబునలేదు. ఒక్కసారి సెలవొసంగిన నేఁబోయి యిందలి వాస్తవమెఱింగివచ్చెదను. ఒంటరిగ నిమ్మిట విడిచిపోవఁగాలాడకున్నది. ఈపాణిద్వారంబునఁబోయి యిచ్చటనున్నటులే వచ్చెద.

ద్రౌప—పోయిరమ్మా.

(చారుమతి నిష్క్రమించుచున్నది.)

ద్రౌప—ఓసీ! లవంగికా! ప్రాతిగామి, భీమార్జునులు ద్యూతప్రదేశంబునఁ లేరనియె. వారెప్పుడేచ్చటనున్నారో తెలిసికొని యీవ్యాపారంబేమైన వారికిఁదెలిసెనేమో కనుఁగొనిరమ్మా.

చేటి—అట్లే పోయివచ్చెద కాని అమ్మా! ఈప్రదేశంబు దుశ్శాసనాది దుష్టజనవిహారస్థానంబు. నీవొంటరిగనున్నదానవు. నేవచ్చుదనుక గడుజాగరూకతతో మెలఁగవలయును. నేనుమాటవడిన మరలివచ్చెద.

ద్రౌప—ఒంటరిగనున్న నేమి? మనకెల్లప్పుడు నాదైవంబె సహాయంబు.

చేటి—అమ్మా! నేఁబోయివచ్చెద. (అని నిష్క్రమించుచున్నది.)

ద్రౌప—ఏమిది! మరల నాకుడికన్నదరుచున్నది. ఇంక నేమికానున్నదో? అన్నిటికి నాసర్వేశ్వరుండే యున్నవాఁడు. చేటివచ్చుదనుక నేనీమాధవీలతామంటపముమాటున విశ్రమించెద. (అని నిష్క్రమించుచున్నది.)

దుర్ణయదురోదరము

పంచమాంకము.

రంగము. ఉద్యానవనపురోభాగము.

(దుశ్శాసనుఁడు ప్రవేశించుచున్నాఁడు)

దుశ్శా—“దురోదరరంగంబున మనసౌబలునకుఁ బాండవులోటువడినఁ బాంచాలరాజపుత్రిని నీసభాభవనంబునకుఁ గొనిరమ్మని పంపిన ప్రాతిగామి పోయి యింకను రాఁడయ్యె. ఇంతజాగు సేయఁ గారణమేమియో తెలియకున్నది. నీవు పోయి యామెనతిత్వరితంబుగఁ దోడ్కొనిరమ్మ” అని మాసుయోధనుండు సెలవిచ్చియున్నాఁడు. నేనిప్పుడు ద్రౌపదివిడిదియింటివైపునకరిగి ప్రాతిగామి యేమయ్యెనో వానిసందేశమేమయ్యెనో కనుంగొనివచ్చెద. (అని రెండడుగులునడచి) ఆడఁబోయిన తీర్థమెదురైనయట్లు వీనియాగమనమునకై ప్రతీక్షించుచున్న ప్రాతిగామి యీమార్గముననే వచ్చుచున్నాఁడు.

(ప్రాతిగామి ప్రవేశించుచున్నాఁడు.)

ప్రాతి—దేవా! నమస్కారము. (నమస్కరింపుచున్నాఁడు)

దుశ్శా—నమస్కారములకేమిగాని ద్రౌపదియేది? నీవొంటరిగనే వచ్చుచుంటివే? నీవరిగిన కార్యమేమైనది? ఆద్రౌపది కల్లబొల్లిమాటలకు లోనై పోయినకార్యము పోయినట్టులె చక్కఁబెట్టివచ్చితివా యేమి? నీవేపో మహానిర్వాహకుఁడవని పంపినమాయన్న నవవలయును.

ప్రాతి—స్వామీ! ఆగ్రహముసేయకుఁడు నాపలుకులు పూర్ణముగా నాలింపుఁడు.

దుశ్శా—నీపోయినకార్యమేమైనదో నీమొగమే తెల్పినది. మిగిలినకార్యము నీమాటలంకదా తేరుచును.

ప్రాతి—దేవా! దేవిగారు మిమ్ములనొక్కసారి యంతఃపురమునకు విజయముచేయఁ

డని సెలవిచ్చినారు.

దుశ్శా—ఆఁ. అంతఃపురవర్తమానము దెల్పుటకిదియే సమయమా? ఇప్పుడు నీకు దేవి యెచ్చటకనిపించినది?

ప్రాతి—దేవిగారును ద్రౌపదీదేవియును గలసి యుద్యానవనమున ముచ్చటించుచున్నారు.

దుశ్శా—వారియందఱియెదుటనే నీసందేశము నెరవేర్చితివా?

ప్రాతి—రహస్యప్రవృత్తికాదనుకొని యట్లేయొనరించితిని.

దుశ్శా—ఇప్పుడు వారిద్దఱుంగలసి యాయుద్యానముననే యుండిరా?

ప్రాతి—దేవిగారిప్పుడు నేనివేదించిన వర్తమానముం జెప్పి యంతఃపురమున కరిగిరి. ద్రౌపదీదేవియు నామెచేటియు నేవచ్చుదనుక నుద్యానవనముననేయుండిరి.

దుశ్శా—నీపోయినపని యేమయినది?

ప్రాతి—అయ్యా! ఆమెతోడఁ బ్రసంగించుట కడుదుర్లభము. ప్రభువు వారామెతో నెప్పుడును సంభాషించలేదనుకొందును.

దుశ్శా—అంతటిపుణ్య మీపురుషునకు లభించియుండలేదు ప్రసంగము మాటయటుండ నేనిదివఱకామెను దిన్నఁగఁగన్నెత్తికనియే యెఱుంగను. లెక్కకామెను రెండుతడవలఁజూచితిని.

> ఉ. కంటినిపూర్వమా కలువకంటిస్వయంవర కాలమందు నే
> నంటయొకాని వట్టియుడియాసల నింపినమత్స్యయంత్రముకా
> గంటివడంగనేయ సమకట్టిన నావిఫలప్రయత్నముల్
> రెంటికిఁగూడ దవ్వయినరేవణిఁ జేసెనుమాటలేటికిక్

మహాధ్వరసమయమందు మఱొక్కసారి వీక్షించితినిగాని.

> ఉ. అత్తఱి నేగుదెంచిన మహాజనసంఘము నాదరింపఁగాఁ
> బెత్తనమంచు నాతలను బెట్టిరి పెన్బరువొక్కటిక్ మొగం
> బెత్తఁగనీనిదట్టిమెడ నేమిఁకఁగంటినటంచుఁ దెల్పుదుక్
> బెత్తనగాని కెందునన పేక్షితముల్ సుఖముల్ గనుంగొనక్.

ప్రాతి—స్వామీ! జన్మమనిన నామెతోడఁ బ్రసంగించినదియేజన్మము. ఒక్కసారి మాటాడిన నెట్టిదురాత్ముండైనను మహాత్ముండగును.

దుశ్శా—మాటలనుబట్టి మనుజులవర్తనములు వేర్పఱుపరాదుసుమీ! ఆసందేశమేమైనది?

ప్రాతి—ఆమె సభవారికి నాచే నొక్కసందేశమంపుచున్నయది.

దుశ్శా—ఏమని?

ప్రాతి—ధర్మజుండు మున్ను తన్నోడువడి నన్నోడువడియెనా? నన్నోడువడి తన్నోడువడియెనా? యని.

దుశ్శా—ఈధర్మసందేశమేమిరో నీకర్థమయ్యెనా? ఇంతస్వచ్ఛముగా నీవుదానినెట్లు వల్లింపఁగలిగితివి?

ప్రాతి—అది నాకరవమువలెనున్నది. భటులకార్యము చెప్పినదానిని నెగవేర్చుటయే కదా! ఏలాగుననో చాలఁగష్టించి బ్రాహ్మణవటుండు వేదపాఠమును వచించినటుల కంఠస్థము గావించితి.

దుశ్శా—పైంచినకొలంది నామెకిట్టి ధర్మసందేహములు పెఱుఁగుచు నేయుండును. నీవు వేగముగ మాయన్నకడకేగి యీసమాచారంబంతయును దెల్పుము. నేఁబోయి యామెసందేహంబులన్నియుఁ దీర్చెద. ఇప్పుడామె యెచ్చటనున్నదంటివి?

ప్రాతి—పుష్పోద్యానమున

దుశ్శా—నీవరుగుము. నేనుద్యానవనమునకరిగెదను.

(ఉభయులు నిష్క్రమించుచున్నారు.)

(దుశ్శాసనుఁడుద్యానవనమందు ప్రవేశించుచున్నాఁడు)

దుశ్శా—ఈయుద్యానవనముఁగనిన నామనంబునకనంగవికారముదయించుచున్నది. తత్సందర్శనంబు సంతోషదాయకంబుగదా! అట్లగుట యౌవనపురుషులకు మన్మథవికారోదయంబు కాకుండుటెట్లు? నామనంబున కనుకూలంబుగనే యీయుపవనంబు కరంబామోదకరంబగుచున్నయది. ఆహా! ఏమీ! యీమందమారుత ప్రహారంబు? సకలవనసంచారంబుచేసి యలసటనొంది యీజలాశయంబున జలక్రీడావినోదంబులాడి యూడి నన్నిప్పుడానందపరవశుం జేయుచున్నది. ప్రాతిగామి నాతోడ ద్రౌపది యీయుద్యానవనమున నున్నదనియె. ఈచుట్టుపట్టులనామె జాడ యగపడదే? ఆమె యిప్పుడెటకేగియుండును? ముందుగ నీపుష్పవనమంతయుఁ గలయఁజూచెద. (రెండడుగులు నడచి) ఈమల్లెపందిరికడ నడుగుల జాడ కనఁబడుచున్నది.

చ॥ పదములజాడఁజాడ నొకపద్మనిభాంఘ్రియిటన్ మెలంగి తాఁ
గదలెనెటోయటంచు! బొడకట్టిమనంబున కాసకొల్పు న
మ్మదవతితోఁబ్రసంగము సమంజసవైఖరి సల్పుభాగ్య మ

య్యదిసమకూడెనేఁడనుచు; నాపయిభాగ్యమదెట్టులున్నదో॥

(మరల రెండడుగులునడచి)

ఆహా! ఆపాదమస్తకము నల్లిబిల్లిగ నల్లుకొని కంఠాశ్లేషమొనరించిన తమలపుటాకు తీవంగాంచి దానితోడ సరసంబులాడుచున్నదో యనునట్టులు చిఱుగాలికిఁ దనమట్టలంగదల్చు నీపోఁకచెట్టుఁగనిన నామనోరథప్రాప్తియగునని తోఁచుచున్నది.

లయగ్రాహి—కమ్మనిమరందముల ముమ్మరముగా నెగరఁ జిమ్మెడుప్రసూనములఁ దు
మ్మెదలుద్రావఁగన్,
సమ్మదమునన్ శుకపికమ్ములుఫలమ్ములు దళమ్ములుభుజించి కడుదొమ్మిగనుగూయన్;
అమ్ములను మేటిబలగమ్ములను వాసభవనమ్ముగటచే ననుదినమ్మునుసుఖావా
సమ్మొనరఁగా యువజనమ్ములమనమ్ములరి హుమ్మనుచుఁబుష్పశరుఁడిమ్ముగనియేయన్॥

(మరల రెండడుగులునడచి చెట్లచాటుననుండి యొక స్త్రీవిగ్రహముంగాంచి)

నేనింతవఱకేతలోదరివిషయమునఁ బ్రశంసించుచుంటినో యామనోహరాంగి యామోహనదేవత యాపూఁచప్పరంబుమాటుననున్న చంద్రకాంతశిలావేదికపై నెద్దియో విచారించుచుఁ గూరుచున్నయది. ప్రాతిగామి యామెతోడ నొకపరిచారికయున్నదనియెను. ఆమెయిప్పుడెటకేగియుండును? అదివ్యమంగళవిగ్రహము తప్పక ద్రుపదనందనయే కావచ్చును. (మరల రెండడుగులునడచి) ఈయింతినిగాంచిన నాదేహంబు పులకరించుచున్నయది. నేనిదివఱకెందఱినో సుందరాంగులం గాంచితినిగాని మర్త్యమందయానలయందిట్టి సౌందర్యమును న్నెన్నఁడునుగన్నదియు విన్నదియులేదు. ఇట్టిసుకుమారాకారలయాకారంబుఁ గన్నులారఁ గనుఁగొనుటయేకదా కన్నులున్న ఫలము. ఈకాంతనిశాకాంతుని గాంతియో, కంతునిదంతియో, మరునిచేతిచేమంతి బంతియో యైయుండవలయును గాని కాంతకాదు.

క॥ రతియో? హరిసతియో? భా
రతియో? స్మరహరునిమనసు రంజించిన పా
ర్వతియో? బలశాసను బ్రియ
సతియో? యవతారమెత్తి జనియించెనిటుల్॥

ఆహా? ఏమి యీమెచక్కఁదనము!

చ॥ తమలపుటాకుసొరు వనితామణిమెత్తని మేనితీరు, నే
త్రములమెఱుంగుడాలు వెలిదమ్ములనేలఁగఁజాలు; నింద్రనీ

లములుశిరోజముల్ ; కరతలంబుగులాబిసుమంబు ; మేలుమేల్
రమణిమనోహరావయవ రమ్యతనెన్నఁదరంబె యేరికిన్॥

అసమానరూప లావణ్యాతిశయముల విలసిల్లు నీమె సర్వాంగ సౌందర్యంబువర్ణింప ననుబోటి మనుష్యమాత్రున కెట్లుసాధ్యమగును ?

సీ॥ అనుదినంబుననంకుశాహతినొందుచు మందయానము నేర్చు మదగజంబు,
నిముషమొక్కటిరైన నిలకడఁగనలేక యిలచుట్టుఁదిరిగెడి హిమకరుండు,
కరముసోకినయంతఁ గడువాడివత్తలై పొలుపుదొఱంగెడు పుష్పచయము,
తళతళమనియొక్క తడవరూపముచూపి మింటనంటక పోవు మెఱుపుతీవ
గీ॥ యర్ధదినమైనఁబూయని యబ్జవితతి
పగటిపూటనె గుహదూఱు మృగవిభుండు
భంగమనిశంబునొందు తరంగసమితి
నీమెయంగంబులకు నుపమింపఁదగునె॥

ఆహా ! ఏమి యీమె యవయవసౌష్ఠవంబు !

చ. కలికిమొగంబుఁగాంచఁ గలకన్నులుకన్నులు, భాసురాంగిచె
క్కిళులనహర్నిశంబుఁ దిలకించుచు ముద్దిడుమోముమోము, తో
య్యలియెదనుంచు హస్తములుహస్తములీసుకుమారగాత్రని
శ్చలమతిఁగౌఁగిటంజొనుపు జన్మముజన్మము వేయునేటికిన్.

పంచభక్ష్యపరమాన్నంబులు ముందిడుకొని యూటలనూరుచున్న ఫలమేమి? వానిననుభవించినపుడుకదా యానందింపవలసినది.

మానిని = గేయము.

ఈసఖిగౌఁగిలియందని జీవనమేమిఫలంబిఁక నీయిలపై
నేసుకృతంబులఁజేసిరొ పాండవులీసఖిగూడి సుఖించుటకై
యీసరసీరుహలోచన నేడుమదీప్సితసిద్ధిగఁజేకుఱుచో
నాసురలోకసుఖంబిపుడీ యిహమందుననే సమకూఱుఁగదా॥

సమీపించి యెట్లైన నామెయనుగ్రహమునకుం బాత్రుఁడనయ్యెద. (అని సమీపమున కరుఁగుచున్నాఁడు)

ద్రౌప—(తనలో) గమ్మగమ్మనవలచుచు మన్మథోద్రేక సంధాయకంబులగు పరిమళద్రవ్యముల సుగంధమ్ము మందానిలుండు మోచికొని యెవ్వరోకామవిధురుండగుయౌవనపురుషున కీతండు వార్తాహారియగుచున్నవాఁడు. మాచేటి యనినయట్లు పర

పురుషుండెవ్వండైన నీపుష్పవనంబునం బ్రవేశించియుండఁడుగదా. ఈపరిమళమ్ములంతకంతకుఁ జాలదట్టముగ నలమికొని యొకయౌవనపురుషునిరాక దెల్పుచున్నయవి. (మొగము దుశ్శాసనునివంకఁద్రిప్పి) ఓహో ! గొప్పప్రమాదము సంభవించినదే? (తొట్రుపడుచులేచి) త్రిజగద్వినిందిత దుష్టశాసనుండగు దుశ్శాసనుండే యొంటరిగ నిటకువచ్చుచున్నవాఁడు. నాకిప్పుడేమిచేయుటకుం దోఁచకున్నయది. ఇప్పుడు వీనికంటఁబడకుండఁ దప్పించుకొనుటకు నాకుపాయమేమున్నది? ఈచెట్లమాటునకరిగెద (అని యట్లుచేయుచున్నది.)

దుశ్శా—(కొంచెముదూరమున నిలఁబడి) ఈమె యాకారము మనోవేదనాదోధూయమానంబగుటంజేసి యించుక వికారంబునొందియున్నది.

చ. మొకముకడుందపించి జలముల్ పయిఁ గ్రమ్మినవేళ వాడు పూ
వగపడుమాడ్కిఁ జాలభరమైకననయ్యెడి ఘర్మబిందులన్ ;
నొగిలెను మేనుతానును మనోరమణుల్ కడునీచవృత్తిలోఁ
దగిలితిమన్విచారశిఖితాపమునంగడుఁ గ్రాఁగుచుండుటన్.

(మరల రెండడుగులు నడచుచున్నాఁడు)

ద్రౌప—(తనలో) ఈతండు నావైపునకే వచ్చుచున్నవాఁడు. కడుమదోన్మత్తుండు పరస్త్రీ పరద్రవ్యాపహరణ కార్యంబులీతనికిఁ దృణప్రాయంబులు. ఈతండిప్పుడేతెంచిన కారణంబేమైయుండునో ?

దుశ్శా—(తనలో) ఈమె నేసమీపమునకరుగుటఁగాంచి యాచెట్లమాటున కరుగుచున్నయది. పలుకరించిచూచెదను. (ప్రకాశముగా)

మ॥ వనితా ! నన్నిటఁగాంచి యన్యునిగ సంభావించితే చెట్లమా
టునడాగం జనసూహసేసితివి, యట్లుల్ సేయనేనీ మఱిం
దిని దుస్సాసననామధేయుఁడనుగానే ? యెవ్వరంచెంచితో
ననుమీవానిఁబరాయివానిగఁగనన్ ధర్మంబుగానున్నదే॥

ద్రౌప—(తనలో) ఈతండత్యంతాప్తునివలె ననుసమీపించి యెంతోవినయముగ మాటలాడవచ్చుచున్నాఁడు. వీనిహృదయంబేమియో యెఱుంగకున్నాను. ఈతండు పరాయివాఁడుగాఁడట. వీనింగాంచియేఁ దొలంగనక్కఱయేలేదట. కపటోపాయమ్ముల, మ్ముల ననేకమార్గమ్ముల బాధించు వీరు పరాయివారుకాకుండుటెట్లు ?

దుశ్శా—ద్రుపదనందనా !

మ॥ చెలులెవ్వారునులేక యొంటరిగ ప్రస్వేదాంకురశ్రేణిమై

కలయం గ్రమ్మ నివర్ణ్యమై యెడల శృంగారంబు తూలంగఁ దో
య్యాలి! చింతాక్రమితాత్మవై మెలఁగ నేలా? కమ్ము కొం పోదు మ
జ్జ్వలితాంతఃపురకామినీ జన విలాసక్రీడమై నుండఁగన్॥

ద్రౌప—(తనలో) అన్నా! యిది వఱకే సంతాపంబునొందుచున్న నామనంబు నకీతండు సందిగ్ధముగ మాటలాడి మఱింత వేదనఁదెచ్చి పెట్టుచున్నాఁడు. వీని హృదయం బెఱుంగు టెట్లు? (ఓయీయని పిలువఁబోయి) హా! యీతనితోడ నే నెట్లు మాటలాడ స్వతంత్రించెదను? నేనెన్నఁడును బరపురుషుని యెదురఁ బన్నెత్తి యెఱుంగను. నాకిప్పుడేమి చేయుటకును దోఁచకున్నది. అయ్యో! ఇప్పుడు మా చేటియయిన నిచ్చట లేక పోయెనే? వట్టి జేల్లనె యామె సాయము నేల విడిచితిని? ఈతండు నేనిందొంటరిగనుంటినను దురుద్దేశముతోనే వచ్చినాఁ డేమి? మా చేటినొక్క సారి పిలిచి చూచెదను. ఆమె దాపుననున్న దనుకొనియెదన వెనుకకుం బోవునేమో? (ప్రకాశముగా) ఓలవంగికా!

దుశ్శా—(తనలో) ఆహా! ఏమీ యీ చిలుకపలుకులకు కంఠమునకు. (ఇంచుక యోజించి) "ఓలవంగికా" యనుచున్నది. చేటినొకదానినుండె నాయేమి? ఓకారంబు దూరాహ్వానంబుఁ దెల్పుచున్న యది. చెంతనుండినన్ట్లేల పిలుచు?

చ॥ కలికి కలస్వనంబు కలకంఠములం బలు గాకులంచు నా
కలముల మేయుమంచు నియతావసరంబులఁ గూయుమంచు నా
ఙ్ఞల వెలయించు, వీణెలఁ బసం గొనగొట్టు నెపంబు, షట్పదం
బులవనవాసవృత్తిగనఁ బొమ్మను ప్రతిమానమాధురిన్॥

ద్రౌప—(తనలో) సంశయాకులమనస్కుండై యున్న చోటనే యున్నవాఁడు. నేననుకొనినయట్లు లీతం డెద్దియో దుర్వృత్తితోడనే వచ్చియున్నట్టు కన్పట్టుచున్నది. లేకున్న నాతనికింత సంశయంబుతోడ నవసరంబు లేదు. ఒంటరిగనుండి పరపురుషునితోడ నెట్లు పలుక సాహసింతును? పలుకకుండిన నీతని బారినుండి తప్పించుకొనుట యెట్లు?

దుశ్శా—(తనలో) ఈమె పరధ్యానముగ నున్నటులగపడుచున్నదే. నేననినమాట లీమె చెవింబడినవో లేవో?

మ. చెలులెవార్వును లేక (అను పూర్వోక్త పద్యమును మరలఁ జదువుచున్నాఁడు)

ద్రౌప—(తనలో) ఈతండిప్పుడు కామవికారంబునకు లోనై పల్కుచున్నవాఁడా? నాదాసీత్వమునుద్దేశించి పల్కుచున్నవాఁడా? ఈతని హృదయమే మైయుండు

ను? (ప్రకాశముగా) నీవు నన్నిటులేల పరిహసించెదవు? నేను నిజముగ మీకూడిగమే చేయవలసివచ్చినచో మీయంతఃపురమన నేల మీరెచ్చట నియోగించిన నచ్చటనే చేయవలయును.

దుశ్శా—నాయంతఃపురమునందున్న నీకే నా చెలులచే నూడిగంబుఁ జేయించెదను. నేనిటకు వచ్చుట నిన్నుఁ బరిహసించుటకై కాదు. నీయనుగ్రహ సంపాదనమునకే.

ద్రౌప—ఉన్న యైశ్వర్యంబు సమస్తంబు నోడిచికొని యదిచాలక సంతతధర్మనిరతులగు నాపతులు దాసులుగా నుండ శపథంబుఁ జేయించుకొని వెలలేని సంపదలతో విఱ్ఱవీఁగు మీకు మాయనుగ్రహమున నేపాటిది?

దుశ్శా—సంపదలవలని ఫలము సౌఖ్యమనుభవించుట కదా! మనస్సంతోషమొసంగలేని యీ సంపదలవలనఁ బ్రయోజనమేమి?

ద్రౌప—మలినవర్తనులకు మనస్సంతోష మేమూలనుండి వచ్చును? కేవల కపటప్రకార నిపుణులకు మానసానందము స్వప్న వార్తయే.

దుశ్శా—అయ్యది భవత్కటాక్షవీక్షణమునం గాని యలభ్యంబని నీకు దోసిలొగ్గితిని. ప్రసన్నముఖి విగమ్ము.

గీ. ఎన్ని మాయలు సేసి యెన్నెన్ని గతుల
నెంత ధనముగడించిన నేమి ఫలము?
చాన! నీ మోవి తేనియలానకున్నఁ
బరిమళము లేక పూయు పుష్పములు గావె॥

ద్రౌప—(తనలో) వీఁడు కేవల మన్మథ వ్యాపారపరత్వంబుననే మాటలాడుచున్నవాఁడు. వీనినిందుండి మరల్చు నుపాయం బెద్ది? ప్రపంచమున సుందరాంగులై యుద్భవించుటయుఁ బూర్వజన్మప్రారబ్ధంబె. ఆసుందరశరీరమే లేకున్న వీని కిట్టి యున్మాద ముద్భవింప నేరదు కదా! (సవితర్కముగా) ఇది మిగుల వెఱ్ఱియా హా అన్యస్త్రీలోలురందఱును సౌందర్యపరిగణనచే మోహోన్మత్తులగుచుండిరా? స్వస్త్రీలెంతటి చక్కనివారైనను గురూపలగు నన్యయువతులఁ బ్రేమించి వారికి దాసులై స్వీయల మొగమైనఁ జూడకుందురు. (ప్రకాశముగా) ఓయీ! కామాతుండవై వరుస వావు లెఱుంగక పరస్త్రీల నాసించుట నీకుఁ దగదు.

దుశ్శా—సఖీ! వావివర్తన లెఱుంగకుండ వర్తించుటలో నీయన్న కృష్ణుని మించినవారెవ్వరు?

ద్రౌప—గుణగ్రహణత్వమెఱుంగక కృష్ణునకే లోపము లెన్నుచుంటివిగా! ఆవల్ల వీప

ల్లవాధరలందఱును మున్ను శ్రీరామావతారంబున నాతనిగాఢాలింగన మభిల షించిన తాపససముదాయంబనియు, నాతండు సాక్షాద్విష్ణుస్వరూపుండనియుఁ దెలియనేరక బాహ్యప్రవర్తనల నేలపరిగణించెదవు?

దుశ్శా—తమవారిలోపములుతాము బయటఁబెట్టువారెవ్వరుందురు?

ద్రౌప—ఓయీ! నీవెత్తినజన్మంబును, తన్నిర్ణీతధర్మంబులును మఱచి యిట్లుసంభాషించుట యేటిధర్మము?

దుశ్శా—నేనెత్తినది మానుషజన్మము. తద్ధర్మంబు సకలసౌఖ్యసాధనంబగు ధనంబు సేకరించుట.

క. జననంబెత్తినఫలమిల
నను దినసౌఖ్యంబుఁగనుట, యాసుఖమునకుఁ
ధనమే కారణమగుటఁ
ధనమూల మిదంజగత్తనం బడువినవే॥

అట్టిధనం బిప్పుడపారంబుగ మాయింట మారుబలుకుచున్నది. నీప్రాణేశ్వరులందఱు నేతన్మూలమున నేకదా సమస్తసౌఖ్యంబులకు వెలియైయున్నవారు. అట్టివారికడ నీకుఁగలుగు సౌఖ్యమేముండును? చిన్నప్పటినుండియు ధనికులయిండ్లనె పుట్టి పెరిఁగి ధనికులయిండ్లనెచేరి యతిసుకుమారంబుగఁ బెరిఁగినదానవు. నీవు పేదతనపుఁ బ్రభావం బెఱుంగవు. చూడు!

చ. పరువుప్రతిష్ఠలన్నియును బాయును, స్వోదరపూరణార్థమై
తఱచగుయోచనల్, సఖులుదగ్గరరారు, పరిత్యజింత్రుసో
దరులును జుట్టపక్కములు, తల్లియుఁదండ్రిసతంబుఁ దిట్టుచుం
దురు, ప్రియులాదరంబుడుగుదుర్ భువిపేదరికంబుకల్గినన్॥

అదియునుగాక నీపతులు నీకుఁ గడుప్రియులని మురియుచున్న దానవు. వారికి నీయందట్టి ప్రేమమున్న యెడల వారునిన్ను పరుల కేలయోడిపోయెదరు? లేనిపోని వెఱ్ఱిమోహము పెట్టికొని కరతలామలకంబుగనయాచితలభ్యంబైన సౌఖ్యమువిడనాడక ధార్తరాష్ట్రులచెట్టఁబట్టి సుఖంబుఁగనుము.

ద్రౌప—(చెవులుమూసికొని) హరిహరీ! ఎంతటి చెడుగులాడుచుంటివిరా? పాపము శమించుగాక!

మానిని — గేయము.

ఎందులకీగతి నిందలనొందెద వేమిదురంతమురాతులువా

మందమతీచెలులందఱఁదల్లుల మాదిరిజూడవలెంగదరా
యెందఱుపాపమునీక్రియ జేసిహరించిరిపలుకుయమొందిరొకో
డెందమునందలపోసియొకింత నటింపఁదలంపవొధారుణిపై

జన్మఫలంబులును, జననోద్దేశ్యంబులును, నీయొద్ద నుపదేశమునొందవలయును. బాహ్యసౌఖ్యమే సౌఖ్యమనుకొని యంతరాత్మనడఁగఁద్రొక్కి చతుష్పాత్తువలె సంచరించు నీకీజన్మబంధవిమోచనమెట్లు? భగవత్ప్రసాదితంబగు జ్ఞానబీజంబు నీహృదయంబునఁ బొట్లిపోయినదే! అయ్యది యూషరక్షేత్రంబు. అందేల మొలకెత్తును?

దుశ్శా—విషయసుఖంబులెఱిఁగి సంప్రాప్త సముపభోగరతత్వంబునఁ బ్రవర్తించుట జ్ఞానికిలక్షణంబు. అట్టిభోగంబు సంప్రాప్తమగు నవసరంబున ననుభవింపక ప్రపంచజ్ఞానశూన్యులై పరలోకము పరలోకమను లేనిపోని శంకయొకటిపెట్టుకొని చేతిలోనున్న తేనెను విడిచి మోచేతిని నాకుచుందుని చందంబున వట్టియడియాసపడనేల? పరలోకము పరలోకమని పదిమారులనుకొనిన ఫలమేమి? పరలోకమున్నదో లేదో యెవ్వరుచూచినారు? ఒకవేళనున్నదియేయని యెన్నినను, ఇప్పుడీ క్రూరుండగు మారుండు బెట్టు హాలాహలికన్న నెక్కుడుబాధ కలుగనేరదు. వేయేల? నన్ను పాలముంచినను నీటముంచినను నీదేభారము.

ఉ. మానవతీమణిచలముమానవె, నీమధురాధరామృతం
బానఁగనీయవే, ననుఁగృతార్థునిజేయవె, గేలిబాయవే
కానవె సుంతకన్నెఱచి కాయజుసాయకపీడితాత్ముఁడన్
నానదొఱంగివేఁడవిడనాడఁగన్యాయమె జీవితేశ్వరీ॥

ద్రౌప—ఓరీ! పాపకర్ముఁడా! జీవితేశ్వరీ యనుచుంటివేమిరా? ఇట్టిపరుషములుబలుకు నీనాలుక వేయిచిలుకలుగావలయు. సంపన్మదోన్మత్తుండవై మన్నుమిన్నుగానక నోటవచింపరాని కాఱులఱచుచున్నాఁడవు. శాంతస్వాంతలగు మానవతుల చిత్తంబులు శిఖిముఖిశిలలవంటివి. నిశ్చలనమగునంతవఱకుఁ జల్లఁదనమునే కనపఱచునుగాని యొఱపు డెక్కువయగునేని యందగ్ని యుదయించి లోకమంతయు నుదహించును.

దుశ్శా—సుందరాంగీ! కామార్తుండు స్త్రీలచిత్తానువృత్తినెఱింగి ప్రవర్తింపవలయుఁగాని వేసరి నిరాశచెందరాదు. మున్నహల్యాతారాది సుందరులు నీవలెవట్టిచేలలై లభించినసౌఖ్యమును వదలుకొనిరా?

ద్రౌప—(తనలో) వీనితో నెంతసేపుమాటలాడుచుండినను మాచేటి యింకనురాకున్న

యది. వీనికికొంచము నీతిబోధచేసి కాలక్షేపము సేయుచుండును. (ప్రకాశముగా) అహల్యాదివస్త్రులువడిన భంగపాటును తారాచంద్రులొందిన పరాభవంబును ఎఱింగియు నిట్టిదురాగతంబుల కేలపాల్పడెదవు? మున్ను వేదవతిం బలిమింబట్టి శాపోపహతుండై పుత్రమిత్రకళత్రాదులతోడంగూలిన దశకంధరు నవస్థందలంచికొని కులనాశనకారకుండవుకాంబోకుము. ఈపాటికిట్టి తలంపులుగట్టిపెట్టి పరసతులెల్ల తల్లులుగ సంభావింపుము. యముండు నిర్దయుండుసుమా? ఈయచిరంబునకేమి గాని యావలనదిచూచుకొనుము.

దుశ్శా—యుగముల్కిందటజరిగిన వృత్తాంతము మనకేల? ఇప్పటిమనకాలపువారిలో, విశేషించి మనస్వకుటుంబమున, పూతచరిత్రులను గౌరవమునువడయు నీపతులయుత్పత్తికి మూలకారణమేమియో యోజించుకొనుము. వారియాచరణంబులు నీకేలయును సరణీయంబులు గాకుండును?

ద్రౌప—తలిదండ్రులకుం దప్పులెన్ను మహాపాతకివి. నీవేమిచేయుటకు వెనుదీయుదువు?

దుశ్శా—ప్రియసఖీ! యుక్తాయుక్త విచారణము సేయనేమి? యెవరిని భూషింపవలయునో యెవరిని దూషింపవలయునో యెఱుంగకున్నావుసుమా.

ద్రౌప—దురాగతములకుం బాలగు నరాధముల దూషింపవలయును. మాయెడల ననేక దుష్కృతంబులొనరించుటం జేసి నీవు నిందాపాత్రుండవైతివి.

దుశ్శా—కర్తవలెం దత్కారకులుగూడ నిందాపాత్రులుగారా?

ద్రౌప—మీయన్న కారకుండును. నీవుకర్తవును.

దుశ్శా—మాయన్న గాదు కారకుండు. నీసౌందర్యమే యీఘోరకృత్యంబులకన్నింటికిని గారణము.

ద్రౌప—నాసౌందర్యమే నాపతుల సేవకావృత్తికిం గారణమైన దుష్టమైన యీసౌందర్యమును నానఖశిఖరములచే రూపుమాపం బ్రయత్నించెదను.

దుశ్శా—సఖీ! నీవట్టిదుండగములకు సాహసింపందగదుసుమీ! ఏమన?

చ. సవితృకరప్రసారమున షష్మరుహముల్ విలసిల్లువైఖరిన్
ప్రవిమలవాయువుల్ మెసవిపాములు జీవమునిల్పునట్లుగా
నవిరళచంద్రికాస్ఫురణ నారయంబంటలు బండుమాదిరిన్
భవదసమానరూపమునం బ్రాణములన్నియు నిల్పుచుండెదన్॥

ద్రౌప—అట్లయిన భవత్ప్రాణాపహరణోపాయంబున కదియనుకూలంబుగ నేయుదున్నది.

దుశ్శా—అది ప్రపంచవ్యతిరేకమైన విరోధమగును.

ద్రౌప—మాకునిరంతరము నపకారములే తలంచు మిమ్ములనిందించినం బ్రపంచవ్యతిరేక విరోధంబెట్లగును?

దుశ్శా—ఎఱుంగనేరవైతివిగాని దానికంతకుం బరోపకార పారీణతయే కారణము.

ద్రౌప—మీయింటనొంటనులేని పరోపకార పారీణతయను శబ్దోచ్చారణ నీవెచ్చటనుండి నేర్చుకొంటివి?

దుశ్శా—నీయట్టి యొప్పులకుప్పల యొవ్వలే మాకఖిలనీతుల నుపదేశించును.

ద్రౌప—చిలుకకుం గఱపినపలుకులు పునశ్చరణసేయునేగాని వానిప్రయోజనం బదియెట్లు గ్రహింపసమర్థంబగును?

దుశ్శా—గురువులు శిష్యులెంతవిద్యావంతులైనను వారలలోపములంగూర్చి మందలింతురుగాని వారివిద్యల నుగ్గడింతురా?

ద్రౌప—మందబుద్ధులకడ మందలింపు లేమిపనిచేయును?

దుశ్శా—కృతఘ్నులగు పతులంబోనాడి కృతజ్ఞులగు పతులసంపాదింప మార్గప్రదర్శకులమైన మాబుద్ధిమాంద్యత నీకుందప్పక పరిహాసాస్పదమే.

ద్రౌప—(ఆశ్చర్యముతో) పాండవులకంటెను కృతజ్ఞులెవ్వరు?

దుశ్శా—నీయెదుటంగానిపించు నీసుందరతరాకారుండుగాక మఱెవ్వరు?

ద్రౌప—(ఉమియుట నభినయించుచున్నది)

దుశ్శా—సఖీ! నాపైనేల యుమిసెదవు?

ద్రౌప—అది నీపట్ల విషమగునని యెంచి యట్లుచేసితిని.

దుశ్శా—అమృతరాశియగు పెదవులనుండి యమృతమే యుద్భవించునుగాని విషమెట్లుద్భవించును? అట్లగుటనే నీయనుగ్రహంబువలన మర్త్యత్వంబువిడిచి యమర్త్యుండనగుదును.

ద్రౌప—ఈపట్టున నీయొడలి కావరము నాపతులుజూచిన తప్పక నీవమర్త్యలోకంబునకే యరుగుదువు.

దుశ్శా—నవ్వుటాలకు నీవట్లుందువుగాని నీవారి బలాబలంబులు నీవెఱుంగనివియా?

ద్రౌప—ఓరీ! నీచుండా! నీవంటిపాపిష్ఠి మొగంబుచూచిన యంటువ్యాధివలె నాకును బాపము సంభవించును.

దుశ్శా—మేలు! సఖీ! మేలు! నీవనినది బాగున్నది. నీదృష్టివిశిఖములు నాపైన్

బలిపి మాటలచేఁ గాలముగడపుచుండుటచే నాకంతకంతకుఁ గంతుసంతాప మధిక మగుచున్నది. అందువలన నీకుఁదప్పక పాపమేసంభవించును.

ద్రౌప—ఓరీ! దుర్మార్గుఁడా! నేనుదిట్టినవన్నియునుదీవెనలుగదు, నాదూషణములన్నియు భూషణములుగను నెంచుకొని నీలోనీవే సమాధానపడుచుంటివి? ఇట్టిపలుగాకులతోఁ బలుకఁబొల్పడిన లోపము నాదియే.

దుశ్శా—ఇటుల మాటలతోడనే జాగుసేయుటవలన నాకనంగ వికారంబెక్కువయగుచున్నది. ఒక్కసారి నీబాహుపరిరంభణంబొసంగినఁగాని తాళఁజాల. (అని సమీపమున కరుగఁబోవుచున్నాఁడు)

ద్రౌప—ఓరీ! నేనురజస్వలను. నన్ను సమీపింపఁదగదు. (వెనుక వెనుక కరుగుచున్నది)

దుశ్శా—“పణ్యస్త్రీషు పరస్త్రీషు పుష్పదోషోనవిద్యతే” యను శాస్త్రప్రమాణమే యున్నది. అందువలన నన్నిప్పుడీదోషము బాధింపనేరదు.

ద్రౌప—సమయాసమయము లెఱుంగక దుండగములొనరింపఁ బాలుపడు నిట్టిమగనితో నాచారుమతి యెట్లువేగుచున్నదిరా? ఛీ! దుర్మార్గుఁడా! ఇంకనీయెదుట నుండ రాదు. (అని చెట్లచాటున కరుగుచున్నది)

దుశ్శా—ఓహో! మాయచేసి పోవుచున్నదే! (అలుకుసదువిని వెనుకకుఁదిరిగిచూచి) అయ్యో! ఎవరోవచ్చుచున్నట్టులున్నది (అని నిలఁబడిచూచుచున్నాఁడు)

(చారుమతి ప్రవేశించుచున్నది)

చారు—(తనలో) ఏమిది! ఆర్యపుత్త్రుఁడిందు నేననుకొనినయట్లులిచ్చట నేయున్నవాఁడే! (ఇంచుకయోజించి) ఈతండిప్పుడిట కేలవచ్చియుండును?——ప్రాతిగామి నాయుద్దేశముం దెల్పియుండునా? అతండట్టులేల తెల్పకుండును? తెల్పిన నాయుద్దేశముగాదని యీతండిట కేలవచ్చె? ఈసంగతియేమిగా యిటనుండి కనుఁగొనియెదను. అతండేమియో యీమెతోడఁ బ్రసంగించుచున్నవాఁడు. ఆమె ప్రశాంతచిత్త. వేగనేఁబోయి వారికట్టిప్రసంగము జరుగకముందె నాభర్త సంతఃపురమునకుఁ గొనిపోయెద. (ముందునకుఁజూచి) నేవచ్చిన సడియెఱింగెనాయేమి? నావైపునకే వచ్చుచున్నవాఁడు. నేనిచ్చటనే యాయానమర్మంబుల నరయుదానివలె నుండెదను.

దుశ్శా—(పరికించిచూచి) ఓహో! ప్రమాదము సంభవించినది. మాదేవియే యిటు వచ్చినది. విఘ్నేశ్వరుని పెండ్లికి వేయివిఘ్నములన్నట్లు పానకములోని పుడ

కవలె సమయమున కిదియేమి యీమెయడ్డమువచ్చినది? నాకన్నియు నాటంకములే. ఇప్పటికీమె మనస్సు నాకనుకూలించునట్లులేదు. ఈమె చేటితోడఁ గొంతపరిచయముచేసుకొని, తదభిసారికామూలమున సఫలప్రయత్నుండనయ్యెద. ఇప్పుడీమె కెదురుగఁబోయి నేనామెతోఁ బ్రసంగించనివానివలెఁ గనఁబడెదను. ఆమె పాణిద్వారమున వచ్చుచున్నదికదా! నేనిప్పుడెదురైన బహిర్ద్వారమునుండి యీమెకై యీమార్గమున వచ్చుచున్నవాఁడనని యనుకొనును. (అని యెదురుగఁబోవుచున్నాఁడు)

చారు—(సమీపించి) నాథా! ఏమింత? తొందరగా వచ్చుచున్నారు?

దుశ్శా—ప్రాతిగామి సమాచారమునందుకొని నీవిచ్చటనుందువనుకొని యీమార్గమున వచ్చితిని. దానికేమిగాని.

గీ. లలితలావణ్య సదనమై వెలయుచుండు
నీదుముఖసౌకుమార్యంబు నేఁడిదేమి
విన్ననైతోఁచుచున్నది చెన్నుఁదరిగి
కారణంబేమి తెల్పుమా కమలనయన॥

సకలశత్రుభయంకర ప్రచండశాసనుండగు దుశ్శాసనునికిఁ బట్టంపురాణివైన నీవిట్లు విషణ్ణవదనవై యుండనేల?

చారు—(మొగమువంచికొని)

గీ: అన్యకాంతా జనాసక్తులైనయట్టి
పతులుగల్గినసతులకు వెతలుగాక
యేటిమోదంబు సౌఖ్యంబదేటిదింకఁ
గారణంబేమియని చెప్పఁగలుగుదాన॥

దుశ్శా—(తనలో) ఈమె, నేఁద్రౌపదితో ముచ్చటించుట చూచియుండును: లేకున్న నిట్లేలపలుకును? (ప్రకాశముగ) దేవీ! ద్రౌపదీ ప్రసంగము బహురసవంతమని విని యీమెతో ముచ్చటాడవచ్చితిని.

చారు—(తనలో) ఈతండేమి ముచ్చటించెనో కనుఁగొనవలయును. దొంగవానిమనసుఁ గనిపెట్టుట బహుసులభముగదా [ఈతనితో నేనెఱింగిన దానివలె మాటలాడెదను. (ప్రకాశముగా) మీశృంగార సంభాషణలును, మీకామెయొసంగిన దిక్కప్పపు రస్కారోత్తరంబులును గూడ వినియేయుంటిని. పురుషుల కన్యస్త్రీ తిరస్కారంబులు సత్కారంబులుగనే యుండును. అయ్యవి యొరులతోఁ జె

ప్పకొనరుగదా!

దుశ్శా—ఆమె మనం బేపాటి దృఢంబైనదియో యని ప్రయోగించి చూచితిని.

చారు—ఆరు నెలలు పయోగించిన మృదంగమోటుదియో గట్టిదియో గనుఁగొనఁగోరినట్లు నిరంతరము నా మహాసాధ్వి ప్రభావము చవిచూచుచున్న మీకా యామె మహత్వం బిప్పుడు మరల గనుఁగొననేల మనసయ్యెను?

దుశ్శా—బహుపతిత్వము నవలంబించిన యామెయందు సాధ్వీశబ్దమెట్లు సార్థక్యము నొందును?

చారు—సర్వము నెఱింగి యిట్టిశంకలు సేయ మీకు నే నేమని విన్నవింపఁగలను? స్వయంవర సమయంబున నేకపతికరగృహీతయయ్యును కుంతీనియోగంబున నామె కట్టి బహుభర్తృసమాగమంబు సంప్రాప్తం బయ్యెనని మీ రెఱుంగరా? కారణజన్ములగు వారి ప్రభావంబు వాచామగోచరంబు.

దుశ్శా—ఆమె యెట్టిదైన మనకేమి? ఆమెయును ఆమె పతు లైదుగురును వారి సర్వస్వమును మన యధీనం బైనది. ఇంక మన సేవకులచేత మన మేపనియైనఁ జేయించుకొన వచ్చును.

చారు—ఏతద్విషయిక సమాచారం బంతయు నే నింతకుమున్న ప్రాతిగామిచే నాకర్ణించియుంటిని. వారికి కారణం బజరిగిన యీ యపకృతి మనకేమి యాపదఁ దెచ్చునో యను భయముచే మిమ్ముల రావించితిని. పాండవులతోడి ద్యూతవిద్యావినోదం బేటి వ్యాసంగము?

దుశ్శా—అయ్యది పెద్దల యధీనంబుగదా! అందు మన సంబంధ మేమున్నది? రాజకార్యనిర్వాహణమన్న గారి యధీనంబగుట మన మాయన చెప్పిన చొప్పునఁ బ్రవర్తించుట మన కృత్యంబు ఎవ్వరెట్లు పోయిన మనకేమి? అందుగల కష్టనిష్ఠురంబులును పుణ్యపాపంబులును వారే యనుభవింతురు.

చారు—మీ సోదరునకు మీరు పరిచర్య సేయుట కర్తవ్యమేయైనను ధర్మబాహ్యకృత్యముల మీ కాయన నియోగించుటయు, నేతన్మూలమున మీ రపవాదము వడుటయుఁ గేవలలోకవిరుద్ధము. వానలుగురిసిన వాతలుమానునా?

దుశ్శా—ఆజ్ఞోల్లంఘనంబు స్వామిద్రోహంబు. అందుగల పాపపుణ్యంబులు తత్కారకులం జెందుగాని మనకంటనేరవు. మన సంచారము కుమ్మరపురుగు మాదిరిగదా!

చారు—నాథా! సిరిసంపద లొక్కచోటయుండుటరుదు. ఒకవేళయున్నను లోకైకసామ్రాజ్యపదత్వమునొందుట చాలదుర్లభము. కౌరవసంపద యిప్పటి

డత్యుచ్ఛదశ ననుభవింపుచున్నది. మనమిప్పుడు కొంత గోరంతయును లేక భుజించుటకుఁ బంచభక్ష్యపరమాన్నంబులును శయనించుటకు హంసతూలికాతల్పంబులనుగలిగి యత్యానందంబున నోలలాడుచున్నారము. అత్యుచ్ఛస్థానము చాలనపాయకరము. ఆరముగ్గినపండును వృక్షమున నాపుట చాలఁగష్టముకదా!

దుశ్శా—నీవట్టిభయ మిసుమంతయును బొందకుము: పాండవులమించు ప్రతివీరు లిప్పటి రాజచక్రంబునఁ గనఁబడరు. వారిప్పుడు మాయనుజ్ఞఁ గైకొనక పెదవి మెదపరాదు. భీమాదులు బాహుగర్వంబునఁ నెంత మిట్టిపడినను ధర్మైకనిలయుండగు ధర్మతనూజుండు వారల నోరెత్తనీయఁడు. ఒకవేళ వారట్టి ధర్మబాహ్యమొనర్తురనుము. మా బలంబున వారిముగంటిమికిఁ దీసిపోవువారెవ్వరు?

చారు—మీమీ బాహుబలంబులును మీమీ పరాక్రమాటోపంబులు నంతటివేయగును. కాని, సాధువాక్యంబులు బ్రహ్మాస్త్రతుల్యంబులు. ఎవరి నోటిమాట యెట్టిదియో?

దుశ్శా—సఖీ! మంత్రములకుఁ జింతకాయలు రాలునా?

చారు—పతివ్రతల పల్కులమోఘంబులు నిఖిలజనాంతకుండగు కృతాంతుని వశంవదుని జేసికొనిన పూతచరిత్ర సావిత్రిని, అఖండప్రతాప ప్రచండుండగు హుతవహుని శీతలాకృతుని జేసిన శుభమతి చంద్రమతినిం దలంచిన పతివ్రతాప్రభావంబులు విశదంబగును. ద్రౌపదియందును నట్టి సాత్వికవర్తనంబు కలదందురు.

దుశ్శా—సఖీ! ద్రౌపది నిప్పుడీవొక మహాదేవతగా నెంచుచున్నావు. నీ వామెతోడఁగలసి యించుక సేపీ యుద్యానమున విహరించితివి కాఁబోలును. ఆమెకడ సమ్మోహనవిద్యయున్నది. ఆమె వంకఁ దదేకధ్యానముగా నుపలక్షించిన భూతవైద్యుండు గ్రహములబల్కించినటుల ఆమె వారిని దనయిచ్ఛానువర్తులం జేసికొను ను. నిన్నననేల? ఒక్కనిముసము నిలఁబడి నేనే యామె బోధనలకు లోనైతిని

చారు—మీ రేమన్ననుసరే. మీరీదినమున సభాభవనమున ద్రౌపదియుండఁగా నటకేగకుఁడు.

దుశ్శా—నీ కిట్టి భయమేల? నే నామెకేమియు నపకారము పూనలేదని యిదివఱకే చెప్పితిని. ఆమె ప్రసక్తి మనకేల?

చారు—ప్రాణేశ్వరా! మీరిప్పుడనినది యిప్పుడే మఱతురు. మీరచ్చటికేగిన నెవ్వరైన వచ్చి మీ యంతటివారు లేరనిన, నుప్పొంగి, యావీరావేశముచేఁ జేయుమన్నది యెల్ల నేయుదురు. మీ రంతఃపురమునకు విజయము చేయుఁడు. అచ్చట ప్రా

ద్దులుపుత్త్రము నాకీమాత్రము చనవిండు. (అని కౌఁగిలించుకొనుచున్నది)

దుశ్శా—(స్పర్శసుఖమునభినయించుచు తనలో) ఈమెతోడ నేనంతఃపురంబునకరిగి యీమెనూరార్చి యిప్పుడేమరలివచ్చెద. ఈమెమనస్సు మిగులనొగిలియున్నది. ద్రౌపదిహృదయమెఱుంగ నామెచేటితోడ ముచ్చటించి మఱిపోయెద (ప్రకాశముగా) దేవీ! నీయిచ్ఛానుసారంబుగఁ బ్రవర్తించుటకు నాకు సందేహమేమియుండును? నానిమిత్తమెవ్వరైనవచ్చిన నేనీదినమున నించుక యస్వస్థతగానుంటిననియెద. మనమంతఃపురమునకుఁ బోవుదముపద. అదుగో! ద్రౌపదిపరిచారికయిటులేవచ్చుచున్నదే. ఓసీ! (దగ్గరకుబోయి యేమేమియో చెవులో చెప్పుచున్నాఁడు)

(చారుమతీ దుశ్శాసనులు నిష్క్రమించుచున్నారు).

చేటి—అన్నా! ఏమి! వీనిపోతరము? ఈసంగతి పాండవులతోఁ దెల్పి వీనిపనిబట్టించెద. ప్రభువులేమిచెప్పిన నూకొనవలయునుగాని యిదితగదనిచెప్పుట నాబోటిదానికి ధర్మముగాదు. ఇప్పుడు మాద్రౌపది యొంటరిగానుండును. నేఁబోయి నాసందేశమంతయు నామెతో నివేదించి యామెను వెంటబెట్టుకొని మావిడిదియింటికరిగెదను.

(అని నిష్క్రమించుచున్నది.)

దుర్ణయదురోదరము.

షష్టాంకము.

రంగము ఏకాంతమందిరము.

(దుర్యోధన కర్ణశకునులు ప్రవేశించుచున్నారు)

దుర్యో—ఇంక నొక్కసంశయముమాత్రము మనంబును బాధించుచున్నది.

కర్ణ—ఓయీ! నీకింకను విచారమేటికి?

దుర్యో—అంగరాజా! మనయుద్యమంపు మూలకారణంబు నీవెఱుంగనిదిలేదు. అందు ప్రథమభాగము సుబలనందనానుగ్రహమున సంపూర్ణమైనది. తదనంతరభాగమెట్లు ముగిసెడినోయని తల్లడపడుచున్నవాఁడ.

కర్ణ—ఉ. పాండవులెల్ల నేఁడువలబడ్డ సివంగులమాడ్కిదాసులై
యుండిరినీకు, తద్వనితయుం బరిచారికయయ్యెనేకదా!
యొండిఁక నేమికావలెసుయోధన! ద్రోవదినింక నీదుత
మ్ముండిటుతోడితేరఁ బరిపూర్ణమనోరథ సిద్ధియయ్యెడుం॥

దుర్యో—ద్రౌపది పరిచారికయయినంతమాత్రమున మనకుఁగల ఫలితమేమి? మనకుఁ బరిచారికలెందఱున్నవారుకారు. సభాసందర్శనకాలంబునఁ గేళికాసరోవరంబు నిర్జలప్రదేశంబనుకొనిననాటి, యామెపరిహాసమును, ఆమాట జవదాటక తత్పతులొనర్చిన యగౌరవంబును, మఱతుమన్నను మఱపురాకున్నవి. దానినిమరల్చిన నాకదియెపదివేలు. ఈమెదాస్యమేరికి కావలెను,

కర్ణ—అందులకిదియె యదనుగదా! ఇప్పుడామె నీకు బానిసయైయున్నది. నీవేమియొనర్చుమన్న నది యెల్ల శిరసావహింపవలెను.

శకు—ఆమెయొనర్చుటయందేమి లోపముండును,

చ, పతియగునాత డెంతటియభాగ్య శిరోమణియైన శక్తివం

చితుఁడగు నాతఁడైనఁ, దనచేతకుమించిన దంచు నెంచియున్
సతికవమానమించుక వినంబడినంతనె తానుపాదతా
డితభుజగంబురీతిఁ బ్రకటింపక మానఁడు శౌర్యమెంతయున్॥

కర్ణ—వారదిచూచి సైరించలేకున్న తమమనంబులకు మఱింతవ్యసనంబు కల్పించుకొనుటయె కాని యంతకన్న వారిప్పుడొనరింపకలిగినది యేమి?

శకు—మిత్రుఁడా! నీవిప్పుడా భీమార్జునుల ప్రజ్ఞావిశేషంబు లెఱుంగనివానివలె మాటలాడుచుంటివి

కర్ణ—వారిప్రజ్ఞావిశేషంబులు మనబోటివారికడ మఱుంగుపెట్టుకొనకుండినఁ గలిగెడు ప్రయోజనం బాతరుణంబుననే యెఱింగెదరు.

దుర్యో—ఓయీ! శత్రులనాజిరంగంబున సంహరించుటకన్న వారి నేవిధముననైనం బట్టుకొని పరిభవముపాలుసేయుట రాజధర్మంబు. శత్రుజనశిక్షణంబు మానభంగంబొనర్చుట గాని తన్మారణంబు కాదు.

శకు—ఓయీ! సుయోధనా! నాకిందుల కొక్కయుపాయంబు పొడకట్టుచున్నది.

దుర్యో—మామా! నీకీవిషయమున మాయందఱియందును సంపూర్ణాధికారమున్నది కదా! మన మొనరించుపనులెల్ల శత్రునకెట్లుండినను సర్వజనసమ్మతములు మాత్రము కావలయును.

శకు—ప్రజాపరిపాలనమున మన మొనరించుపనులన్నియును సర్వజనాదరణీయములగునఁ జెల్లును. పామరజనంబు వాని ప్రాతిపదిక మెట్లెఱుంగఁగలరు?

ఉ. న్యాయమతిన్ విమర్శన మొనర్చి యితఁడపరాధదండనన్
జేయఁగ నర్హుఁడంచతని శిక్షనొనర్పఁగ దండనాథుఁడ;
య్యాయని యాదికారణము యోజనసేయఁగలేక, యాతఁడ
న్యాయము సేసెనంచు జనులాడుకొనన్ వినమే జగంబునన్॥

ఆదికారణంబుల నరయకుండఁ బ్రస్తుతకార్యములనుబట్టి గుణాగుణంబులరయఁ దగదు. నేనుతలంచినపని నెరవేర్పఁదలంచితేని చేతనున్న శత్రువర్గంబులనెల్ల శృంఖలానిబద్ధులం జే[illegible]నాయభీష్టంబు.

దుర్యో—(సవిమర్శముగా) నీయోజన చక్కఁగ నేయున్నదికాని యిందుకు మనవృద్ధజనంబు లేమందురో కదా!

శకు—మన పెద్దలు మనయభీష్టంబుల కేనికొడంబడిరి? వారెప్పుడును పిన్నవాండ్రెంతటి న్యాయకార్యంబులఁ జేయఁదలంచినను, నయ్యవి యొరులకాయాసజనకంబులగునని వారిమనంబులకుఁ బొడకట్టునేని తద్విఘాతంబుగావింప సమకట్టుచుందురు. కుటుంబజన మెప్పుడును గలసిమెలసియుండుట వృద్ధజనాభీష్టంబు. ఇట్టివిషయంబులఁ దోఁచినట్లు లొనర్పవలయును గాని యొరులయుపదేశంబుల ననుసరింతుమనినఁ గొనసాగనేరవు.

కర్ణ—సుయోధనా! ఇదియు ననుకూలముగ నేయున్నది. సామాన్యముగ స్వాతంత్ర్యముపోయినవారలు తమస్వేచ్ఛాప్రవృత్తికై ప్రయత్నింతురని భయంబున బానిసలఁ బ్రపంచమందెచ్చటను స్వేచ్ఛగ నుంచరు. ఇయ్యది మనసౌబలుని యుపదేశంబు ధర్మశాస్త్రానుసారమని బలపఱచుచున్నది.

శకు—అంగరాజా! నేనెప్పుడు శాస్త్రచోదితంబులును, ఆచారవ్యవహారసమ్మతంబులును గాని యుపదేశంబుల నొసంగనేరను సుమా!

దుర్యో—ధర్మజుండాడితప్పని యజాతశత్రుండని జనప్రతీతి కలదు. అదియటుండ నతనికిది స్వయంకృతాపరాధమగుటం జేసి తద్విముక్తికై ప్రయత్నించుననరాదు.

కర్ణ—మిత్రుఁడా! ధర్మజుండట్టి నీచకృత్యముల కొడిగట్టినచో నదియును మనకొకమేలే కదా! సంతతసత్యవాక్యపరిపాలకుండని జనసామాన్యమునకంతకును గలిగియుండు విశ్వాసము నేటితో నశించును.

దుర్యో—అట్లయిన నాతండు నిబద్ధహస్తుండగుట యావశ్యకంబని తలంచెద.

శకు—ఆతనివిషయంబున నెట్లుండినను సరియే.

దుర్యో—నకులసహదేవులు ధర్మజాజ్ఞానువర్తులుగదా! వారికి మనమంత భయపడవలసినది లేదు.

శకు—గీ. దూరదృష్టి సమస్తంబుఁ దొలఁగఁజేసి
ప్రస్తుతప్రతీకారంబె పడుచుఁదనము
గాంక్షసేయుట సహజంబుగాన నివుడు
కవలనీప్రతిబంధ మెక్కువగ నేఁచు॥

దుర్యో—అట్లయిన నీవిషయంబున నత్యంతజాగరూకతతో నుండవలసినదియే. ద్రౌపదింగొనితేర మనదుశ్శాసనుండువోయి చాలఁదడవైనది. ఆతఁడు కడుదుడుకువాఁడు. వచ్చువేళయైనది. ఇంక మనమాలసింపక ప్రస్తుతవిషయము కొనసాగింపఁ బ్రయత్నింపవలయును.

శకు—అందున కశేషప్రజ్ఞాధురంధరుండు రాధేయుండు సమర్థుండు. నామనంబిప్పుడు భావికాలకార్యాలోచనంబని చేయుచున్నది.

దుర్యో—అంగరాజా! నీవుపోయి శీఘ్రింబుగ వారింగొనిరమ్ము. నీవువచ్చునంతఁ ను దుశ్శాసనుండును ద్రౌపదింగొని తెచ్చు.

కర్ణ—మిత్రున కెయ్యదియిష్టంబయ్యది నాకవశ్యాచరణీయంబు. నేఁబోయి మాటపడిన మరలవచ్చెద-

శకు—పోయిరమ్ము శుభంబగు

(కర్ణుఁడు నిష్క్రమించుచున్నాఁడు)

దుర్యో—మామా! ఏమిది? మనదుశ్శాసనుండింకను రాకున్నవాఁడు? ఆమానిని కడుచమత్కారిణియఁట. ఆమెమాటలకు లోనై మనప్రస్తుతకార్యము నేమఱియుండఁడుగద!

శకు—అట్లుచేయుట కాతండంతమందుడు కాఁడు. వచ్చువేళయైనది

దుర్యో—ఆలోచనామందిరంబున సద్దుహెచ్చెనది. ఎవ్వరెవ్వరో క్రొత్తవారు వచ్చియున్నట్టులున్నది. మనమునచ్చటికేగుదము లెమ్ము

(అని యిరువురు నిర్గమించి సభాగృహమునఁ బ్రవేశించుచున్నారు)

దుర్యో—మామా! గురు విదుర వికర్ణు లిచ్చటంజేరియున్నవారే.

(ద్రోణునిసమీపించి) ఆచార్యవర్యా! నమస్కారము.

ద్రోణు—దీర్ఘాయుష్మాన్ భవ.

విదు—అబ్బాయీ! నీవిందుగూర్చుండుము. సౌబలా! నీవీపీఠము నలంకరింపుము.

(వారట్లు చేయుచున్నారు)

శకు—(బయలాలకించి) అదియేమోశబ్దము వినవచ్చుచున్నది. ఏమిచెపుమా?

విదు—అబ్బాయీ! మనకర్ణుఁడేఁడీ?

(అంతనిబద్ధహస్తులగు పాండవులతోఁ గర్ణుఁడు ప్రవేశించుచున్నాఁడు)

శకు—(సంతోషముతో) మిత్రుఁడా! రమ్ము రమ్ము.

(అందఱును రిచ్చవడి చూచుచున్నారు)

భీము—(తలపంకించి) ఏమియీదురంతము? వీరిదియేమియో ఘనకార్యమని కడుఁగుల్కుచున్నారు. ఇప్పుడీగదతోడ నొక్కమోదుమోది వీరినందఱి నొక్కసారి శమనాతిథ్యంబునకుఁ బంపుదునా? (అని గదనెత్తబోవుచున్నాఁడు)

అర్జు—(ఆపి) అన్నయ్యా! తొందరపడఁబోకుఁడు. వీరియుద్యమంబేమియో కనిపెట్టుదము. మనము స్వేచ్ఛగనుండినఁ దమకేమో హానికల్గుననికదా యిట్టిచెడుగుత్తైవంబున కొడంబడిరి. ఈపిఱికిపందలఁ గడతేర్ప నీనాడాకే లొక్కటియు

చాలదే?

ధర్మ—(తనలో) అన్నా! ఏమి? వీరియవివేకము దైవకృతంబగు కార్యంబులన్నియుఁ దమప్రయోజకత్వంబువలననె సంప్రాప్తంబులైనవనుకొని సహజమర్యాదలం గూడ నేమఱుచున్నారు. వీరికింక వివేకంబెప్పుడలవడునో?

(తెరలో)

హా! కృష్ణా! ఆపద్బాంధవా! దీనసంరక్షణా! ఈపాపకర్ముండు నాపతులెవ్వరును జెంతలేనిసమయంబునఁ దనకిదేయదనని దుర్ణయనిశ్చిత చిత్తంబునఁ జిత్తంబుఁ జిత్తజాయత్తంబుచేసి రజస్వలనని విన్నవించినను వినక యాగపశువుంబట్టురీతిఁ గేశగ్రహణమొనరించి నన్ను బలిమినిజెఱపట్టుచున్నాఁడు. వీనిబారినుండి తప్పించికాపాడుము.

(అందఱు నద్భుతమనస్కులై యాలించుచున్నారు)

భీము—ఏమిది? ఆయార్తప్రలాప మెవ్వరిదైయుండును? ఆకంఠధ్వని మనద్రౌపదిదివలెనున్నదే!

అర్జు—ఈదుష్టచతుష్టయం బిచ్చటనేయుండెనే!

సహ—అన్నయ్యా! దురాత్ముండగు దుశ్శాసన హతకుండిచ్చట లేఁడు.

(అంతఁ జేతకొప్పుముడిఁబట్టుకొని ద్రౌపదీసహితంబుగా దుశ్శాసనుండు ప్రవేశించుచున్నాఁడు)

దుశ్శా—మంచిమాటలచేతనే నెంత నీకుపకారముచేయఁబూనినను దానినెల్లఁ దృణీకరించితివి. ఏరీ? ఇప్పుడు నీపతులడ్డమువచ్చి నిన్నురక్షణసేయుదురో? చూతము. రోషముగల మానుషజన్మము గలవాఁడెవండైననుండిన నిన్నువిడిపించును. ఎదుటలేని కృష్ణు నేలవేఁడికొనియెదవు పిఱికితనమునకుఁ బుట్టినిల్లయిన గొల్లకొలంబున జన్మించి పల్లవపాణులతో సల్లాపములాడు సుకుమార శరీరుండు కృష్ణుండా నిన్నుఁ గాపాడువాఁడు

ద్రౌప—ఓదీనశరణ్యులారా! పాండుతనయులారా! రక్షింపుడు. రక్షింపుడు. ఈదురాత్ముండు కామోద్రేకంబునఁ బైఁబడుచున్నవాఁడు.

భీము—(రోషముతో గ్రుడ్లెఱ్ఱచేసి) ఆఁ. దురాత్మా! భరతకుల నిర్మూలనైకకారణా! భీమసేనుండనగు నేను జీవించియుండగనే మాసాధ్వియగు ద్రౌపది కేశాకర్షణముచేసితివిగా!

ఉ- క్రొవ్విమదాతిరేకమునఁ గోమలిఁబావకతుల్య ద్రౌపదిన్

నొవ్వఁగఁబల్కి క్రూరమతి నోటవచింపఁగరానివాక్కులన్
గ్రొవ్వదఁబట్టి తెవ్వరనుకొంటివి? పాండవపత్ని గాదురా
క్రొవ్వడఁగింతు నిన్ని పుడ గొబ్బననాదుభుజాబలంబునన్॥

అర్జు—అన్నయ్యా! శాంతింపుము. శాంతింపుము.

మ॥ ఖలులన్ గౌరవవంశపాంసనులఁబల్ కాపట్యచేతస్కులన్
గలనైనన్ మఱువంగ నోపునెవఁడీ కష్టాత్ములన్ వీడఁగా
వలదంచున్ మనయగ్రజుండు సతమున్ వారింపకున్నన్ మనం
బలరన్ బార్థుఁడొకండె వారలనఁ నాయాసంబు గాఁ జంపెడిన్॥

ఇదివఱకే ధర్మబాహ్యంబగు కార్యంబొనరించితినని ఖేదపడుచున్న యన్నగారు తమకిట్టులాగ్రహాయత్తచిత్తులైనచో మఱింత వ్యసనపడుదురు. అందుచే మీరీయుద్యమంబు తప్పక విడనాడవలయు.

ధర్మ—అన్నలారా! మీరించుక శాంతివహింపుడు. ఆకౌరవులు పరమదుర్మార్గులని లోకప్రసిద్ధియేగద! మనమీసమయమున వారలపై నలుకవహించిన మనము గూడ వారలతోడఁ దుల్యులమే యగుదుము.

భీము—మీశాంతవాక్యములే మమ్మింతవఱకుఁ దెచ్చినవి చూడుఁడు.

ఉ. నాటికి నాఁడటుల్ వెతలొనర్చిరి చెప్పఁగలేనివెన్ని యో
నేటికి నేఁడు వీఁడిటులనీసతిదొరంగి కులాంగనన్ నిరా
ఘాటతఁ బొప్పవట్టికొని కాఱులు పేర్చెడు గొల్వులోననిం
కేటి ప్రశాంతబుద్ధి యిదియేమననింతకుఁ దెచ్చెనెప్పుడున్॥

ద్రౌప—(గొంతెత్తి) దీనజనపరిపాలనాసమర్థులగు నోసభాసదులారా! మీరైన నామొఱాలకించి నాసంశయంబు నివారించి న్యాయము సెలవిండు. సకలధర్మాధర్మ విచక్షణుండగు ధర్మజుండు మున్ను నన్నోటువడి దన్నోటువడియెనా తన్నోటువడి నన్నోటువడియెనా? నేను వీరికి దాసినై యూడిగము సేయవలెనా? మదమలినమనస్కుండై, యీకురుకులపాంసనుఁడగు దుశ్శాసనహతకుఁడు నన్నేల యీసభాస్థలికీడ్చి తెచ్చె. ఈయుదంతంబంతయు నామూలాగ్రముగ నానతియీయవలయు

అశ్వ—(కృపుని చెవిలో నేమిరో చెప్పుచున్నాఁడు)
ద్రోణు—(భీష్మునిగోకుచున్నాఁడు)
భీష్మ—(సందేహముతో నూరకొనుచున్నాఁడు)

వికర్ణ—(ముందుకుజరిగి)

తే॥ గీ॥ సకలశాస్త్రవివేకంబు సంతరించి
ధర్మసందేహమడిగినఁ దత్త్వవిదులు
తెలిసినదిసర్వమును జెప్పవలెనుగాని
మౌనమువహించియుండుట మంచిదగునె॥

భీష్మద్రోణకృపాశ్వత్థామాదివృద్ధులందఱును ధర్మనిర్ధారణము సేయక మౌనముద్రితులై యీయబలవాక్యంబులకు సదుత్తరమీయకున్నారు. పరిడితపామరసేవ్యంబగు నిండుసభలోఁ దనసందియంబు నివారింపుమని యొక్కయబలారత్నంబు వేఁడికొనుచున్న వినియూరకుండుట తగవగునా? నాకుం దోఁచినదెద్దియో చెప్పెదను. దురోదరంబును, మృగయావినోదంబును, బహుభక్షణాసక్తియు, సురాపానంబునను నీనాలుగువ్యసనంబులందగిలిన పురుషుండు ధర్మబాహ్యుండై ప్రవర్తించు. అట్టిపురుషుండు మతిమంతుండయ్యు మతిహీనుండని యెన్నఁబడు. వానిచెయ్దంబులు వివర్జ్యంబులు. కితవాహూతుండై వ్యసనాసక్తినిసంచరించు ధర్మనందనుండుముందుగాఁ దానుపందెమై పిమ్మటభార్యనుగోలుపోయె. అదియునుంగాక యామెపాండవులకందఱకును సాధారణధనంబు. అదిగాన నామెయధర్మవిజిత. ఏకవస్త్రయు రజస్వలయునగు నామెనిచ్చటికిఁదోడ్తెచ్చుటయన్యాయంబు,

కర్ణ—ఏమిది! సకలవిద్వజ్జనసంస్తూయమానంబగు నీసభారంగంబున ననుపమానశాస్త్రజ్ఞానసంపన్నులగు భీష్మద్రోణకృపాశ్వత్థామాది గురువృద్ధులనించుకేనియుఁదలంచక యిందఱిలోనఁదాన మాననీయుండనను స్వాతిశయంబున ధర్మంబులనుమిషచేఁ బిలువనిపేరంటముగవచ్చి యీబాలుండేమియో కారులఱచుచున్నవాఁడు. క్రీడావినోదంబులమునిఁగి తేలుచుండు బాలకుఁడేడ? తలకుఁదగని యీధర్మాధర్మవిచారణంబేడ? ఈసభాసదులందఱును పక్షపాతచేతస్కులై న్యాయాన్యాయంబులారయక యూరకొన్నవారఁట. తానఁట, ధర్మంబులఁట, ఎఱుంగునఁట చూచితిరాయీవింత!

వికర్ణ—తెలిసియున్నపుడు చెప్పకుండుట ధర్మబాహ్యంబని యెఱింగియున్న దానిని జెప్పితినేగాని న్యాయాన్యాయవిచారణము సేయునపుడు వయస్తారతమ్యంబులాలోచింపవలెనన్న సంగతినెఱుంగనైతి. ఎవ్వారికనుగుణముగాఁ జెప్పిన నేమి యుపద్రవముకల్గునో? తమజీవనాధారములకేమి హానికల్గునో? [illegible]భీ

త్రిచేసంచరించు ద్రోణాదులూరకొన్న నూరకుందురుగాని, ధర్మదృష్టియేప్రధానమనియెన్నుకొను మేమేలమీకొదిగియుండవలెను? అందులకుమీరుకోపింపనవసరమేమి? కోపింపుడు. కోపించినమాకుఁగల్గుప్రమాదమేమున్నది? ధర్మప్రవర్తనలసంచరించు మముబోటివారలీమాటలకోటబెట్టెదరనుకొంటివా? తాటాకుచప్పుళ్లకుఁ గుందేళ్లుబెదరునా? చాలు! చాలు! ఈపాటి యామాటలుగట్టిపెట్టుము.

కర్ణ—ఔరా! ఈబాలునిపోతరము? ఈసభాసదులందఱును మాకువెఱచియూరకుండిరేమి? పాపము! ధర్మమార్గపరాయణుండన్న నిన్నొక్కని నేచెప్పవలెను (సభవంకఁదిరిగి) ఈయన యింతవఱకుపన్యసించినదంతయును నిష్కళంకంబగున్యాయంబఁట. ధర్మజుండు ద్యూతసమయంబున త్రికరణశుద్ధిగఁదనసహోదరులనందఱనోటువడి పిమ్మట తనప్రాణపదంబగు ద్రౌపదినోటువడియె. ఈపాంచాలి పాండవులందఱకును సాధారణధనంబఁట. బలపరాక్రమసంపన్నులగు సహోదరులయందాతని కధికారముండఁగా వారలకందఱకును సాధారణధనంబగునామెయేల యాతనిధనంబుకాకుండెనో? ఇది యంతయు న్యాయమేకాకున్న నిష్కారణకలహకారణులగు నీపాండవులు నంగనాచులవలెఁజూచి యూరకుందురా?

అర్జు—ఓరోరీ! సూతకులసంభవా! మేమువృథాకలహకారణులమును నీవుశాంతమూర్తివియును.

ఉ॥ అమ్మరిపోసిరాజ నివహమ్ములుసూచుచునుండమత్స్యయం
త్రమ్ములఁగూల్చిద్రౌపదిని దర్పమెలర్పఁగఁబెండ్లియాడిలో
కమ్మునఁజాలఁబ్రస్తుతులుగన్న ధనంజయుఁడింకనున్న వాఁ
డిమ్మహినంచునెంచుకొను మేమనుకొంటివొ? నీదునెమ్మదిన్॥

కర్ణ—స్త్రీలంజేపట్టుటయందు నీవెంతయుసమర్థుండవు. అందునినుఁబోలు, వీరుం డొరుండులేఁడు.

అర్జు—సమర్థులగువారలకన్ని విషయంబులును సమర్థనీయంబులే.

కర్ణ—దంభప్రలాపములయందుఁగూడ నీవుసమర్థుండవు.

అర్జు—దుర్జయశత్రుగజకంఠీరవుండనికూడ నెందుకనవు?

కర్ణ—అయ్యదిసూర్యపుత్రునిదగుట నిదివఱకేనిర్ణీతంబయ్యె.

అర్జు—సూతకులసంభవుండగుటనో?

కర్ణ—కాదు. కాదు.

గీ॥ ఇరువదొకమారు రాజులనెల్లఁజంపి
వేయిబాహులుగల్గు నీపేరివాని
నంతకునియంత్రికంబున కంపినట్టి
పరశురామునిశిష్యుఁడై ప్రబలుకతన॥

అర్జు—ఇదియంతయును గురునిప్రభావమా?

కర్ణ—గురునకులేనిమహత్త్వము శిష్యునకెచ్చటినుండివచ్చును?

అర్జు—మాతృహంతకుండగు నీగురునిప్రభావమెఱుంగనివారెవ్వరు?

కర్ణ—ఓహో హో! ఏమినీగుణగ్రహణపారీణత? నిర్మలశరీరమంతయునువిడచి వ్రణములకుఁబాఱు మక్షికములఁగేలిసేయుచున్నదే? శిక్షసేసినను రక్షసేసినను పితృవాక్యపరిపాలనా పరతంత్రుఁడగు నాతండెసమర్థుండుకావలయు. తనసంగడికాని యనుగ్రహమువడయనేరక యాతనివశంవదునిజేసికొన నెరులవేఁడికొనఁబాల్పడిన నీగురుండేమిసేయు?

అర్జు—నీగురునిపరాక్రమమెట్టిదియో పసిబాలకునిచేభంగమునొంది యాతనిబ్రతిమాలిన దినముననేజగద్విదితంబయ్యె. గురుప్రభావవివాదముతోడఁ బ్రయోజనమేమి? గురుండెంతటివాఁడైననేమి? శిష్యుండుగూడనంతటివాఁడు కావలయుఁగదా?

కర్ణ—గురునిబట్టియే శిష్యుఁడుగూడనుండును.

అర్జు—చౌర్యగ్రహణ విద్యాధనంబుచాలఁబ్రఖ్యాతిసాధనంబుసుమా!

కర్ణ—దొంగతనమో? దొరతనమో? విద్యనేర్చుటప్రయోజనము మాటలతోడఁబ్రసక్తియేల? చోరవిద్యారుచిచూచెదవుగానిరమ్ము.

అర్జు—నీమాటలుజూడఁదేనెటీఁగల తేనెనపహరించుచున్నవి.

కర్ణ—తేనెనపహరించి వానియాయుధంబులగు దంశంబులనేలకైకొనకుండును?

అర్జు—శా॥ నాఁడేమయ్యెభవత్పరాక్రమముకర్ణా! మత్స్యయంత్రంబుఁజెం
డాడంబోయినయప్పుడిర్వురకుఁ గయ్యంబొండుసంధిల్లఁగాఁ
జూడన్ లేదెసభాసదుల్ మనబలస్ఫూర్తుల్ సమస్తంబునే
జాడంబల్కఁగసాహసించెద విటుల్ చాల్ చాలునీపాటికిన్॥

కర్ణ—(రోషముతో) కృష్ణసహాయమున నిట్టిపనులింకను నీవనేకములొనరించితివి.

మ॥ ఎదుటన్ నీవిటనుండ నొక్కరుఁడునీయేణాక్షిధమ్మిల్లముం
జెదరంబట్టి సభాసదుల్ గనులనీక్షింపంగఁ దోడ్తేరనీ
వదివీక్షింపవె? నిద్రఁజెందితివె? యేమైపోయితీవత్తఱిన్
వదరన్ సిగ్గొకయింతయున్ గలుగ దేశ్వానంబుచందంబునన్॥

పౌరుషంబుగలమానవుండెవండైనఁ దనభార్యనితరుండంటినం జూచుచునూర
కుండునా?

అర్జు—(రోషముతో) ఏమి! నీకావరము. నీచంబగుసూతకులంబునజన్మించి దొంగ
తనంబుగావిద్యనభ్యసించి శాపోపహతుండవై పొట్టకూటికొఱలపంచను జేరి
మిట్టిమిట్టిపడియెదవేల? పుట్టుమచ్చలు నీటితోఁగడిగినంబోవునా?

చ॥ కొలనమెలంగుహంసములఁ గూడిచరించినయంతమాత్రనే
యలబకశాబకంబులకు నబ్బునె రాజమరాళచిహ్నముల్;
అలవడుగాక తొల్లిటి గుణాతిశయంబులెయెల్లకాలముం
గలుగవలెన్ మహత్వమది గావునజన్మమునందెయేరికిన్॥

కర్ణ—దైవాధీనమైనపని కెవ్వరుజేయునదేమున్నది? నీవలెనగ్నిసాక్షిగ వివాహమా
డినభార్యను పరాధీనమొనరించి నపుంసకునివలెనుండలేదుగదా!

అర్జు—ఊరకయున్న కొలంది మీఁదిమీఁదికిఁద్రోసికొనివచ్చు నీయసంబద్ధప్రలాపము
ల ఫలమనుభవించెదవుగాని కొంచెముకాలముతాళుము.

కర్ణ—పరాక్రమవంతుండగుమేటి మగండవైయెనచో నప్పటిశౌర్యసాహసాది
గాంభీర్యములిప్పుడేలచూపరాదో?

అర్జు—త్రిజగదవనపరాక్రమ ధారేయుండగుధనంజయుండు గాండీవంబుహస్తా
గ్రంబున మెఱయుచు సమరరంగంబునసంచరింప నీవుగాదునీవంటిపిపీలికపందలు
శతసహస్రసహస్రపరిమితులైన నొక్కనిముసములోనమడిసెదరు. ఉక్కె
క్కినసింగంబుకడనా నక్కపిల్లవెక్కిరింతలు?

కర్ణ—ఓరీయర్జునా! చతుస్సముద్రముద్రిత జరాచక్రంబుదిద్ధిరందిరుగ దిగ్గజంబుల
కర్ణపుటంబులుభేదిల్ల రోదసీగహ్వరంబుమదీయ జ్యానినాదంబుచేఘూర్ణిల్ల
నీవునువేదండసహస్రబాహుబలుండనని విఱ్ఱవీఁగునీయన్న భీముండునుగూడ
నొక్కత్రుటిలోనమడిసెదరు.

భీము—ఓరోరీ! భూనభోంతరాళంబులు బొబ్బరిల్ల చతుర్దశ భువనంబులు గడగ
డలాడించు భుజాటోపభీముండగు భీముండుగూడ నీకుచులకనాయెగా? మ
దీయదోర్దండ మండితప్రచండ గదాదండంబున నాశివకేశవులడ్డుపడినను విడు
వక నిన్నిప్పుడా యంతకునియంతికంబునకంపెదం జూడుము (అని గదనెత్తఁ
బోవుచున్నాఁడు)

అర్జు—అన్నయ్యా మనకిది యుద్ధంబునకు సమయంబుగాదు. పరాక్రమవంతులకు
బ్రల్లదంబులతోడఁ బ్రయోజనంబేమియుండును? (అని దగపైఁజేయివైచి యా
పుచున్నాఁడు)

దుర్యో—(రోషముతో) ఈప్రల్లదునిపైఁ బ్రవహించు నాప్రవాహము నీవేలయడ్డగిం
చెదవు? తొల్లి ఱెక్కలువిఱిచికట్టి విషాన్నము వెట్టి గంగాప్రవేశముఁజేసిన
నాఁడీప్రతాపమంతయు నేకొండలబిండికొట్టుచుండెనో? మున్నుమేమిల్లు
వెడలఁగొట్టఁ గాఱడవుల నాకునలమునుదిని బ్రదికి యింకనుసిగ్గులేక నేనే మ
హాబలశాలినని యేల త్రుళ్లిపడియెదవు? నాముందరనా నీప్రతాపములు?

భీము—ఓగోరీ కురుకులపాంసనా? మేమందఱమును నిజభుజాశౌర్యంబున సమస్తదే
శాధీశ్వరుల నాజిరంగంబున జయించి యార్జించిన రాజ్యంబున భరణంబుఁదిని
వైధవ్యమనుభవించుచు సిగ్గులేక నలుగురిలో నెట్లు నోరెత్తదవురా?

దుర్యో—ఓరీవృకోదరా?

ఉ. మాటలకేమి పేదఱికమా! నెరవేర్చుటదుర్లభంబు, నీ
యాటలుసాగనిచ్చుటకు నాటవికుఁడ బకుండఁగాను సూ
పోటరినై మగంటిమినిబొందినయట్టి సుయోధనుండ, నీ
మాటలుగట్టుమింక హనుమంతునిముందరఁ గుప్పిగంతులా॥

భీము—నీబోటి నరాధములనెందఱనైన నొక్కకబళంబుగ మ్రింగివేయుబకాది
నరాశనులు భీరులును నీవుధీరుండవును. అంతటి ప్రబలబలోద్ధతుండవైన నూ
ర్గురు తమ్ములను లెక్కకుమిక్కుటమగు యోధానయోధులంగలిగి మాయామా
ర్గంబుల మమ్ముజయించుటకంటె మీరందఱుంగలసి వచ్చి మీమీపరాక్రమం
బులఁజూపి మాయైదుగురింజయించి యప్రతిమానబల పరాక్రమసంపన్నులను
ఖ్యాతిసొందిన బాగుగనుండునే?

దుర్యో—మిమ్ముల ధర్మమార్గంబున జయింపలేక యిట్లుచేసితిమనియా మీయూహ.
వేయేల? జరిగినదానికి విచారింప నేమిటికి? మీసామర్థ్యంబంతయుఁజూపి

మీరాజ్యంబంతయు నిపుడేల, మాచేతంజిక్కియున్న మీభాగ్యము విడిపించుకొనుఁడు.

అర్జు—సింగంబునెదిరించి శునకంబు పలుతెఱంగుల మొఱుంగునటు లూరక యేలవదరెదరు? ఈయసంబద్ధప్రలాపములవలనఁ బ్రయోజనం బేమి? అన్నగారు వలదనుటచే ధర్మబాహ్యంబగునని వెఱచి యూరకున్న మమ్మలనేల తోలితోలి కొట్లైదరు? సమయమువచ్చినదాఁక వేచియుండుఁడు. చల్లినవిత్తనములు మొలచి ఫలోన్ముఖము గాకుండునా?

దుర్యో—మీయన్న మీబలాబలంబులెఱింగియే మిమ్ముల నిట్లువారించుచున్నాఁడు లేకున్న నాతఁడుమాత్ర మూరకుండునాయేమి?

విదు—అయ్యలారా! మీలోన మీరేల వాదులాడెదరు? ఆమానిని సభాసదులనందఱి నొక్కధర్మసందేశము నడుగుఁడని ప్రార్థింప నూరకవాదులాడుచు ప్రొద్దులుపుచ్చుచుంటిరి. సభారంగంబున నీషణత్రయములకు లోనై యధర్మంబాడిన, నందు సభ్యుండొక్కపాలును సభాధ్యక్షుండొక్కపాలును, తత్ప్రవక్తయర్థమును, ననుభవించెదరు. ధర్మాధర్మనిర్ణయము సేయనినరులు ధర్మబాహ్యులగుదురుగాన ధర్మసందేహంబు తప్పక తీర్పవలయును. తొల్లి ప్రహ్లాదతనయుండగు విరోచనుండును, అంగిరసపుత్రుండు సుధన్వుండును నొక్కకన్యాపరిగ్రహణంబునఁదమసుగుణసంపదఁ గూర్చి వివాదపడితమప్రాణధనంబులఁ బణంబు జేసికొని ప్రహ్లాదుపాలికిం జని యావృత్తాంతంబంతయును దెలియంబల్కిరి. ప్రహ్లాదుండును శంకాకులమనస్కుండై నిష్పక్షపాతచిత్తంబునఁ బుత్రస్నేహంబుపడనాడి తనకుమారునికన్న విప్రబాలకుండు గుణాఢ్యుండని వక్కాణించె. అంతసుధన్వుండాతని ధర్మజ్ఞతకు మెచ్చి పుత్రుని ప్రాణదానంబు సేసె. అదిగావున మీరును ద్రుపదరాజపుత్రియడిగిన ధర్మనిర్ణయంబు సేయుఁడు. లేకున్న ధర్మబాహ్యులగుదురు.

గీ. యుక్తియుక్తములగుపల్కు లుచితరీతిఁ
బక్షపాతంబులేకుండఁ బల్కరేని
వారువీరంచు నెంచకెవ్వారలైన
నాదరింపంగవలయుఁ బ్రమోదమతిని॥

దుశ్శా—ఓయీ! విదురా! పిలువని పేరంటముగవచ్చి లేనిపోనిమాట లేలయాడెదవు? ఈభీష్మద్రోణాది వృద్ధులందఱునూరకొనిన యట్లునీవేల యూరకొనరాదు?

చ. పరులగుణంబులన్ మిగులఁ బ్రస్తుతిచేసెద వెల్లవేళలన్
బరములటంచుఁ బాండవులపక్షమె పల్కెదు, ధార్తరాష్ట్రులన్
నిరతమునిందచేసెదవు నీవిటనుండియుఁ దిన్నయింట సు
స్థిరమతివాసముల్ గణనసేయఁగఁ జూచెదుగాకృతఘ్నుఁడా॥

ద్రౌప—(కన్నీరువిడుచుచు) ఆగర్భశ్రీమంతుండగు నంతటిమహారాజు గర్భమునందుదయించి, ముల్లోకములునిర్జింపఁ జాలిన యంతటిపరాక్రమశాలుల కిల్లాలినై చతుర్దశభువనంబుల నుదరంబున ధరియించు నారాయణునకుఁ జెలియలినైయీ సభాసదులందఱిముందఱ నవమానితనై మొఱలిడ నాధర్మసందేహంబు నివారించువారొక్కరైన లేరైరి.

ఓసభాసదులారా! మీరింత విగతకరుణార్ద్రహృదయులై యుండనేల? నేనీరికిదాసినాదునే? అయిన నేనంతఃపురమునకేగి వారింటఁ బరిచర్యలొనరించెద. నన్నేల యీసభాభవనంబున నిలిపెదరు? నామొఱాలింపరాదా? మీకైన నాయందు కనికరములేదా?

భీష్మ—అమ్మా! ద్రౌపదీ! నీప్రశ్నముల కుత్తరమా ధర్మనందనుండె యొసంగసమర్థుండుగాని యట్టి ధర్మసూక్ష్మత పరులకేరికిఁగలదు?

(సభారంగంబున నిశ్శబ్దమువిని)

ద్రౌప—ఓహో! ధర్మజా! శరణాగతరక్షకుండవని బిరుదుఁజెంది దీనజనశరణ్యుండవయ్యును బదుగురిలోఁ బరాభవమొంది మొఱలిడునను బోటి యాఁడుదానిమాట పాటింపకుండుట తగునా?

(మరల నిశ్శబ్దముగనుంటఁగాంచి)

ఆహా! మరున్నందనా! నీవుండఁగనే నీమానిని యనాథయై పోయినది. నీరాజ్యంబున నీపణామాత్రమధర్మముజరిగినదని నీచెవింబడిన, తత్కర్తలనందఱ నొక్కముష్టిఘాతంబున నంతంబునొందించి రాజ్యంబు దుర్జనశూన్యంబు గావించువాఁడవు. అట్టిచోఁ గట్టెదుటనుండి నన్నీదురాత్ములుపెట్టు బాధలుగని యూరకుంటివేల? ఇప్పుడైన నామొరాలకించి నన్ను సంరక్షింపుము.

(మరలి కొంచెము సేపాఁగి)

ఓయర్జునా! నాఁడుస్వయంవరంబున నాకై, యంతటికష్టంబులకోర్చి పేర్చిన కడంక మత్స్యయంత్రమ్ము తూటువడనేసి, యిప్పుడు మానహీనయగు, నిమ్మానిని బాణిగ్రహణమైనమాట మఱచితివా?

ఓమాద్రియులారా! మీరైన మొత్తాలకించి యీదీనురాలిం గరుణింపుఁడు.

(సభయంతయు నిశ్శబ్దంబగుచున్నది.)

కర్ణు—ఓసి పిచ్చిదానా! నీకేవెఱ్ఱియేమి? వీరందఱకును శక్తియున్నచో నిట్లు జీవచ్ఛవంబు లేలయయ్యెదరు? నీవైదుగురిపతుల వరియించితివి. వారెవ్వరును నిన్ను నీదాస్యమునుండి విడిపింపనేరరైరి. ఇంక సకలసామర్థ్యంబులుగల యొక్కనరేంద్రునినాఱవపతిగా వరించి సుఖంబుగనుము.

ద్రౌప—ఓరీ! పాపపశువా! నీకిట్టులాడ నోరెట్లువచ్చెను? పతివ్రతల పరాభవించినవాఁడెవ్వండును సుఖానందంబుగని యెఱుంగఁడు. బృందారకబృంద సంస్తూయమాన యశోవిశాలురగు పాండవభామిని నేల దుర్భాషలాడి దీపశిఖపై వ్రాలెడు శలభచయంబు చందంబున భంగంబునొందెదవు?

దుశ్శా—ఓసీ! యేవురిపతులవరియించి యింకను సిగ్గులేక పతివ్రతనని యేలచెప్పుకొనియెదవు? మానవతులగు మానినులు సభారంగంబునకు రావెఱతురు. వచ్చినను పదుగురున్నచోట మాటలాడ శంకింతురు. ఇందేదియునుంగాక సభామధ్యంబున గయ్యాళివలెనిల్చి మాటలాడినవారినందఱిని గొట్టవచ్చుచు పరపురుషులన్న భయమెఱుంగని నీవేటి పతివ్రతవు?

ద్రౌప—ఛీ! దుర్మార్గుఁడా! చెట్టుచెడుకాలమునకుఁ గుక్కమూతి పిందెలుపుట్టుతెఱంగు[illegible]భరతవంశంబు నాశనంబునొందు నవసరంబున నీవును నీయన్న దుర్యోధనుండును జననమొందిరి. భరతవంశనిర్మూలనమునకు మీరే వేరుపురుగులు.

దుర్యో—నీ[illegible]ములకేమిలే?

(తొడమీఁదఁగూర్చుండుమని కనుసంజ్ఞసేయుచున్నాఁడు)

భీము—(మిగులరోషముతో)

ఉ. పేర్లెకురోరి పాతకి విభీషణరోషవిషాగ్నికీలలన్
గూలుతుమద్గదాహతినకుంఠకఠోరశుతారధారలన్
జీలిచినీదుపెందొడలు, చేతులనెత్తుటనద్దిదానఁ బాం
చాలికురుల్ మెఱుంగిడెదశ్మోతలమంఱయు సంతసింపఁగన్॥

దుశ్శా—ఓరి వృకోదరా! మాయన్నయొక్కమాటయన్నఁ గయ్యమునకుఁ గాలుద్రువ్వుచుంటివి. పౌరుషంబుగల క్షత్రియకులజుండవైయైన నీవును నీసహోదరులు నలుగురును గలసి మీభార్యమానము సంరక్షించుకొనుఁడు. [illegible]

గా మీయొంటనున్న సమస్తాభరణంబులును మాకోసంగినపందెములోనివే కావున వానిందీసియిండు. పిమ్మట నామెకడఁ గైకొందును.

ధర్మ—అన్నా! ఎంతఘోరము తటస్థమైనది. ఈదురాత్ములు మాకడ సమస్తరాజ్యమును మాయగా నెడిచికొంటిమను సంతుష్టిలేక యింకను మాయుపరిచేలములుగూడఁ దెమ్మనుచున్నారు. పాపమా ద్రౌపదికడ నేమేమియో కైకొందురఁట.

ఉ. ఆపదలొక్కటొక్కటిగ నారయవెప్పుడు మర్త్యలోకమున్
దాఁపునఁబొంచియుండి తఱిఁదప్పకపైఁబడు నొక్కసారిగా
రూపఱియెండకాలమున రోదసినిండఁగ నొక్కపెట్టునన్
జూపునుగాదె పెన్వరదక్షోభమొసంగ, నిజాధికారమున్॥

ఇప్పుడు వస్త్రాలంకారముల నిచ్చివేసెదను. (అనివిచారించుచు నిచ్చివేయుచున్నాఁడు.)

భీము—(రోషముతో) ఈరాజ్యంబు సమస్తంబును నీసహోదరులమగు మేమును నీధనంబగుటఁ బణంబుసేయుట యుచితంబకానిమ్ము. మేదురవిరోధకారణంబగు నీదురోదరంబు మాయాసౌబల కల్పితమని యెఱింగియుఁ బాంచాలిని బణంబుసేసితివిగావున భవద్బాహుదాహంబు సేయవలయు.

ధర్మ—దుర్ణయదురోదరంబునఁ దగిలిన యీకౌంతేయాపశదుని బాహుదాహంబుసేయుటకన్నఁ దమ్ముఁడా! ఈతనిశిరఃకృంతనంబొనరించి యీపాపలోకవిమోక్షణంబుఁ గలిగించుటయే కర్తవ్యంబు.

అర్జు—(భీమునివంకఁదిరిగి) అన్నయ్యా! శాంతివహింపుఁడు. దైవతంత్రంబు లతిక్రమింప నాహరిహరాదులకైన నవిలంఘ్యంబుగదా! అందులకు మనమెంతచింతించిన నేమిప్రయోజనము? బుద్ధిమంతుఁడగువాఁడు గతించినదానికి విచారింపఁడు. పెద్దల యాజ్ఞోల్లంఘనంబు మనబోటివారికి ధర్మంబుకాదు. కావునక దయచేసి వారలమాటలు మన్నింపుఁడు.

(అని యందఱును తమతమవస్త్రాలంకారాదుల, నాయుధముల నిచ్చివేయుచున్నారు.)

ద్రౌప—ఈదురాత్ముండు నాప్రాణేశ్వరులకడనుండి సమస్తాభరణములఁ గైకొనుచున్నాఁడు. ఈతండు కడుదురాత్ముండు. నాకడనుంగూడఁ జనుదెంచు. ఈపాతకి, “మీభార్య మానసంరక్షణంబుఁగావించుకొనుఁడు” అని నాపతుల

తోఁబలుకుచున్న వాఁడు ఏమికానున్న దియో కదా? అన్నిటికిని సర్వాంతర్యామియగు నాసర్వేశ్వరుండే యున్నవాఁడు. ఒక్కసారి యాతనిని స్మరియించుకొనియెద

దండకము. శ్రీమన్మహాదేవ! దేవాదిదేవా! ప్రశాంతస్వభావా! కృపాపూర్ణభావా! మహోదారధీరప్రభావా! జగన్నాటకాధ్యక్ష! దీనాళిసంరక్షణా! నిర్వికారా! నిరాకార! యాద్యంతశూన్యా! స్వయంభూ! చిదానందమూర్తీ! జగచ్చక్రవర్తీ! పరంధామ! భక్తాళిసంసేవ్యమానాంఘ్రిరాజీవ! యోరక్షకా! లోకముల్ నీదుపూర్ణప్రసాదంబునన్ గాదె వర్ధిల్లుటల్, నీదునిర్మాణమే గా ప్రపంచబశేషంబు, నీపుత్రులే గారె లోకంబునం దందఱున్, నీయనుజ్ఞల్ గదా నిత్యముల్ సాగుటల్, తల్లియుం దండ్రియున్ భ్రాతయున్ దాతయున్ నీవ కావే, భవన్నామసంకీర్తనల్ నిత్యముం జేసి నిన్నే మదిన్నిల్పి సేవించినన్ గల్మషంబుల్ సమస్తంబుఁ దూలించి రక్షింపవే, నామొఱాలింపవే! దీనబంధూ! దయాళూ! దురాత్ముండు గామార్తుఁడై నన్నిటన్ మానభంగంబు గావింపనున్నాఁడు, లోకంబునన్ నీవనేకావతారంబులన్ బుట్టి దుష్టాత్ములం ద్రుంచి లోకంబు రక్షింపగా లేదె, నేనేమహాసాధ్వినై ధర్మముం దప్పకున్నన్ భవత్పాదపద్మంబు లెల్లప్పుడున్ నిష్కళంకాత్మఁ బూజించుచున్నన్ ననున్ నేఁడు కాపాడుటే సాక్షి; యోతండ్రి! నాపందసంబంది, నీదాసురాలిం దయాశాలివై రక్షసేయంగదే! యద్వయా! నిర్వికల్పా! నమస్తే, నమస్తే, నమస్తే నమః.

దుశ్శా—(ద్రౌపదినిసమీపించి) పాంచాలీ! నీయొద్దనుండు నలంకారములన్నియు నొసంగుము.

ద్రౌప—(సందేహించుచు దూరముగ నుంచఁబోవుచున్నది.)

దుశ్శా—నాచేతికిమ్ము. (అని చేయిచాఁచుచున్నాఁడు.)

(ద్రౌపది సందేహించుచుండఁగాఁ నామెచేతిలోని యలంకారముల దుశ్శాసనుఁడందుకొనఁబోవ నామె భయముతోఁ దెగమఱుంగునకుఁ బరుగెత్తుచున్నది. దుశ్శాసనుండామె చీరకొంగునందికొని వెంటఁ బరుగెత్తుచున్నాఁడు.)

(తెరలో)

హా! కృష్ణా! ఆపద్బాంధవా! రక్షింపుము. రక్షింపుము. ఈదురాత్ముండు దుండగంబున నామానం బెడల్చుచున్నాఁడు. నన్నుఁ గాపాడి దీనశరణ్యుండను బిరుదునందుము. నన్నేల నిదేమంచిసమయము.

అశ్వ—అన్నా! ఎంతకష్టము! ఎంతకష్టము!

ఉ॥ ఎంతటిఘోరకృత్యమొనరించెను కంటిరెయీదురాత్ముఁడే
కాంతమునందునుండు జవరాలనియైనఁదలంపకుండఁగాఁ
గాంతులుచెంతనుండఁ బరకాంతనవజ్ఞతసేయఁబాపవి
భ్రాంతహృదంతరాళుఁడయి వస్త్రములన్ వెడలించెనక్కటా!॥

ఈధార్తరాష్ట్రులు పాండవులయెడ సర్వదాయిట్టిదురాగతములే యొనరించుచుండిరి.

ద్రోణు—మేలుద్రౌపదీ! మేలు! నీప్రభావంబంతయును నేఁడుగదా వెల్లడియైనది ఏమి యీవింత? ఈతండెన్ని వలువలపహరించుచున్నను, అక్షయంబులగుచునేయున్నవి. నేఁడుధార్తరాష్ట్రులకుఁ జక్కనిపరాభవంబుజరిగినది.

భీష్మ—నీమహత్వంబంతయు నేఁడు మేమందఱముగన్నులాఱఁగని ధన్యాత్ములమైతిమి. నీయట్టిసాధ్వీమతల్లిం జేపట్టుటచేఁ గురువంశంబంతయును దరించినది భగవంతుఁడు నీయట్టిసచ్చరితలయందుగాక మఱియెందుండును?

ధర్మ—ఆ? ద్రౌపదీ! వృధామదర్థపరిత్యక్తమానధనా! ఎంతటికష్టములపాలైతివే!

సీ॥ అంతఃపురమెకానియన్యంబునేనాఁడు నెఱుఁగదీసభకు నేఁడేక్కవలసెఁ
గలలోన నైననుగలహింపదేనాఁడుఁ గలహాంతరితవలె మెలఁగవలసె
బరిచారికలవీడిచరియింపదేనాఁడుఁ బరిచర్య సేయఁబాల్పడఁగవలసెఁ
జెలులతోడనెగానిచెలిబల్కదేనాఁడుఁ బరులతోడుత నేఁడుఁబలుకవలసెఁ॥

గీ. బతులమన్నించుటయెకాని పరుసదనము
తలఁపదేనాఁడుఁ జూపంగవలసె నేఁడు
హరిహరాదులకైనను నజునకైన
దాఁటవచ్చునె? యెంచంగదైవమాయ॥

సీ॥ కస్తూరిగంధంబుఁగలయబూసెడుమేన ఘర్మాంబుపూరముల్ గనఁగనయ్యె
జాదిపూవంఛలుసవరించుకొప్పుమ్మడి వీడినవురులుజీరాడనయ్యె!
మృదుపదంబులతోడ మెలఁగుకంఠధ్వని పరుషవాక్యంబులఁబలుకనయ్యె
నానందమున నోలలాడెడిహృదయంబు చింతాభరాక్రాంతచిత్తమయ్యెఁ

గీ॥ చెలులతోఁగూడివిహరించు కలువకంటి
శాత్రవులలోనఁబరిహాస పాత్రమయ్యెఁ
గమలనయనను నానిమిత్తమునమిగులఁ
బరితపించుట నేఁడు సంప్రాప్తమయ్యె॥

ఉ॥ ఏటికి వెఱ్ఱివై సుయశోధనుతోడుత జూదమాడితిన్,
బోటులగంధి నేమిటికిఁ బందెమొసర్చితిఁ, బాపసాహసం
బేటికిఁ జేసితిన్, గృపణవృత్తులఁ జేర, విచారమొందఁగా
నేటికి, పూర్వకర్మఫలమేరికినైనఁ దరింపశక్యమే ?॥

(ద్రౌపదియేడ్చుచుమరలసభలోఁ బ్రవేశించుచున్నది)

ద్రౌప — ఓరిపాపకర్ముఁడా ! ఎంతదారుణకృత్యంబున కొడిగట్టితివిరా ! సకలరిపుగహనదహనులగు పాండవులభామినినిబట్టి మదోన్మత్తుఁడవై, యఖండభూమండలాధినాథులు నిండుకొలువున్న యీసభామంటపంబున నెవ్వరేమనుకొనియెదరోయను సంశయంబైనలేక పశుకృత్యంబొనరించితివి. అడవులలోఁగంటఁబడినదే తడవుగ సర్వమునుభక్షించుచు నెన్నఁడును మనుష్యముఖమెఱుంగని కిరాతులుగూడనిట్టిమండగంబులకు వెనుదీయుదురు. అట్టియెడ చరాచరభూతసంఘాతంబున నగ్రగణ్యంబగుమానవజాతిని, అందునను మాననిధానంబగు క్షత్రియవర్ణంబున, జన్మించి యంతరాత్మశూన్యుండవైతివేల ? నీవారినెవ్వరినైననిట్టులొనరించిన నీవేమనుకొనెదవు ? నీకిట్టిపనులయందభిలాషవొడమినస్త్రీయలవైకరిగిన లోకంబంతయు నీచెయ్వుబు మెచ్చుకొనియుందురే ? ఈప్రపంచంబుండినన్నాళ్లు పదుగురాడుకొను నవమానంబు పాల్జేసితివి. భరతకులంబంతయు నీతోడనంతఁబునొందు నవసరంబాసన్నంబైనది. భరతకులనిర్మూలనమునకీద్రౌపదీ వస్త్రాపహరణపరాభవఁబె కారణముగుఁగాక.

భీమ — (గ్రుడ్లెఱ్ఱజేసి పండ్లుకొఱుకుచు) ఓరోరీకురుకులపాంసనా ! ద్రౌపదీమానసభ[illegible]పహరణమహాపాతకీ !

శా॥ ఓరోరీ ! నిలు పాఱుబోకు ! తులువా ! ఘోరోరిపాపాత్మ ! ఛీ !
ఘోరాలాపములాడి మత్కులసతిన్; గోడొందఁగానీసభన్
జీరల్దుల్చినపాపమీఁగుటకిదే సిద్ధించెఁగాలంబు, దు
ర్వారక్రోధమహాగ్ని కింధనముగా వైతున్ నినున్ దుర్మతీ॥

ఓసభాసదుల్లారా !

మ॥ ఇదెయాలింపుడుమీరలందఱు నృపాధీశుల్ విలోకింప సం
పదగర్వంబునఁగ్రొవ్వి రాజసభనెవ్వండీ మహాసాధ్వి ద్రౌ
పదిమానంబెడలించె నానరపశున్ బాదంబులన్ దన్ని చీ
ల్చెదఁ జేవ్రుల్ వడిఁబట్టవ్రచ్చెద శిరచ్ఛేదంబు గావించెదన్॥

స్రగ్ధర — నే నీచండాలు నుద్యన్నిశిత కరదపై నెత్తురుల్ ప్రోల్లిపాఱన్
వీనిన్ వ్యాఘ్రేంబజంబున్ విఱుచువిధమునన్ క్రేవులన్ దోడివైతున్
బ్రాణంబుల్ గొంచు హస్తాబ్జములరుధిరమున్ బట్టి మర్దించి దానన్
వేణీసంహారమేనివ్వేళఁదికపుడు కావింతుఁబ్రోద్దామలీలన్॥

(ద్రౌపదివంకఁదిరిగి) సఖీ ! నీవంతవఱకును, నీకురులనుముడువఁగూడదుసుమా! ఈదుశ్శాసనహతకునిజంపి యారక్తముచే నీకురులు మెఱుఁగిడిముడివైచెదను.

అర్జు — అన్నయ్యా ! ఇట్టివేగిరపాటునకిదిసమయంబు కాదు. పాండవులధర్మవర్తనలను నపయశంబురాకుండఁగాపాడుము. బంగారమునకుఁ గాకలు హెచ్చిన కొలంది వన్నెవాసులు హెచ్చుచుండునుగదా !

భీష్మ — (తనలో) ఈభీమునియాకారంబుఁగాంచిన నీసభనంతయు నొక్కపెట్టున మ్రింగివేయునట్లగపడుచున్నవాఁడు. (విదురునిబిలిచిరహస్యముగ) ఈభీమసేనుండిప్పుడు ప్రళయావసానంబున నాకారంబుఁదాల్చునగ్నిహోత్రునివలె మహారౌద్రమూర్తియై చూడభయంకరమగుచున్నవాఁడు. ఆతనియాగ్రహంబు చల్లార్పధృతరాష్ట్రవాక్యంబులుతప్ప నొండెద్దియుఁగాదు. నీవేగమునోవేగంబున ధృతరాష్ట్రునిటకుఁగొనిరమ్ము.

విదు — మహాప్రసాదము (అని నిష్క్రమించిమరల ధృతరాష్ట్రగాంధారులతోఁబ్రవేశించుచున్నాఁడు)

ద్రోణు — మీరందఱుంచుక శాంతింపుడు. ధృతరాష్ట్రగాంధారులిదె వచ్చుచున్నారు.

(అందఱుఁదమతమపీఠములనుండిలేచి నమస్కరించుచున్నారు).

ద్రోణు — దేవా ! ఈయాసనంబునలంకరింపుడు. అమ్మా ! ఈపీఠమునసుఖాసీనవుకమ్ము.

(అనిపీఠములఁజూపుచున్నాఁడు)

ధృత — (అట్లుచేసి) దీర్ఘాయుష్మాన్భవ.

గాంధా — చిరంజీవులగుదురుగాక.

ధృత — అబ్బాయీ ! సుయోధనా ! సభాభవనంబున నీకోలాహలంబేమి ? చిలికిచిలికి గాలివానయైనదే ? పరమపతివ్రతాతిలకంబును, దిగంతవిశ్రాంతయశోవిశాలయు విశ్వవంద్యమాతృసమానురాలగుట మీకువందనీయురాలునగు ద్రౌపదీమహాసాధ్వినరయానిజగానెఱుంగక వివేకశూన్యుండవై యిట్టియకార్యకరణంబునకుఁబాల్పడుదువా ?

దుర్యో — బాల్యచాపల్యంబున నెఱుంగక మేమొనరించిన లోపంబులు మన్నింపవేఁడికొనియెద.

ధృత — నిన్ను బాలప్రాయంబు విడనాడినను, చిరకాలస్నేహముచే నీవా బాల్యమును మాత్రము విడువనేరకున్నావు. ఉత్సవవినోదమునకరప్పించి మీపితృవ్యపుత్రులతోడ నిట్టియకారణవైరంబు సంపాదించితిరనినమాట లోకంబునఁబడిన గలుగు ప్రవాదము మాన్పుకొన నెవ్వరితరంబు. మీరందఱుఁ గలసి మెలసియుండినం గలుగు ప్రయోజనంబైన నెఱుంగనేరకైతిరే ?

గీ॥ ధరణినితరులఁ జెఱుపంగఁ దలఁచుతంత్ర
వాదులను నమ్మకెపుడు ప్రమోదమలర
నైకమత్యమె బలమిలనంచు నెంచి
నడచుకొనమేలు గల్గదే నరులకెపుడు॥

(ధర్మజునివంకఁ దిరిగి) అబ్బాయీ ! ధర్మజా ! నీవు భీమాదులొక్కటిగను దుర్యోధనాదులొక్కటిగను నెంచఁదగదు. చిన్నతనంబుచే వారొనరించిన లోపంబు సైరింపవలయు. పెద్దలకు, చిన్నలయందుండు లోపములు సైరించుట విధాయకకృత్యంబుగదా ! సర్వధర్మములెఱింగినవానికి నీకు నేఁజెప్పవలసినది లేదు.

మ॥ గృహమందర్థము రుద్రభూమిని సుహృద్బృందంబు బాంధవ్యమున్
దహనుండీనవయౌవనావయవముల్ దగ్ధంబుగావించుచో
నిహలోకంబున నిల్చిపోవు మనతో నేమైన రానేర్చునే ?
సహజంబీసుకృతంబు దుష్కృతములే సంప్రాప్తమౌ నెప్పుడున్॥

ధర్మ — అట్టిభేదమీపత్తునకు గలిగియుండువాఁడను గానని నాస్వభావంబెఱింగిన మీకు నేఁజెప్పనేల ? ప్రపంచమున లోపములేనివారెవ్వరుందురు ?

ఉ॥ లోకమునంగనంబడరు లోపములుండనివారలెన్న నా
లోకము సేయ దుర్గుణములున్ సుగుణంబులుగూడనుండు, న
స్తోకసువాసనాకలిత సుందరసాంద్రమరందపూరశో
భాకరమై చెలంగు ప్రసవంబులఁ గంటకముల్ ఘటిల్లవే॥

ఎట్టివారికడ లోపముండినపుడే మనుజుని శాంతము వెల్లడికావలెను.

విదు — ఈయవమానంబు వీరందఱిలో నెక్కుడుగ మనభీమునకు మనశ్శల్యమై వేధించుచున్నది. అతండిప్పుడీలోకమునంతయును తల్లడిల్లఁజేయుచున్నవాఁడు.

అతఁడు శాంతినొందినంగాని యీయలజడి వాయనేరదు.

ధృత — అబ్బాయీ ! భీమసేనా ! అన్నపైఁ దమ్ముఁడును, తమ్మునిపై నన్నయుఁ బగఁబూనుట ధర్మమా ? నీవు పెద్దవాఁడవు. అనుపమానబాహుబలుండవు. నీవు తలంచినకార్యమునకీప్రపంచమున ప్రతిహతంబేముండును ? ఎఱుఁగకొనర్చిన నీతమ్ములలోపములను క్షమించి వారిని నిజసోదరులుగ భావింపుము.

భీము — మాకట్టిపరాక్రమమే యుండిన నీయవమానమును మరలించుకొన సమర్థులమే యైయుందుము. ఊరడింపులేల ? మాప్రస్తుతావస్థయే మమ్మూరడించినది.

ధృత — ఇయ్యది ప్రస్తుతోపశమనంబుగానీయక యీవైరగ్రహంబును నీమనంబునుండి యుచ్చాటనంబు సేయుము.

గాంధా — (ద్రౌపదివంకఁ దిరిగి) అమ్మా ! ద్రౌపదీ ! నాకోడండ్రందఱియందును నీవు మాననీయురాలవు. నీమహత్వమెఱుంగనేరక యజ్ఞానంబున నాతనయు లొనరించిన యవమానంబు సైరించి పూర్వక్రోధంబు విడనాడి శీతలాకృతి వహింపుము.

ద్రౌప — అమ్మా ! మీకుమారుల ననవేల? నాయదృష్టఫలంబున కొరులనిందించిననేమి ప్రయోజనము ?

గాంధా — నీమహత్వంబునకు మెచ్చి నీవలసినవరంబులొసంగుమని నాసాథుండు సెలవొసంగె. పూర్వవ్యాపారములు స్మరణకు రానీయక మనోభీష్టంబుఁ దెలియఁ బల్కుము.

ద్రౌప — పెద్దలయాశీర్వచనంబు మాయందు లెస్సగనున్న మాకదియపదివేలు. వేఱు వరంబులేలకావలయు ? అయిన నామనోభీష్టంబులొసంగుదుననిన వేఁడకుండుటయుచితంబుకాదు. సత్యవ్రతనిరతుండగు ధర్మసుతుండు తనదాస్యంబునుండి విముక్తుఁడగునటుల ప్రసాదింపుము.

గాంధా — అతండట్లేయగుంగాక. ఇంకొకవరంబు వేఁడుము.

ద్రౌప — నాప్రాణవల్లభులందఱును తమతమయస్త్రశస్త్రములతోడఁ దమవస్త్రాలంకారములతోడ భృత్యత్వంబునుండి బయల్పడననుగ్రహింపుము.

గాంధా — అట్లే. మఱియొక్కటికోరుము.

ద్రౌప — నీవు సకలధర్మస్వరూపిణివి. నీకుఁ దెలియనిధర్మంబులులేవు. బ్రాహ్మణస్త్రీ నూఱును, క్షత్రియసతి రెండును, వైశ్యసతియొక్కటియు, శూద్రసతి మూఁడును వరంబులు వడయనోపు. తద్ధర్మంబుల విలంఘ్యంబులుకదా !

గాంధా—శ్రీమన్నారాయణకరుణాకటాక్షంబునఁ గారణజన్ముఁడవైన నీకంటెధర్మం బులే నెక్కడెఱుఁగ నేర.

ధృత—అమ్మా! యాజ్ఞసేనీ! నీధర్మనిత్యతకు నేనెంతయు సంతసించితిని. నీవు నీదాస్యంబునుండి విముక్తవై నీప్రాణనాథులతోఁ గలసిమెలసి సుఖంబుండుము. (ధర్మజునివంకఁదిరిగి) ధర్మనందనా! మీయెడ నాకొమరులు గావించిన యపకృతులన్నియు మఱచిపొమ్ము. నీరాజ్యంబు సమస్తంబు నీవు స్వీకరింపుము. ధార్తరాష్ట్రులనందఱ నీతమ్ములతోఁ దుల్యులుగ నెంచికొనుము. న్యాయమార్గమున నీరాజ్యము ప్రపాలింపుము.

ధర్మ—పితృవాక్యపరిపాలనము విధాయకధర్మంబు. మీయనుగ్రహంబునకేనెంతయుఁ గృతకృత్యుండనై వందనంబులర్పించుచున్నాను.

ధృత—ధర్మనందనా! నీకిఁక నేనేమిప్రియము గావింపవలయునో వచింపుము.

ధర్మ—చ॥ వ్యసనములఁ జరించి, విభవంబు సమస్తముఁ గోలుపోయి, బా
నిసలుగ నుండఁ బాల్పడి, వినిందితకృత్యములాచరించు, మా
దెసఁ గరుణించి యిచ్చితి వతిప్రభవోజ్జ్వలరాజ్యలక్ష్మి నం
తసము జెనంగ నంగనికఁ దక్కువటంచు మ ఱేమి కోరుదున్॥

అయిననిట్లుగాఁగాక,

భరతవాక్యము.

ఉ॥ మానితవర్తనన్ సతులుమన్నన లందిసుఖింతు గాత, దా
మానసమున్న వైఖరిసె మాటలనాడుత మానవుల్ సదా
మానసికవ్యథల్ బుజలుమాన్చి దయామతినీప్సితార్థముల్
దీనశరణ్యుఁ డెల్లపుడుఁ దీర్చి సుఖంబులొసంగి ప్రోచుతన్॥

ధృత—తథాస్తు.

(అందఱు నిష్క్రమించుచున్నారు).

ఇది పంచమాంకము.

సర్వము

సంపూర్ణము.

ఈనాటకములోని గీతములు

ప్రథమాంకము.

కర్ణుఁడు—(౮ వ పేజీలో సీ॥ "నిటలాక్షు" ననుపద్యముపైన):

సురట—ఆదితాళము.

ఎదురున్నారె, ఈజగముననీ ॥ఎదు॥
కదనమునసీ, వదయతనిల్చినఁ
గుదురగనీతో, నెదురై పోరగ ॥ఎదు॥
1. కాలునైననవ, లీలను గెలువగ
జాలుధీరుఁడవు, జనవర
ఏలను నీకీ బేలతనంబిపుడు
చాలుచాలునవ్వుటాలితరులువిన ॥ఎదు॥ 1.

(౯ వ పేజీలో మ॥ "కలరేయింతటివేల్పులు" అనుపద్యముతరువాత).

జాతిస్వరము—ఏకతాళము.

ఇదియాసుయోధనా, మదిలోనియోచనా
హృదినింతచింత, నింతురేభళాబలా ॥ఇది॥
1. కడుమేలికారణము, గలదంచునెంచితిమే
కడకేమిలేనిదాని కావిచార్పడన్ ॥ఇది॥
2. అలపాండవులధనము - గెలువంగసాధనము
వెలయింపమేమిటనుఁడ, నింతచింతకావలెనా ॥ఇది॥ 2.

దుర్యోధనుఁడు—(౯ వ పేజీలో 11 వ పంక్తితరువాత).

అఠాణా—రూపకతాళము.

ఏమితోఁచ గానరాదు
నామది వెతలఁ గిపోవ ॥ఏమి॥
భూమిపతులలోన సార్వ - భౌముఁడనఁగ నెగడుచుండి
సామంతునివలెనుకనికి - చాలనొదిగియుండియిప్ప
డేమొగమిడి నల్గురిలో - నీమహిపాలింతునింక ॥ఏమి॥ 3.

ద్వితీయాంకము.

దుర్యోధనుఁడు—(25 వ పేజీ 10 వ పంక్తిలో).

కాఫీ—రూపకము.

సరిసరిలేమామాటల తెఁడు - సాగనిచ్చునే
జరిగెనింకమాపనులు - చాలవేగమే ॥సరి॥
వీనునీవెకాదులోక - మెల్లనెఱుఁగుపాండుసుతుల
యెడలవిరుదునకునుబ్రేమ మెక్కుడనుచును ॥సరి॥ 4.

ధృతరాష్ట్రుఁడు—(16 వ పేజీలో 10 వ పంక్తితరువాత).

బేహాగ్—రూపకతాళము.

ఏరాకుమార నీకీవిచారములేలా
1. కొదువలేక రాజ్యముచ్చే - కూతెనుగాదా
యొదవెనేమినీకులోప - ముర్వీపతులలోన ॥ఏరా॥
2. అనుజులునీమాటకెదు - రాడకుందురె
జనులునీప్రవర్తనముల - జనుచునుందురే ॥ఏరా॥
3. అడుగులకుమడుగులొగ్గరె - యరులునీకిపుడు
నెడపకనీయానజగము - నేలునెకాదా ॥ఏరా॥ 5.

చతుర్థాంకము.

ద్రౌపది—(48 వ పేజీలో 12 వ పంక్తితరువాత).

సారంగ—ఆదితాళము.

తప్పెనాదయ - దైవరాయ
ఎప్పుడునిన్నె - యేమరనిమాపై ॥తప్పె॥
1. మాయలెన్నొ పన్ని - మముఁబడఁద్రోయఁ
జేయుశత్రులకు - సాయపడనేఁడు ॥తప్పె॥
2. బ్రహ్మాండముసెల్ల - పాలనసేయఁజాలు
ఖాండవేయులనేఁడు - బాలసలఁజేయ ॥తప్పె॥ 6

పంచమాంకము.

దుశ్శాసనుఁడు—(5 వ పేజీలో క॥ "రతియో" అనుపద్యమునకుబదులు).

కాఫీ—ఏకతాళము.

1. రతియో శ్రీహరిసతియో యింద్రుని
సతియో భారతియో,
రతిపతిహరుమతిరంజించిన పా
ర్వతియో వసుమదియో ॥రతి॥
2. పాండవులీచెలియండను జేరియ
ఖండరమాపరిమండితులై
యుండిరియయుద్దండతఁజెడితమ
దుండగములవిడియుండరొకో ॥రతి॥ 7.

(56 వ పేజీలో "చెలులెవ్వారను" అనుపద్యమునకుబదులు).

కళ్యాణి—ఆదితాళము:

ఱలనాయిటువిలపింపనేల
చెలియలెందఱో - కొలువమరఁగొలిచెదునో ॥లల॥
2. ఎలప్రాయపు వెలతెలియక
అలరువంటిమేను నడలఁజేయుచును ॥లల॥
3. అంతిపురమున నతివలగూడ
నరుగరమ్మునాతో నటకుగొనిపోదు ॥లల॥ 8.

(58 వ పేజీలో 25 వ పంక్తితరువాత).

హిందూస్థానిభైరవి—ఖండజాతి.

సకియయిందుర్రాగదే
డెందముముదమందుసుఖములందుకోగదే ॥సకి॥
2. ధనముగదా ముదమిడుసా ధనముజగతిలో
ధనముతరల ముదముమరల దరిసెనమిడునే ॥సకి॥

3. అతివకరగతముగ సుఖములమరనుండగా
వెతలననుభవింతుననెడు వెడగులుందురే ॥సకి॥ 9.

(57 వ పేజీలో 5 వ పంక్తి తరువాత).

జంఝూటి—ఆదితాళము.

సందియమేల సుందరిబాలా
ఎందులకిటులబొందెదు వెతల
సొగసులచేనను - వగలనొగలజేసి
మగువలమిన్న యిటు - లగడుపఱుపనేల ॥సంది॥ 10.

ద్రౌపది—(59 వ పేజీలో 19 వ పంక్తి తరువాత).

ముఖారి—రూపకతాళము.

చెనటీపాతకిఛీఛీ
జీవితేశ్వరియనునీ - జిహ్వయట్లెపీలిపోను ॥చెన॥
1. క్రిందుమీదునకిటుల - మందమతీనరకకూప
ముందునఁజొరఁబాటిబ్రతుకు - డిందిపోవచూచుచుంటి ॥చెన॥ 11.

(59 వ పేజీలో 25 వ పంక్తి తరువాత).

సురట—ఆదితాళము.

బడిబడినాతోడఁగడు - దుడుకుమాటలాడనీదు
నడవడిమావారుగనిన - యొడలిపొగరడగించెదరుసుమి ॥బడి॥
1. ఏమనియెంచితివో - నీమనముననేఁడు
కామునిబారికిలోనై - కానిమాటలాడుచుంటి ॥బడి॥ 12.

(65 వ పేజీలో 24 వ పంక్తి తరువాత).

సారంగ—ఆదితాళము.

చారుమతి—

నాథానాదుమనవివినియా - నాతిఁజూడఁబోకుఁడీ
చూడఁబోవవైరమొన - గూడుమీకునా మొకు
కీడుతెచ్చునిజముగానది - కోడిగమనఁబోకుఁడీ ॥నాథా॥
ద్రౌపదిసాధ్వీమహిమ తరమేకొనియాడఁగ
తప్పులెంచనామెచోట - తగదునమ్మడేరికిక ॥నాథా॥ 13.

షష్ఠాంకము.

ద్రౌపది—(71 వ పేజీలో 25 వ పంక్తి తరువాత).

ముఖారి—ఆదితాళము.

హా ప్రణుతార్తిహరా కలుషాంతక - ఆశ్రితవత్సలకావగదే
పాపినుడబరకాంతనుగ్రమ్మడి - బట్టివధింపఁగఁబూనెనిదే
ఈపరినాపరితాపముబాపగ - నెవ్వరుదిక్కుఁకనిన్నుఁ వినా
ఆపదవేళలనందుసనిందున - నాశ్రితరక్షణనీదికదా॥ 14.

అర్జునుఁడు—

జంఝూటి—ఆదితాళము.

పల్లవి॥ ఓరీ నీకీబీరములేర - ఊరక ప్రేలెదుకాఱులవేరా
1. మాటలతోడమా - బోటులడిలుదుర
తాటాకులసడికిఁబలఁగునెకుందేలు ॥మాట॥
2. మొఱఁగెడుకునకము - కలచుటజగమున
సరువనియెడిమదినెఱుఁగవటరనూత ॥మాట॥
3. తనుజే నెడుచే - తలనెరులాడఁగవలె
తనుఁడామెచ్చుట - లెన్నుకొనుటవలె ॥మాట॥ 15.

శుద్ధపత్రిక.

——:(౦):——

పేజీ	పఙ్క్తి	తప్పు	ఒప్పు
1	19	అటులనే	అట్లే
4	12	నెఱుగని	నెఱుంగని
8	21	మొలలాడించ	నూలలాడించ
9	29	యనికిఁ	యరికిఁ
10	6	కానినామనంబునకొక యుపాయంబు పొడకట్టుచున్నది.	ఇదిశకునిదిగాఁ జదువవలయును
10	11	గొడ్తఁట	గొడ్డఁట
11	15	వేడుక	వేఁడుక
11	24	ఋషి	బహుఋషి
12	12	జేరఁగనీయరయ్యశుభచింతనలో	జేరఁగనీయ, రయ్యశుభచింతనల్
12	18	నటులనే	నటులే
13	6	మునుఫలపఙ్క్తి	మునుపలపఙ్క్తి
15	1	ృతరాష్ట్రి	ధృతరాష్ట్రి
	7	తనయుండశ్లేలఁగావింపఁడో	తనయుండశ్లేలకావింపఁడో
16	11	మనసు యోధనుండు	మన సుయోధనుండు
17	27	పూతల	పూఁతల
	28	పూత	పూఁత
20	17	కోపోద్ధీపిత	కోపోద్దీపిత
21	2	భీష్మని యోగంబు	భీష్మ నియోగంబు
25	23	ఆతుర్తతో	(ఇది స్టేజి డైరక్షను)
29	1	అట్లనే	అట్లే
	18	సుందరంబు	సోయగంబు
31	1	నిర్దిషితంబయ్యె	నిర్దిష్టితంబయ్యె
	18	అటులనే	అటులే
36	11	యదార్థమె	యథార్థమె
37	8	యదార్థమే	యథార్థమే
39	9	పెద్గలు	పెద్దలు

	14	అనునిముషంబు	అనునిమిషంబు
40	23	నటులఁదమ	నటులతమ
40	28	మ్రోఁడువరచిన	మ్రోఁడువఱచిన
41	25	విర జిమ్ముమ	విరఁజిమ్ముచు
43	20	ముగ్గురుని	ముగ్గురిని
45	3	మూడనై	మూఁడనై
47	7	అనునిముషంబు	అనునిమిషంబు
	24	ఆమ్మా	అమ్మా
		చాలతీడవైనది	చాలఁదడవైనది
	26	గ్రహింపుడు	గ్రహింపుఁడు
48	2	డస్సతిమి	డస్సితిమి
49	2	విథి	విధి
52	27	పద్మనిశాంఘ్రి	పద్మనిభాఁఘ్రి
54	6	నిముష మొక్కటి	నిమిష మొక్కటి
55	10	మొకము	మొగము
	27	పరాయివారు	పరులు
	29	యొంటరిగ్రపెస్వే	యొంటరిగఁబ్రస్వే
56	11	దావున	దాఁపున
57	5	బఠిహసించు	బరిహసించు
59	18	కాయజా	కాయజ
60	16, 17	మా యెడల నేక	మాయెడలననేక
62	3	దీ వెనలుగదు	నీ వెనలుగను
64	26	జాజ్ఞోల్లంఘనంబు	రాజాజ్ఞోల్లంఘనంబు
65	22	నిముషము	నిమిషము
67	1	షష్టాంకము	షష్ఠాంకము
(69, 71, 73, 75		పేజీలలోఁగూడ	షష్ఠాంకమనియే)
73	19	ధంర్మంబు	ధర్మంబు
74-76	1	దురోదవము	దురోదరము
77	19	నాటవికుండ	నాటవికుండు
79	18	యాడుదాని	యాఁడుదాని
83	22	గలయబూసెడు	గలయఁబూసెడు

4286

4286

4286

END OF
TITLE